cp11024 c

01874



894.8273
V46

పిల్లల పద్యాలు

BLANK PAGE

cp11024

సాహిత్యదర్శనము

వ్యాసావళి

కొటూరి వేంకటేశ్వరరావు

ప్రచురణ

కొటూరి కవితాలత

దుర్గాగ్రహారం :: విజయవాడ-2.

A

ప్రథమ ముద్రణ 1967 ఆగస్టు
సర్వస్వామ్యములు మావే

ప్రచురణ 8

వెల :
మూడు రూపాయలు

ముద్రణ :
దేశీ ప్రెస్, విజయవాడ.

B

ఇందులోని వ్యాసములు

1) విమర్శకత 3

2) శంభుదాసు సాత్త్వికత 15

3) రవీంద్రుడు - తపోవనసందేశము 25

4) నవల-సంఘసంస్కారము 35

5) మా బాపిరాజు 45

6) పేరిగాడు 69

7) ఆశుకవిత్వము 79

8) విదురుని విందు 93

9) "మధురభారత" మా బుచ్చిసుందరునిస్మృతి 101

10) సరస్వతీ చతుర్ముఖశృంగారము 119

11) మా గురుదేవులు 137

12) చిత్రశాల .... 147.

BLANK PAGE

ఊరకొనలేక సృష్టిచేయుచుండు వాడు కవి.
కోరితెచ్చుకొని ఆ సృష్టిలోని సుక్ష్మ దుష్కృతములను వేరుచేసి చూపును.
కవులకు నూతన మార్గములు నుద్బోధించును, తాను రసజగత్తున
విహరించి, సహృదయులను విహరింపజేయువాడు వ్యాఖ్యాత.

ఉదయమున లేచినది మొదలు మన మెన్నియో పనులు చేయుచుందుము. ఆ పనుల నేవియో ప్రయోజనము గోరి చేయుదుమే కాని అకారణముగా చేయము. కొందరీ పనులను శ్రద్ధా భక్తులతో చేయుదురు; కొందరరగొరగా, మొక్కుబడిర్చుకొనినట్లు చేసి పారవేయుదురు. ఎట్లు చేసినను అది పనియే అనిపించుకొను మాట నిజమేకాని, చేసెడిపనియందు నెఱపు కౌశలము యోగ మనిపించుకొనును. దానినే కర్మయోగ మందురు.

పూనిన పనిని శ్రద్ధాభక్తులు గలిగి కౌశలముతో ఫలపర్యం తము చేయుట అటులుండ, దానిని అందముగ కూడ చేసినచో అది కళ యనిపించుకొనును. వంటచేయుట, వస్త్రములు నేయుట, రొయిడలు పట్టుట మొదలుకొని దొంగలపనివరకు ఏ పనినేని అంద

ముగ, చూడముచ్చటగ చేయవచ్చును. ఇట్టివి అరువదినాల్గు కళలని మన పూర్వులు పేర్కొనిరి.

మనము చేయు భోజనమునకు, నేలకు నడుమ తామరపాకు గాని, అరటియాకుగాని పరచుకొని దానిలో భుజింతుము. ఈ పని త్రిప్పగనే ఆ యాకును మడచి యావల పారవేయుదుము. ఈ మాత్రపుబని కుపయోగించెడి విస్తరిని సైతము కుట్టుటలోగూడ కొందరు కళాకౌశలమును చూపుదురు. బాదమాకులనో, మోదుగ యాకులనో నాణ్యమైనవాని నేరితెచ్చి, ఎగుడు దిగుడులు లేకుండ గుండ్రముగా నమర్చి ఈనకట్టబద్దలను సన్నముగ జీల్చుకొని వానితోడ ఆ యాకును చాల సుతారముగ నంటగుట్టుదురు. సూదికుట్టుకంటె సున్నితమైన యుడి ముద్దలొలికెడి ఆ సన్నకుట్టు విస్తరిని జూచినంత ప్రాణము లేచివచ్చును. అందు భుజించుటే యొక భోగము. అట్టి విస్తరి భోజనమునకు భాజనము నగును; అందు కళాకౌశలమున వెల్లివిరియును. ఆ కళయందు పనివానిచేతి తీరును, మనసు పొందికగూడ వ్యక్తమగును. "మేలిమిబ్బై మెడ తిరుగవలె" నన్నట్లు ఉపయోగమున కుపయోగమును, అందమున కందమును కళయం దమర్చిపడుచుండును. ఆ కళావంతుని సంస్కారము, సౌందర్యబోధమును అందు తెల్లమగును.

మృచ్ఛకటిక మను నాటకమున, శర్విలకుడను దొంగ, చారుదత్తుని ఇంటికి కన్నము వైచి చొచ్చబడి నగలను దొంగిలించెను. నగలు పోయినంతలకు దిగులుచెందిన చారుదత్తుడు ఆ సొరంగపు టందచందములు చూచి దొంగని పనితనమును మెచ్చుకొనును.

ఇట్లు చౌర్యమున కుపయోగించుటేకాక, గృహాయజ మానిమెప్పునకుగూడ పాత్రమైన శబ్దాలనుని సారంగమును కళయని చెప్పదగును. కావున మన కష్టనష్టములను మరపించు ధర్మ మెచ్చటో కళయం దుండునని యొంచవలెను. తొందర తొందరగ కన్నము వ్రేయులో త్రవ్వి, లోనికి జొరబడి, ఇంటినారు మేలుకొను టకు పూర్వమే తన పని చక్కబెట్టుకొని బయటబడవలసిన దొంగ లందరును కళావంతులు కారు. శబ్దాలనునివంటివారు తాము చేసె డిని దొంగతనమున కక్కరకువచ్చు సారంగపు ద్రవ్యకామెకదా యనుకొనక దానిని తీరికగ తీర్చిదిద్దుదురు. దొంగలయందు శబ్దా లకునివంటి కళావంతు లున్నట్లే, సొమ్ము పోగొట్టుకొనిన వారి యందు పోయినసొమ్ము నూట మచ్చి దొంగవాని పనితనమును మెచ్చుకొనెడి చారుపత్రులుగూడ నుందురు. శబ్దాలనుడు కళానం తుడు; చారుపత్రుడు సహృదయుడైన విమర్శకుడు.

ఇట్లు సుందరముగ జేయు పనులన్నియు కళలే అయ్యు వీని యందు సంగీతము, సాహిత్యము ముఖ్యము కొన్నిటిని లలితకళ లందును. బాహ్యోపయోగముకంటె ఆంతరసంస్కారమె వీని ప్రయోజనము. వీని పరికరములుకూడ బాల సుస్నితములు. కుండలు చేయుటకు మన్ను, వస్త్రము, నేతకు నూలు మొదలగు పరికర ములు స్థూలములు. సాహిత్యమున కుపయోగించు శబ్దములు కర్ణ గోచరములేగాని కంటి కగపడవు. ఈ శబ్దములకు అర్థమేమియు నుండును. సంగీతమున కుపయోగించు స్వరముల కాయగము కూడనుండదు. చూపమును చూచెడికంటి కళలందు ప్రసక్తి లేకున్నను కంటి కగపడు రూపములనే కాక, అంతకంటె సూక్ష్మ

మైన భావములను గూడ నీ కళలు మనస్సునందు కల్పించును. చెవ్రలను కన్నులుగా మార్చువిచిత్ర సృష్టియిది. సంజవేళ పోతుపట్టి నెడబాసి విలపించు పెంటిరూపమును ఈ క్రింది మాట లెట్లు కల్పించుచున్నవో గమనింపుడు.

ఏ విహంగమొగన్న ఎలుగించుచును సారె
కును సైకతమ్ముల గూడ దారు.
తారి, కన్గొని అది తనజోడు గాకున్న
మెడ యెత్తి కలయంగ మింటనరయు,
అరసి, కన్నీటిలో మురలి తామర యెక్కి-
వదన మెండగ సరోవారి నద్ది,
అద్ది, త్రావగ సైప కట్టిన కన్గొని
ప్రతిబింబ మీక్షించి భ్రమసి యుఱుకు,
ఉఱికి, యెలకలు తడియ వేయొక్క- తమ్మి
కఱుగు, నటగి రవంబుతో దిరుగుచేట్ల
బొడుచు ముక్కున, మరియును బోవు వెదక
సంజప్రియుడాసి పగనొక్క చక్రవాకి

చక్రవాకి రూపమును, చేష్టలనేగాక; దాని మనస్సునందలి బాధనుగూడ మన కన్నులయెదుట నిలబెట్టుచున్నాడు కవీశ్వరుడు. ఇట్టి భావములకు గూడ రూపకల్పన చేయుశక్తి యితర కళలలో నంతగ కనుపించదు. ఈ లలిత కళలయందు మన మెరిగిన రూప ములే రసభావములచే రూపాంతరములను ధరించును.

ఈ విచిత్ర సృష్టిని పరిశీలించి, ఆసందించుశక్తి అందరకు నుండదు. చారు దత్తునివంటి విమర్శకులు ఈ కళామర్మమును విప్పి

చెప్పవలసి వచ్చినది. కళలన్నింటికి గొన్ని ధర్మములు, వేర్వేరు పరికరములు నుండును. అటులే సాహిత్యమునకుండు ధర్మములను; అందుల కుపయోగించు పరికరములను, అవి సాధించు ప్రయోజనములనుగూర్చి అలంకారశాస్త్రము పుట్టినది. ఆ శాస్త్రలక్షణములనుబట్టి కావ్యములందు అలంకారికులు గుణదోష విచారణ చేయుచు వ్యాఖ్యానించుచుకు. అట్టి వ్యాఖ్యాతలనే మనమిప్పుడు విమర్శకులని యనుచున్నాము.

కావ్యము శబ్దమయము గాన శబ్దమే దాని శరీరము. ఆ శబ్దముల యర్థమే కావ్యమునకు ప్రాణము. ముందుగ శబ్దములను విభజించి, అటుపిమ్మట వానికి అర్థముచెప్పి, పిమ్మట ఆ శబ్దార్థముల పరస్పర సంబంధమును వివరించుకు వ్యాఖ్యాతలు. శబ్దము సంము, అర్థమునందు దోషములున్నచో తెలియజెప్పుదురు. పిమ్మట తాత్పర్యము చెప్పి కావ్యమందున్న ముఖ్య భావమును వివరింతురు. కావ్యమునందు శబ్దములు ఛందోమయములుగా నుండును గాన ఆ ఛందఃస్వరూపమును జెప్పి శబ్దములకు అర్థములకు సొంపుగూర్చిన అలంకారమును గూడ తెలుపుచుందురు. ఇటీవలి వ్యాఖ్యాతలు; కవులు మొదలగు శిల్పుల కాలమును, అప్పటి సాంఘికస్థితిని, రాచరికమును తెలియజెప్పుచు ఆ దేశకాల ప్రభావము ఆయా కవుల గ్రంథములలో శిల్పుల శిల్పములలో నెట్లు ప్రతిఫలించుచున్నవో వ్యాఖ్యానించుచున్నారు. కావ్యవస్తువును, అందలి పాత్రల శీలాదికమును ఔచితినిగూడ పరామర్శింతురు. స్థూలముగా వ్యాఖ్యానపద్ధతి ఇదియే.

అటులే గాయకుడు ఒకపాట పాడును. ఆ పాట నే రాగ

ములో, ఏ తాళమున బాడెనో, ఆ రాగతాళ లక్షణము లెట్టిదో వివరించినచో ఆ పాటను వ్యాఖ్యానించి నట్లగును.

కాని ఇంతమాత్రముచే వ్యాఖ్యానముగాని, విమర్శముగాని ముగిసినట్లు కాదు. విజ్ఞానశాస్త్రవేత్త పదార్థములను పరిచ్ఛిన్న మొనర్చి తత్త్వవిచారణము చేసినట్లు, కావ్యముల అంగప్రత్యంగ పరిశీలనచే గుణదోషవిచారణచేయు నీ విమర్శనమును కళ యను టకు వలనుపడదు. కళలు కల్పించిన రసభావరూపములను పరిచ్ఛిన్న మొనర్చి చూపుటను కళ యనబడలదు. కళ అనునది సృష్టికాకపోయినను ప్రతిసృష్టి. మరి యీ విమర్శములో సృష్టి లేకపోగా ఉన్నదానిని విడదీసి చూచుట జరుగుచున్నది. కావున నీ విమర్శము పనికిరాలేదు. కావ్యార్థమును గ్రహించుట కిది అక్కరకువచ్చును; నిజమే కాని ఇందు రూపకల్పన లేదు గావున ఇది కళ మాత్రము కాజాలదు. కథాహృదయమునుచేరుట కిది దారి వంటిది. మరి ఈ విమర్శము కళ ఎప్పుడగునందురా — మనవిచేయుదును.

అజంతాగుహాచిత్రములయందు ఒకానొక చిత్రమున బాలకు డొకడు నిలిచియున్నాడు. వాని వెనుక నొక స్త్రీమూర్తి నిలిచి యున్నది. ఆ బాలుని భుజములపై తన కరతలములు లించి యించుక వంగియున్న దా స్త్రీమూర్తి. బాలుడు మోడ్పుకన్నులతో పుండు నకు దూరపుజూపులు పరపుచున్నాడు. వాని చూపుల వెంటనే ఆ తల్లి చూపులుకూడ ప్రసరించుచున్నవి. దీనిని వ్యాఖ్యానించు నప్పుడు బాలుని వయస్సును, ఆ స్త్రీ వయస్సును చెప్పి, వారి శరీరవర్ణమును సౌకుమార్యమును సూచించు రేఖలను వివరించి,

విమర్శకు

వారు ధరించిన వస్త్రములను ఆభరణములను వర్ణించి, వారు వీభంగిమలో నిలిచియున్నారో తెలిపి, వారి నేత్రములు ఆకర్ణాంతములనియు, వారు మాతాపుత్రులనియు, వాకిట నిలిచియున్నారనియు పైపైన చెప్పి వ్యాఖ్యాత ఆ చిత్రములోని వర్ణములు, వాని సమ్మేళనమునకూడ వివరించు ననుకొనుడు. ఈ వ్యాఖ్యానమువలన మన మెనుటనున్న రూపమునకు వ్యాచ్యార్థము చెప్పినట్లయినది. అంతియకాని వారియందు సచట నెందులకు నిలచియున్నారు ? వారి చూపులు దేనిని చూచుచున్నవి ? .అను ప్రశ్నల కిందు సమాధానము లేదు. ఈ తల్లి బిడ్డల రూపములచే చిత్రకారుడు మన కేమి చెప్పవలచుకొన్నాడు ? వారి చూపులును, వినమ్రమైన వారి శరీరభంగిమలు నేమి ధ్వనింపజేయుచున్నవో మనకు పైపైన చెప్పినపు డీ విమర్శకు కళ యనిపించుకొనునా. కేవలము తల్లిని బిడ్డను చూపించుటకాదు చిత్రకారుని ఉద్దేశము. ఆ మూర్తులు రెండును భక్తిని వినయమును మనకు పట్టియిచ్చుచున్నవి. అవి బౌద్ధగాంధార చిత్రము లగుటవలన భక్తిమయమైన వారి చూపులలో వినమ్రశరీరములలో మోడ్పుచేతులలో - దవ్వులనుండి భిక్షార్థమే తెంచుచున్న బుద్ధభగవానుడు మనకు ప్రత్యక్షమగుచున్నాడు. అంతటి ఆ తల్లి బిడ్డలలో యశోధరా రాహులులు కూడ మనకు దర్శనమిత్తురు. అపుడు వారి మూర్తులు భక్తి భావమునకు కల్పించిన రూపాంతరములై మనకు దర్శనమిచ్చును. ఇట్లు శిల్పి చేసిన రూప మందు, రసమయమైన రూపాంతరమును దర్శించు విమర్శనము కళాగౌరవము నందుకొనును.

మరియొక యుదాహరణము మనవిచేయుదును. మల్లీశ్వరి యను చలనచిత్రమున నాయికా నాయకులు చిరవిరహానంతరము,

నదీతీరమున అర్ధరాత్రమున పండువెన్నెలలో రహస్యముగ సంకేత స్థలమున కలసికొనిరి. తిరుగ నిన్నాళ్ళకు కలసికొన్న నాయికా నాయకు లా సంతోషములో తమ కష్టములన్నింటిని మరచిపోయి, ఒకరిపై నొకరొరగి హృదయభారము తీరున్నట్లు ఏవియో ముచ్చట లాడుకొనుచున్నారు. నాయిక పెంటవచ్చిన చెలికత్తె దూరముగా నిలచియున్నది. సుఖపారవశ్యముచే సల్లాపము లాడుకొనుచున్న పడుచుజంటచిత్ర మంతట మరుగైపోయి, పిమ్మట చెలికత్తె చిత్రము మనకు కన్పించును. చెలిమికత్తె తటాలున సిగ్గుతో నచ్చ్వాచు మొగ మావలకు త్రిప్పికొన్నది. అప్పుడా చెలికత్తెరూపమంపు చిత్ర కారుడు మనకు దేనిని ధ్వనింపజేయుచున్నాడో తెలియజెప్పరాదో ఆ విమర్శనము కళ యనిపించుకొనును. మన మిపుడు మంద హాసము చేసి సిగ్గుతో మోము త్రిప్పుకొను చెలికత్తె రూపములో మన యెదుట లేని నాయికా నాయకులను మనము చూడవగినంత వరకు చూచితిమి. తరువాతి కథను చెలికత్తె ముఖముపై చూడ గలిగితిమి. విమర్శకుని కళాసృష్టి చెలికత్తె రూపమునకు రూపాం తరమును కల్పించి చూపినది.

మరి, యీ విమర్శకళ స్వతంత్రము కాదనియు, కావ్యాది కళలు లేనినాడు దీనికి ఉనికి లేదనియు కొంద రనవచ్చును. నిజమే కాని, ఆ దృష్టితో చూచినచో కావ్యములుకూడ స్వతంత్రములు కావు. అవియు లోకమునకు సౌందర్యపరముగా చేసెడి వ్యాఖ్యాన ముల వంటివే యగును. లోకమును వ్యాఖ్యానించు ఇతర కళలను విమర్శకళ వ్యాఖ్యానించుచుండును. అంతియేకాదు; సహృదయ మైన వ్యాఖ్యాత లేనినాడు, కావ్యాది కళలు తమ సార్థక్యమును

కోలుపోయి మూగవి గ్రుడ్డిని అయిపోవచ్చును. ఎందుపల్లనన్నచో కావ్యాది కళలు స్వతఃపూర్ణములు కావు. వ్యాఖ్యానముపల్లనే వానికి నూత్నశోభయు, రామణీయకము లభించుచుండును. అది యెట్టిదో పరిశీలించి చూతము.

ఈ లోకమందు మనము కష్టసుఖములను, రాగద్వేషములను పొందుచుండగా, కవి దీనియందు రసభావములను దర్శించుచున్నాడు. ఆతనికి అతీంద్రియానుభవ మగుటపలన ఆ యనుభవమును చెప్పుటకు ఆతనికి మన మాటలు చాలవు. ఇంద్రియభోగ్యమైన రూపములను చెప్పుటకు మాత్రమే పుట్టిన శబ్దములు అతీంద్రియమైన రసమును చెప్పలేవు. మరి ఈ శబ్దములకంటె కవులకు ఇతరోపకరణము లున్నవా అన్నచో లేవు. వారు ఏమి చెప్పినను శబ్దములు, అసమర్థములు అయిన శబ్దములపల్లనే చెప్పవలెను. అందువల్ల వారు యీ శబ్దములను ఛందోబద్ధము లొనర్చి యమకాదులచే అలంకరింతురు. ఇంతచేసినను, అవి లౌకికార్థములనే చెప్పనుగాని ఇతరమును చెప్పలేవు. కనుక కవులు తాము దర్శించిన అతిలోక సౌందర్యమును ఉపమలచే, ఉత్ప్రేక్షలచే ధ్వనింప చేయుదురు.

"తన యొప్పెమటగన్న జనుల కెవ్వరికేని మలగి క్రమ్మర జూడ వలయునాడు" అనుచు, నకులుని సౌందర్యమెట్టిదో మనకు స్పష్టముగ చెప్పలేక, మార్గాంతర మవలంబించి, ఆ రూప సౌభాగ్యమును కవి మన ఊహకు వదలిపెట్టెను. విరటుని అంతఃపురమున పరిచారికగా ఉన్న ద్రౌపది తన కష్టములను భీమునితో చెప్పికొనుచు, నిత్యము గంధముతీసి రాణికి నలుగు పెట్టుచుండుటచే,

"ము స్నటులున్న పాణితలముల్ బలుకాయలు గాచె జూచితే !" అనును. ఆ పాణి తలముల పూర్వ సౌకుమార్యమును ఇప్పటికతకు దనమును ఈ మాటలు మన ఊహా కందించుచున్నవి. ఇట్లు ఎన్ని ఉపాయము లవలంబించిను ఇవి యన్నియు ఆ కవుల అనుభవ మును ధ్వనింప జేయగలవేకాని శృంగగ్రాహికముగా మన ఎమట నిలుపజాలవు.

రూపాంతరముల వలన కవులు తమ సౌందర్యబోధమును మనకు అందించు ప్రయత్నమున వారు ఉపయోగించిన శబ్దములు స్ఫటికములవటివై, తెరచిన కిటికీలు, ద్వారములుగ ఉపచరించును. వ్యావహారికములైన ఈ శబ్దములు సౌందర్యమయమైన కవిభావన యందు కరిగి క్రొత్త వన్నెలను, రుచులను, వాసనలను అలవరచి కొని, కవిభావితమైన దివ్యలోకమునకు తెరచిన ద్వారము లగు చుండును. ద్వారములు, కిటికీలు అన్ని తెరచిపెట్టుటయే కళలు చేయుపని. శబ్దముల ఆవరణములను భేదించి, వానికి రెక్కలుగట్టి, ఆకాశమున వదలినచో వానిని పట్టుకొని, వానిపై ఆసీనులమై మనము కవిభావిత దివ్యసీమలకు ఎగురగలుగుదుము. అంతియేకాని, కళలు సౌందర్యమును గోరుముద్దలుగ మననోటి కందీయవు... అందీయలేవు. వారు కల్పించిన అతీంద్రియ జగద్విహారము చేయు శక్తియు, అధికారము, యెల్లరకు లభింపవు. కావున, మనకు వాఖ్యాతతో అవసరము కలిగినది. కని కల్పించిన శబ్దమయ రూపము డేనిని ధ్వనింపజేయుచున్నదో ఆతడు పసిగట్టగలడు. ఆతడు కావ్య పరిశ్రమము అధికముగా చేసినవాడు. లోకానుభవము కలవాడు. సౌందర్యబోధము కలవాడు. ఈ సంస్కారము వలన విమర్శకుడు

మనకు కవిత్వావలంబన మిచ్చి కవికల్పిత సుందరసీమల లోనికి నడిపించుకొని పోగలదు. మన అందరిలో సౌందర్యబోధము ఉండనే యున్నది. కాని, అది నిద్రించుచున్నది. దానిని మేలుకొలుపుటవరకే కవులు చేయునది. తదుపరి చేయవలసినపని యంతయు వ్యాఖ్యాతదే. కవిచేతిలో ఐశ్వర్య పూర్ణములు, ఆనందమయములు అయిన శబ్దములను మనచే ఆస్వాదింపజేసి, వానిని చర్వణము చేయించును విమర్శకుడు. ఆ శబ్దముల ద్వారమున, దూరముగా మనక మనకగా కనిపించు రసరూపములను మనకంటికి చూపెట్టుచుండును.

ఇక్కడ ఇంకొక విశేషముకూడ ఉన్నది. కవి తన సౌందర్యబోధము కొలది, తన సంస్కారబలముకొలది ఒక సుందరరూపమును భావించి, దానిని అందుకొనుటకు శబ్దమయమైన కావ్యము నిచ్చిపోవును. దానివలన విమర్శకుని రసలోక సంచారమునకు ఆధారము కల్పించినట్లయినది. అంతియ. ఇక ఆ మార్గమువెంట విమర్శకుడు యెంతదూరము పోయినను ఆతనికి అడ్డులేదు. కవి చూడని సౌందర్యమును కూడ చూచుట కాతనికి స్వతంత్రత ఉన్నది. ఎందువలన నన్నచో వ్యావహారిక జగత్తునకు హద్దులున్నవి కాని, అతీంద్రియ జగత్తునకు హద్దులులేవు. అసీమము, అగాధము నయిన ఆ లోకమున ఎవరి సంస్కారము కొలది వారు విహరింప వచ్చును. సౌందర్యము నిరవధిక మయినట్లే మన భావనకూడ నిరవధికము. కవి తెరచిపెట్టిన గవాక్షములనుండి మంద దృష్టులు, కొలది దూరము మాత్రమే చూడగలరు. తీవ్రదృష్టు లింకను ఎక్కువదూరము చూడగలరు. ఎంత చూచినను తనుగని దాని పరసీమను కవియు చూడలేడు; విమర్శకుడును చూడలేడు.

కావుననే రస శబ్దవాచ్యమైన ఆ యానందము అనిర్వచనీయము. సంసార జంబాల మంధ చిక్కుకొని వ్యథలపాలైన యీ లోక మునకు పాలకడలివంటి యానందములో కవులు, శిల్పులు, వ్యాఖ్యాతలు, ఏ లవలేశమో అందించి యీ బ్రదుకులో నించు కించుక తీపిని చిలుకరించు చుంచ్తును. వారికి మన మెంతేని ఋణపడి యున్నాము. వాకు ధన్యులు. వారి చూపుప్రేమ వెంట చూడ గలిగిన మనమును ధన్యుల మగుదుము.

శంభుదాసు సాత్త్వికత

కవులలోగూడ కొందరు వీరులుందురు. "ఈ భోజిక్ నిను బోలు సత్కవులు లే రీనాటి కాలమ్మునన్" ... అనుచు కృతిపతి ముఖమున శ్రీనాథుడు తన ఆధిక్యమును చాటుకొనెను.

"ఉభయం బస్తనగంబు సేతువు హిమవ్యూహంబునున్ జుట్టిరా విదితం బైనమహిన్ మహాంధ్ర కవితా విద్యా బలప్రౌఢి నీ కెదురేరీ సరసార్థ బోధఘటనా హేలా పరిష్కార శౌరద నీ రూపము రామకృష్ణ కవిచంద్రా. సాంద్రకీ ర్తీశ్వరా!" ... ఇది రామకృష్ణుని ప్రతాపోక్తి. ఇదియు కృతిపతి ముఖమున పలికించినదే.

ఇంతకంటె బాహాటముగ తమప్రజ్ఞ చాటుకొన్నవారు, ప్రతిజ్ఞలు చేసినవారు, శాపానుగ్రహశక్తి యుక్తులు నున్నారు మన కవులలో. ఈ ప్రౌఢ తెలుగుకవుల నోసటనే పొడిచినదేమొ అనుకొంద మన్నచో, సంస్కృత కవులలో కూడ పండితరాయలవంటి జగజ్జెట్టులు, పేరువాడి పరాక్రమించినవారు కనిపించుచున్నారు.

ఇట్టి కవుల నందరిని స్థూలముగ రజోగుణ ప్రధానులని చెప్ప వచ్చును. సాహిత్యరంగము వీరికి యుద్ధరంగము వంటిది. భారతావతారికలో "నా నేర్చినయట్లు చెప్పి వరణీయుడ. నయ్యోద భక్తగోటికిన్" అనుచు వినయవంతుగా చెప్పికొనిన తిక్కన సోమయాజికూడ వయసు పొంగులో చెప్పిన ఉత్తర రామాయణములో "అమలోదాత్త మనీష నే నుభయ కావ్యప్రౌఢి పాటించు శిల్పసు నం బారగుడన్ గళావిదుడ" ననుచు నిజప్రజ్ఞను చాటికొని నాడు.

శమదమ సంపన్నుడని చెప్పదగిన నన్నయభట్టుకూడ విపుల శబ్దశాసనుడ ననియు, నానారుచిరార్థ సూక్తి నిధిననియు ప్రథమ పురుషలో చెప్పినను స్వయముగ చాటుకొనినటులే.

లోకమున ఇతర విద్వాంసుల వలెనే కవీశ్వరులు తమ ప్రజ్ఞాప్రకర్ష నిట్లు వెల్లడించుట పరిపాటిగ వచ్చుచున్నదియే, కనుక దీనినొక దోషముగ పరిగణింప బనిలేదు. వీరందరి స్వభావమున రాజసపుబాళ్లు కొంచె మెక్కువగనె ఉన్న వనుకొనవలెను.

వీరి యంసు కొంచరు గడుసు వారుందురు. "మందఃకవియశఃప్రార్థి గమిష్యా మ్యపహాస్యతాం" అనుచు రఘువంశమున పరమ వినయము ప్రకటించిన కాళిదాసుకూడ శాకుంతలమునందు అభిరూప భూయిష్టమైన యీ సదస్సునందు తన నాటకమే ఆడదగిన దనుచు ఆత్మోత్కర్ష మార్గాంతరముచేత చెప్పికొనినాడు. మహాభక్తు డనిపించుకొనిన జయదేవుడంతటివాడు తాను 'సాధ్వీవతా చరిత చిత్రిత చిత్త పద్మ' ననినాడు. అంతటితో పోక "యది

హరిస్మరణే సరసం మనో; యది విలాస కలాసు కుతూహలం,
మధురకోమల కాంత పదావళీం శ్రుణు తదా జయదేవ సరస్వతీం"
అనుచు కంఠోక్తిగా ప్రజ్ఞా ప్రకటనము చేసికొనినాడు.

ఇంతకు, చెప్పవచ్చిన దేమన కవీశ్వరులకిట్లు చెప్పికొనుట ఆచారముగ వచ్చుచున్నదనియు, కవులు రజఃప్రధాను లనియు. అంతియకాదు. ఏ కొంచెమొ రజో గుణాధిక్యము ఉన్నవారలె కవు లగుచుందురు. ఎందువల్ల నన, కవిత్వ మన నది సృష్టికార్యములలో చేరును, సృష్టికర్త మెప్పుడును రజోగుణాధిక్యము వలననే జరుగు చుండును.

కావునసే సృష్టికర్తయైన చతుర్ముఖుని, పెద్దలు రజఃప్రధాను డనినారు. మూడు గుణములకు మూలమైన పరశక్తి, సరస్వతి, లక్ష్మి పార్వతులుగా, త్రిమూర్తుల వలన సృష్టి స్థితి లయములకు కారణ మగుచున్నది.

కాగా, సరస్వతి రజశ్శక్తి. సకల సృష్టికి మూలమైన శబ్ద ప్రపంచమే ఆమె. ఆ రజశ్శక్తి అనుగ్రహము వలననే విధాతసృష్టి క్రియకు సమర్థుడగుచున్నాడు. వాగ్దేవతయైన ఆ బ్రాహ్మీశక్తి ఎవ రికి ప్రసన్నయగునో వారందరు వాల్మీకివలె, కవీశ్వరులై శబ్దరూప మైన సృష్టి చేయుచుందురు.

పరమేశ్వరుడు సృష్టించిన జగత్తు త్రిగుణాత్మకమైనట్లె, కవి కల్పించిన కావ్య జగత్తుకూడ త్రిగుణాత్మక మగుచుండును.ఆ కవులు రజోగుణాధికులైనచో వారి కావ్యములందు ఆ గుణము ప్రస్ఫుట మగుచుండును. కారణగుణము కార్యమందు కనిపించుట లోకప్రసి

ద్ధమే కదా! కావునన్నే, కార్యమునుబట్టి కర్తృస్వరూపమును మన మూహింప గలుగుచున్నాము.

ఇక విచారించుదము- ఎట్టిన సాత్త్వికత ఎట్టిదో, కావ్య ముఖమున తన్ను గూర్చి ఏమి చెప్పికొనినాడో. దానినిబట్టి ఆతని స్వభావము మనకు తెలియుచుండును. హరివంశ కృతిపతియైన వేమారెడ్డి ఎట్టియనుగూర్చి ఏమనినాడో చూడుడు. "నకలభాషా కవిత్వ విశారదుడవు, సాధు సమ్మతుడవు, నిత్యసౌమ్యమతివి, భవ్యుడవు" అనినాడు. ఇందు "సకల భాషా కవిత్వ విశారదుడు" అనెడి విశేషగుణ మొక్కటి వదలినచో తక్కిన విశేషణము లాతని వినీతిని స్పష్టముగ చెప్పుచున్నవి. ఇంతటి వినీతిపతి కావునన్నే ఆరణ్య పర్వశేషమును నన్నయ రచనగా పూరించ గలిగినాడు. నన్నయ భట్ట మహాకవీంద్రుని .సరస సారస్వతాంశ ప్రస్తి తన్ను ఏ మాత్రమో చెందినది కావుననే తానీ ఘనకార్యముచేసి ధన్యుడ నైనా నని చెప్పి, ఆ ఉత్కర్ష నన్నయ్యకే ఆపాదించెను. యెఱ్ఱో చెప్పి అసంపూర్ణముగ విడిచిపెట్టిన గ్రంథమును సాధుజన హర్ష కోస మని అటుల పూరించు పుణ్యకార్యము ఎట్టియవంటి నిరహం కారికే చెల్లినది.

అయినచో, ఎట్టిన తన ఈ గుణ గరిష్ఠత నెరుగనివాడు కాడు. కావుననే నృసింహ పురాణమున "వినయోదయ భరితు" డనెడి విశేషణము వాడి కొనినాడు. ఈ వినయమే నన్నయభట్ట తిక్క కవినాథులపట్ల ఆతనికి అపారమైన భక్తిని పెంపొందించినది. కాగా,ఆతని ఆరణ్య పర్వశేషోన్నయము పరమేశ్వరార్పణ బుద్ధితో అతడుచేసిన సత్కర్మముగా మనము ఎంచి కొనవలసి యుండును.

నృసింహ పురాణమందే మరియొక పద్యమున అనుచున్నాడు కదా —

'మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టిగ్రమ్మ రా
యించలుగూయ, క్రొంచమును నావలగూయగడంగు భంగి, ప్రౌ
ఢాంచిత శబ్దసాయలు మహాకవు లాద్యులు, కావ్యశయ్య గీ
లించిన కీర్తిసంగ సుధలీలకు నేనును గాంక్షచేసితిన్....

దీనిలో "నేనును గాంక్షచేసితిన్" అనెడి మాటలకు బదులు "కాంక్షయొనర్తు కాకవుల్" అనిచో ఇతర కవులు చేయు కుకవి నిందతో ఇది అచ్చము సరిపూగెడిది. మరి యీ నిందను గుణ గరిష్ఠుడైన యెఱ్ఱయ తనయందఁ ప్రయోగించుకొనినాడు. "మండఃకవియశఃప్రార్థి" అనెడి యీ అల్పత్వానుసంధానము కాళిదాసు సకే చెల్లినది; మరల శంభుదాసుసకే చెల్లినది. "పలికించెడివాడు రామభద్రుండట" అని చెప్పికొనిన పోతన్నవంటి భాగవతశిఖామణికూడ, "సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ బమ్మెరపోతరాజొకడె భాగవతంబు జగతిఁబుగన్" అనుచు ఏ కొంచెమొ ఉత్కర్ష ప్రకటించుకొనినాడు; గాని, పరమ సాత్త్వికుడైన యెఱ్ఱయ అట్టి ఉద్ధతమార్గమున అడుగుపెట్టలేదు.

ఇక నాతని సాత్త్వికత తద్గ్రంథములందు ఎట్లు ప్రస్ఫుటమగుచున్నదో చూడఁపలసియున్నది. ఎఱ్ఱయయే త్రిగుణముల స్వరూపము నిట్లు చెప్పెను.

అతి నిందితము తమోగుణ
మతి బోధమయంబు సత్త్వ, మనయంబు ప్రకా
శత నొప్పు నుభయ గుణ మి
శ్రిత బరగు రజోగుణంబు — అనియు,

"అనఘుడు సాత్త్వికుండగు మహాత్ముడు తొరంగు మమకార వికార మహంక్రియాచ్యుతిం, బనుపడి సంయమప్రకట భావనత్తమశాంతి గైకొనున్" అనియు, సత్త్వగుణమునకు సంయమ ప్రకటభావన అనునది ముఖ్యము. అట్టి సంయమము కర్తవైనచో

ఇంద్రియంబులు దివిచిన యెడకపాఱు
చుండు మనసెప్డు తద్వేగ ముడుపకున్న
ఎదలి చెడిపోవు బుద్ధి యుదీర్ణపవన
హతి పయోనిధిలో కల మవియునట్లు —

అని స్పష్టపరచెను.

కావున సాత్త్వికుడైన వాడు చేయు కర్మము సంయమ ప్రధానముగ నుండును. ఇంద్రియలోలమై విచ్చలవిడి పరుగెత్తు మనస్సును సంయతమైన బుద్ధి లాగిపట్టును. అట్టి సంయతాత్మలె సాత్త్వికులు. కావున, రజఃప్రకోపముచే కావ్యమును సృష్టించు సమయమందు భావన స్వచ్ఛందముగ పరుగులు దీయకుండ, సాత్త్వికమైన బుద్ధి అమపులోనుంచును. ఈ సంయమమే కావ్యమునకు ప్రాణమైన ఔచితిని సమకూర్చును. కావ్యశరీరమునందు వివిధాంగములను అమర్చుటలో, పాత్రలను దిద్దుటలో, ఉద్దీపనాది విభావముల కుచితప్రవేశముచ్చుటలో, సంవాదములు నడపుటలో అంతటను ఈ సంయమమును పాటింపకున్నచో అనౌచిత్యము దాపురించును. చింతగింజమీాదనో, పొడుముకాయమీాదనో కళాకుశలుడు దశావతారములు చెక్కినా డనుకొనుడు. ఇంకొకడు ఆ దశావతారములనే మకరతోరణమునిాదనో, దేవాలయ ద్వార పట్టికలందో చెక్కును. ఈ రెండవ యాతనికంటె మొదటి యాతడు

అధిక ప్రజ్ఞాశాలి యనుటకు సందియములేదు. కాని ఆ ప్రజ్ఞ అస్థానపతితమై అనౌచిత్య మనిపించుకొనును. ఒకకవి కథాకావ్యము రచింపుచూ పిండినంతయు వర్ణనలకే ఖర్చుపెట్టి రొట్టెలేకుండ చేయును. సంస్కృత చంపువు లన్నియు నించుమించు ఇట్టివే. ఇంకొక కవి, రసభావనిలయము కాదగిన పట్టున సరళసుందరముగా, ప్రసన్నముగా రచించుటకుబదులు మాత్రమాత్రల వృత్తములతో, దీర్ఘసమాసములతో, శ్లేషలతో, తన ప్రజ్ఞ నంతటిని ప్రకటించును. ఇట్టిది అకాండ తాండవమేకాదు; అనర్థకముకూడ అగును. ఒకొక్కరి కావ్యములో శిల్పవిన్యాస మధికముగనుండును. కాని, దానికి ప్రయోజనము కనిపింపదు. సంయమరాహిత్యమే ఈ వెట్టి తలల కన్నిటికి కారణము. వీనివలన ప్రధానమైన కావ్యసౌందర్యము చెడిపోవును.

సంయమ మూలమైన యీ ఔచిత్య మనునది కాళిదాసు సొమ్ము. కావ్యమున ఏ యంగమున కెంత పరిపుష్టి యుండవలెనో, ఏ వర్ణన కెన్ని పద్యములు ఖర్చుపెట్టవలెనో, ఆ కవికుల గురువునకే ఎరుక. అజవిలాపఘట్టమందో, రతివిలాపఘట్టమందో, సంయమీంద్రులైన కవులైనచో ఒక్కొక్క సర్గ వ్రాసిపారవేయుదురు. కాళిదాసు పది పద్యములలో తేల్చివేసెను. మరియొకడు నూరు పద్యములు వ్రాసి పారవేసెనని సంతసించువారు నుందురు. కాని కావ్యరసజ్ఞులైన వారి కివి మనస్సుల కెక్కవు.

మనతెనుగు కవులలో ఆద్యులైన నన్నయ తిక్కన్న లది యీ సంయమమునకు పెట్టినది పేరు. తరువాతి కవులలో ముఖ్యముగా పాల్కురికి సోమన, నన్నెచోడులలో సంయమీంద్రులైన అతి

దీని వర్ణన లధికముగ కనిపించును. భావలోలతయే దీనికి ప్రధాన కారణము. అది లాగికొని పోవుచుండ దాని వెంబడి పడిపోవుటే వారి పని. ఆ రచన మంతయు అత్రిలోకముగ నుండు ననుటకు సంది యములేదు. కాని, కావ్యసౌందర్యము నది భంజించునని అంగీకరించ వలసియుండును. మేటికవి చెప్పగలిగిన దంతయు చెప్పడు. "గూఢతయు, చాటుదనంబును లేకయుండ, అరచాటుగ చెప్పిన యదె కవిత్వ" మనిపించుకొను ననినాడు పెద్దన. వ్యంజన, ధ్వని, అనెడి పేరుతో వాచ్యమును గూఢము చేయుమను కొందరు. ప్రకృతార్థము ప్రసన్నముగా నున్నచో, ఆ పిమ్మట దానినుండి ధ్వని పుట్టునే కాని మొదలు వాచ్యమునె దాచియుంచినచో దానినుండి పుట్టుట కేమియుండును— పుట్టనున్న ? కొందరు అప్రగల్భులు వర్ణ్యమును బలుబయలుచేసిపెట్టి, కవితారసజ్ఞులకు వెగటు కల్గింతురు. ఒక రేఖామాత్రమున ఒక్కింత వర్ణలేపనమున యావద్రూపసౌభాగ్యమును స్ఫురింపజేయు చిత్రకారునివలె, కవీశ్వరు లొక్కచ్ఛందోవిశేషముచేతనో, ఒక్క అలంకార విశేషముచేతనో రసలోకమును సాక్షాత్కరింపజేయుదురు. తాండవనృత్య మవధరించు శివునితో పోలిక చెప్పి, ఎట్టిన ఘూర్ణమాన మహాసముద్ర గాంభీర్య మంతటిని కనులయెదుట ఎటుల నిలిపెనో గమనింపుడు—

కడలి చేతు లార్చుచు ఫేనఘన తరాట్ట
హాసరుచితో ప్రవాళ జాటాలి విద్రిచి
యౌర్వశిఖి ఫాలలోచనం బినగ సింధు
వమరు డాండవమాడెను హరునిబోలి.

హిరణ్యకశిపుని తపోనిష్ఠకు ఒక్క ఉత్ప్రేక్షతో ఎటుల రూపకల్పన చేసెనో— చూడుడు.

శంభుదాసు సాత్త్వికత

దివిజవైరితపము తెఱగెల్ల, కంటికి
నిమకలేక చూచు నదియుబోలె
వికచకుముదసేత్ర విభవయ్యె రేలజె
న్నొంచె దానవేంద్రుడున్న సరసి.

ఆద్యులైన నన్నయ తిక్కనల నుండి ఈ సంప్రదాయము నెట్టిన పుష్టికి పుచ్చుకొనినాడు. ఇతర కవులు ఇంద్రియలోలతకు భావావేశమునకు, పరవశులై శృంగార ఘట్టములను వర్ణించిన పట్టులందు గూడ, ఎట్టిన రసిక లోకమును అతీంద్రియమైన రస లోకమున కిట్టె నడిపించుకొని పోవును. కలలో ఒకళ్ళ నొకళ్లు దర్శించి వలచిన దుష్మానిరుద్ధుల ప్రథమ సమాగమ ఘట్టమును భావావేశము పాలుగానీక, ఎట్లయ వర్ణించిన తీరుచూచిన ఆతని సాత్త్వికత యెట్టిదో తెలియును.

కలలోన నొండొరు గలసిన యప్పటి
ఆనందపూర్ణ ధన్యత్వములను,
బెరసి యొండొరులపై ప్రేముడి సలిపిన
సంతాప విహ్వల దశాంతరములు,
నెమ్మి నొండొరులకు నెచ్చెలి కతమున
నబ్బిన యసమ భాగ్యాతిశయము
క్రియల నొండొరులను గీల్కొన నొదవిన
యౌవనోచిత కళావ్యాప్తి విధము

చెన్ను మిగుల నొండొరులకు జెప్పికొనుచు
అద్భుతంబులు భయములు నాదరములు
కౌతుకంబులు పొదలాడగా ప్రియుండు
ప్రియయు గ్రోలిరి నూతన ప్రేమరసము.

ఈ ఘట్టమునే నాచన సోముడు కూడ వర్ణించెను. రెంటిని పోల్చిచూడ భావలోలతకు రసపరతంత్రతకు గల తారతమ్యము, ఆవేశమునకు ఔచితికి నుండు భేదము తెలిసివచ్చును. ఈ భావావేశమే రీతికావ్యమునకు ప్రాణమువంటిది. సోమనకు పిమ్మట శ్రీనాథ పోతనాదు లీ రీతి మార్గమును అధికముగ చేపట్టి తరచుగ భావపరతంత్రులై రచనలు చేయుచువచ్చిరి. రసపరతంత్రులై భావమునకు కళ్ళెము పట్టు నేర్పు కవిత్రయమునకె చెల్లి నది. ఆ మువ్వురిలో ఎట్టిన పరమసాత్త్వికుడని ఆతని యాపద్ధింథము సాక్ష్యమిచ్చును.

రవీంద్రుడు - తపోవన సందేశము

ఈ భూమండలమున ఎన్ని దేశములు ! ఆ దేశములందు నివసించు మానవలోకమున ఎన్ని జాతులవారు ! అందు మరల ఎన్ని మతములు ! ఎన్ని భాషలు_ వీనిని పురస్కరించుకొని ఎన్ని విరోధములు_ ఇవి చాలక రాజ్యలోభముతో, మాత్సర్యముతో ప్రజలకు ప్రజలకు నడుమ ద్వేషము లేనా ! యుద్ధము లేనా!... రామ రామ ! ఎంత క్రౌర్యము ! ఎంత భీభత్సము !

మానవుడు నానాటికి చిత్తసంస్కారమును పొంది, నాగరకుడనిపించుకొని, పంచభూతములను జయించి దివ్యత్వమునకు అర్రులు చాచుచున్నాడు కదా ! ఇప్పటికేని హింసావిముఖుడగుచున్నాడా? అనిన అట్టి దేమియు కనిపింపదు. చీటికి మాటికి మతమని, కులమని, అవి కాకున్నచో భాషయని,_ఒక టేమిటి?పసిబాలుర కొట్లాటకు_ఈ మతములు, కులములే అక్కరలేదు. తాము నిర్మించుకొనిన అర్థ వ్యవస్థయే లోకమునకు కళ్యాణము చేకూర్చుననియు, తమ రాజకీయ వ్యవస్థనే మానవలోకమెల్ల అవలంబించవలయుననియు, ఇట్లు ఎప్పటికప్పుడు ఏవియో సంక్షోభ కారణము లుద్భవించి, ఒకరిపై

నొకరు నాగరకతాపర్వత శిఖరమును ఎక్కితి మనుకొను మహా రాజ్యముల వారలే, ఒండొరులపై నిప్పులు గ్రక్కుచు, తోడేళ్ళ గుంపులవలె దుర్బలులను విఱుచుక తినుచుండిరతరి యీ లోకము నకు శాంతి సౌభాగ్యము లెన్నటికేని లభించునా యనిపించును.

మానవునిలోని దివ్యత్వము మాట యట్లుంచి, మానవత్వ మును మేలుకొలుపవలెనని గౌతమబుద్ధుని నుండి గాంధినుహాత్ముని దనుక_ జగత్కుటుంబకులైన మహనీయు లనేకులు అడపదడప యత్నించుచునే యుండిరి. అట్టి ప్రయత్నము లన్నియు వేరు వేరు మతములక్రింద మారిపోయి మరల విరోధములకే కారణమగుట సంభవించినది.

దేశకాల నిమిత్తముల వలన ఈ మానవ ప్రకృతిలో రెండు ప్రధాన భేదములు ఏర్పడి, రెండు నాగరకతల రూపొందించిన వందురు—రవీంద్రనాథులు. వీనిలో ఒకటి ప్రాచ్యము; రెండవది అప్రాచ్యము. ఈ రెండవది గ్రీసుదేశమున పూర్వము ఉండెడి నగర దుర్గములలో పుట్టినది. ఏ నగరమున కానగరము తనచుట్టు దుర్గములు, అగడ్తలు, నిర్మించుకొని ప్రత్యేక రాజ్యములుగ వర్ధిలుచు వచ్చినవి. అట్లు లొకొక్కక దుర్గమందు నివసించు. ప్రజలు తామెల్లరు ఒక్కటియనీ, ఆ గోడల వెలుపలనుండు లోకము తమకంటె వేరనీ ఎంచుకొనుట తటస్థించినది. తన చుట్టువారి గోడలు కట్టుకొని, ఇదినాది, దీనిలోనికి ఇతరులు రాగూడదను కొనుటవలన, బాహ్యప్రకృతినుండి, తోడి మానవులనుండి మను ష్యులు వేరగుదురు. అంతియేకాదు, గోడల కావలనున్నది తనది కాదనుటవలన దాని నెట్టిదైన గబళింపవలెనను లోభముస్ఫైతము

అలవడును. శిలానిర్మితములైన ఈ గోడలు కఠినస్వభావము కలవి. అందుచే ఆ కాఠిన్యము ఆ గోడల లోపల నుండెడివారికి సంక్ర మించు నందురు రవీంద్రులు. ఇట్లు మానవులకు మానవులకు నడుమ, మానవులకు విశ్వప్రకృతికి నడుమ అడ్డమైనిలచిన ఈ గోడలు మానవుని విశ్వభోగమునకు దూరముచేసి ఏకాకినీ, నిర్భాగ్యునీ చేసి వదలెను. ఏ జగన్మాత గర్భమునుండి పుట్టి, ఏ తల్లిఒడిలో తాను స్తన్యపానముచేసి పెరిగెనో ఆ యమ్మ ఐశ్వర్యము తనది కాదనుకొని దానిని వశీకరించుకొనుటకు దానిపై కత్తికట్టి విరోధ సాధన నారంభించెను.

ఈ సాధన నుండి వికసించిన నాగరికతకు సహజముగనే ఒక సుగుణముకూడ సంక్రమించినది. అదియెట్టిదనిన- ఈ గోడలలోపల నున్నది నాది అనుకొనినవాడు, ఆ తనసొత్తును అన్యులాక్రమించ కుండునట్లు జాగ్రత్తపడును. అంతియెకాదు. తన ఇల్లు వాస యోగ్యముగ, సకల సంపన్నముగా, శోభావంతముగ దిద్దుకొని రక్షించుకొనును. ఆత్మరక్షణకు, పరాక్రమణమునకు అవసరమగు సాధనము లన్నియు సమకూర్చుకొనును.

ఈ రీతిగ గ్రీకునగర కుడ్యములలో పుట్టి పెరిగినది పాశ్చాత్య సభ్యత. అహంకారము, విరోధము, లోభము, జిగీష, ఆత్మరక్షణ మొదలైన లక్షణములు ఆ సభ్యతను పాలించుచుండుటవలన పాశ్చా త్యులు బలసంపన్నులు విశ్వవిజయదక్షులు కాగలిగి సామ్రాజ్య ములు నిర్మించు కొనదొడగి రందురు-రవీంద్రులు. తన చుట్టు కంచె వలె ఆవరించివున్న జగత్తు తనకు విజాతీయమనుకొని దాని గర్భ మును శోధించి దాని మర్మములను వెలికిలాగి ఆ జ్ఞాన బలముతో

డాని వశీకరించుకొను చుండిరి_అందురు. ఇన్నిమాట లేమిటికి ? పాశ్చాత్యుల కర్మకలాపమునందు, జ్ఞానసాధనమునందు పురుషకారము నిండారి యున్నదనిన చాలును.

ఇక రెండవ నాగరకత భారతభూమిలో ప్రాచీనారణ్యాదులలో పుట్టి పెరిగిన దందురు రవీంద్రులు. ఆ యరణ్యములందు ఆశ్రమములు నిర్మించుకొనిన ప్రాచీన భారతీయుల దృష్టికి ఏ దెస చూచినను అనంతమైన అరణ్యములు, దూరదూరముల కనిపించు పర్వతములు, ఆ పర్వతములందు పుట్టి జలజల పారు ఏళ్ళ్, పైకి చూచిన నీలనీలమైన అనంతాకాశము కనిపించినవి. అనావృతము; అనాచ్ఛాదితమునగు ఆ ప్రదేశములో చల్లని చెట్లు నీడలలో నివసించిరి వారు. వారి చూపులకు ఎక్కడను అడ్డు కనిపింపదు. తమ్మ్ని చుట్టువారియున్న అరణ్యము పండ్లు, దుంపలు దొసగి వారిని పోషింపుచున్నది. తమతోపాటు ఆ యరణ్యమునందె పుట్టి పెరుగుచున్న పశుపక్ష్యాదులె వారికి నెచ్చెలులు. అనంతాకాశమున వెల్గు సూర్యచంద్ర తారకలు తమకు వెలుగు నిచ్చుచున్నవి. దిగంతములనుండి ప్రసరించు పవనములు తమకు ప్రాణదానము చేయుచున్నవి. నదీజలము తమ్మ్ని లోపల వెలుపల ప్రక్షాళించుచున్నవి.

ఈ విధముగ తనకు నిత్య సహచరులై, ప్రాణబంధువులైన పంచభూతములతో చెలిమి కలిపిన వాడు భారతీయుడు. చరాచర భూతజాలము, తాను వీక కుటుంబికులుగా ఎంచుకొనినాడు. వెలుపలనున్న ప్రకృతిలో ఇట్లు సఖ్యము నెరపుచు, బ్రదుకు భారమేమియో ఎరుగక, చీకుచింతలు లేక తన్ను గూర్చి యోచించుకొనుచు తన లోనికి చూచుకొనినాడు. ఆ లోచూపునుండి తెప్పిరిలి

మరల వెలుపలికి దృష్టి సారించినాడు. లోపలనూ వెలుపలనూ ఒక్కటే తత్త్వము నిండి యున్నదని తెలుసుకొనినాడు. విశ్వ వ్యాప్తమైయున్న తత్త్వము డానె యని గ్రహించినాడు.ఇందు తాను గానిదీ, తనకుగానిదీ లేదనినాడు. ప్రాణము, శరీరము, మనస్సు ఒక్కటియే అంతటను నిండియున్నది.ఇట్లు దేహ మనఃప్రాణములను ధరించియున్న ఈ జగత్తునకూ తనకూ ఉనికి యొక్కడే. కనుక ఇదియంతయు సత్పదార్థము. ఈ ఉన్నదానిని నేను తెలుసుకొను చుంటిని. జగత్తును నన్ను ఇట్లు బంధించుచున్న యీ యెరుకయే చిత్తు.ఒండొరులను తెలిసికుని ఒక్కటియే బ్రతుకు బ్రదుకుచుండిన యీ జగత్తునకు నాకు సఖ్యమును బంధ మేర్పడినది. ఆ సఖ్యము, ఆ పరస్పరప్రేమ మాకు ఆనందము నిచ్చుచున్నవి. కనుక నాతో పాటు ఈ ఉన్నది యంతయు సచ్చిదానంద మను ఏక పదార్థ మనినాడు.

ప్రాచీన భారతీయుడు ఈ దృష్టి వలన, ఈ విచారణ చేతనూ జగత్తుతోడి ఐక్యమును భజించినాడు. తనకు ప్రాణ బంధువై, తన జీవముతో జీవమై, ఆత్మలో ఆత్మయై తన్ను నిత్యము అంకపీఠిని జేర్చుకొని పోషించుచుండిన ఈ జగద్ధాత్రియెడ సఖ్యము, నెనరు, భక్తి వినా ఆతనికి లోభముతోడనూ, ద్వేషముతోడనూ పని లేకపోయినది. ఈ జగత్తు గోవు వంటిది. దాని ఆకలిదప్పు లెరిగి, పాలన పోషణములు చేసినచో అది బంధమును వేయనిచ్చును పాలు నిచ్చును. అటులు కాక, దానిని తనకంటె ఇతరముగ నెంచి నీడుపెట్టక మేతవేయక ఎండగట్టి నైరసాధన చేసినచో అది ఎగ జేచును. కామధేనువు, కల్పవృక్షమువంటి యీ జగత్తునుండి

బలాత్కరించి గ్రహించ వలసినది లేదు. ఈ జగత్తునకు తనకు నడుమ నిత్యవితరణము, నిత్యత్యాగము లభించుచున్నందున ఆ త్యాగ్యమునందె భోగ మలవడిన దాతనికి. సంపాదన కొఱకు శ్రమయు, సంగ్రహము కొఱకు ఆయాసము ఎఱుగక తనలోనికి, ఇంకను లోలోనికి ప్రస్థానముచేసి, జగత్తుతో తనకుగల ఏకాత్మ తను దర్శించి ఆనంద మనుభవింపుచున్నాడు.

ఇట్లు భారత తపోవనమందు పుట్టిన యీ విశ్వాత్మ భావన భారతీయులను క్రమక్రమముగ పురుషకార విహీనులను చేసిన దందుకు రవీంద్రులు. ఎట్టెటుట కనిపించు భేదములను పట్టించుకొనక ఆంతరమైన దృష్టి వినా వ్యావహారికమైన దృష్టి సన్నగిల్లినది. ఆతడు నిర్మించుకొనిన ఆలయములు, ప్రాసాదములు, రాజ్యములు అన్నియు ధర్మ ప్రాప్తికేగాని ఐహిక సుఖభోగములకు కాకపోయినని. రానురాను ఆ పరమార్థముపై దృష్టి తప్పిపోవుట చేత, నిష్క్రియత్వము మాత్రము మిగిలి, తన కనుల యెదుట ఇతరులు త్రవ్వుచున్న గోతులను పట్టించుకొనక ఆ గోతులలో కూలిపోయి, కూలిన చోటునుండి లేచుటకు ప్రయత్నము కూడ మానుకొనినాడు.

పాశ్చాత్యుల నాగరకత క్రమముగా అహంకారలోభము లను పెంచి హింసాక్రౌర్య దూషితములైన సామ్రాజ్యములు నిర్మించుకొనిన, ప్రాచ్యనాగరకత క్రమశః అలసత్వమును, పురుష కార హీనతను పెంచి ఐహిక భోగ భాగ్యములకు దూరమైనది.

ఈ ఉభయ సభ్యతల లక్షణములు, ఉభయసాహిత్యముల లోను కనిపించుచున్నవందురు, కవిసార్వభౌములు. త్యాగధనుడైన

దివ్యపురుషుని గూర్చినది వాల్మీకి రామాయణము. పురుషకార మును పాలించు దైవమును గొనియాడినది వ్యాసభారతము. ఋషి ప్రోక్తములైన ఇతిహాసముల మాట యటుంచి, పిమ్మటికాలమున కాళిదాసమహాకవి దిలీపుని త్యాగసేవానిరతితో తన రఘువంశ మును ఆరంభించినాడు. అగ్నివర్ణుని భోగలాలసయందు రాజ్యమెట్లు నశించినదో తెల్పి, ఆ కావ్యమును ముగించినాడు. కుమారసంభ వమునందు శివుడు లోకమును పట్టించుకొనక, ఏకాకియై ముక్కా మూసికొనినందున స్వర్గరాజ్య మపహృతమైనదనియు, తన తపస్సు చేత, త్యాగముచేత సతీదేవి శివుని ప్రసన్నుని చేసికొనినమీదట, కామవిజయము నుండి పుట్టిన కుమారునివల్ల మరల స్వర్గరాజ్యము సుసిద్ధమైన దనును. శాకుంతలమునందు విశ్వప్రకృతిని, మానవ ప్రకృతిని ప్రేమసూత్రములతో బంధించినాడు కవికుల గురువు. ఆ నాటకమున రాజప్రాసాదపు భోగము, ఐశ్వర్యము మరుగునబడి క్రీందిచేయియై తపోవన సంయమము, త్యాగము పైచేయి అగును. ఇట్లు భారతీయ సాహిత్యమునం దంతట మానవ కర్మకలాపమున కంతటికి విశ్వప్రకృతియె పూర్వరంగమై త్యాగమును సఖ్యమును కనులయెదుట నిలుపును.

అట్లే షేక్స్పియరు మహాకవి నాటకములు పురుషకారము నకు పట్టము కట్టును. మానవులకు కర్మక్షేత్రమగు ప్రకృతికి ప్రాధా న్యము కనిపింపదు. రోమియో జూలియట్ల శృంగారగాథయందు గూడ ప్రకృతి ఇంచుక తొంగిచూచి, నాలుక కరచుకొని వైదొ లగి పోవును. మిల్టను మహాకవి మానవుని నందనోద్యానవాసము ఎత్తునకు, అచ్చటి తమ శోభను మృగకుల ప్రశాంత జీవనమును

వర్ణించెనేగాని కుమారసంభవ శాకుంతలములందువలె మానవ
ప్రణయము హృదులుదాటి విశ్వప్రకృతిలోడ ఐక్యమును భజించుట
చెప్పలేకపోయినాము. మానవు డచ్చట ఆ ప్రకృతిపై దొరతనము
చేయును. అచటి మృగపక్షి కీటకములు ఆ యాదిమ దంపతుల
ఏకాంత శృంగారమునకు భయమంది దూరముగ తొలగిపోవు
చున్న వనినాడు.

కనుక పాశ్చాత్య సభ్యత పురుషకారమును, భోగమును,
ఉపదేశించుచుండిన; భారతీయ తపోవనములు సంయమమును,
త్యాగమును, సఖ్యమును ఉపదేశించుచున్న వందురు రవీంద్రనాథ
ఠాగూరు. ఇందులకు విశ్వామిత్ర వశిష్ఠుల కథను దృష్టాంతముగ
పేర్కొనినారు. వశిష్ఠుడు సంయమధనుడు; విశ్వామిత్రుడు పౌరుష
బలోద్ధతుడు. విశ్వామిత్రుడు తనకుచేసిన హానిని వశిష్ఠుడు సహిం
చెను. వశిష్ఠునియెడ విశ్వామిత్రుడు స్పర్ధవహించును. భిన్న
ప్రకృతులగు నీ మహర్షి లిరువురు శ్రీరామునకు గురుత్వము
వహించి ఒకరు సంయమమును ఒకరు శత్రువిజయసాధనములను
ఉపదేశించిరి. ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతులు రెండింటికిని ఇట్లు
ప్రాతినిధ్యము వహించిన యీ మహర్షి లిరువురును శ్రీరామోప
దేశమందు సహకరించినారు. ఈ ఉభయ సభ్యతలు ఒకదొంటికోడ
ఇట్లు సహకరించిననాడు శ్రీరాముడివంటి ధర్మవీరుడు, త్యాగ
ధనుడు ఉద్భవించును. ఈ ఉభయ సంస్కృతులు చేతులు కలిపిన
నాడు ద్వేషాగ్ని శమించి, పూవుల నవ్వులు, పక్షుల పాటలు,
వెల్లివిరియును. ఈసఖ్యమును సాధించుటకొఱకు మానవుడు చిర
కాలముగ యత్నించుచున్నాడు. ఆశాభంగమునకు, అపజయములకు

లొంగిపోవక మరల మరల ఆ నూతన సభ్యతాసృష్టికి నడుము కట్టుచునే యుండినాడు. విరుద్ధ శక్తుల సంయోగ ముండిననే సృష్టి సంభవమనియు; అచ్చట సౌఖ్యము వినా ద్వేషము తలచూప జాలదనియు, ఆ ప్రేమ మందె తరగని ఐశ్వర్యము లభించుననియు, మానవులు గ్రహించిననాడు మాత్రమె విశ్వకళ్యాణ మగునందురు మహాకవి రవీంద్రులు.

BLANK PAGE

నవల - సంఘ సంస్కారము

రస పరతంత్రము, రమణీయార్థ ప్రతిపాదకము నయిన శబ్ద రచన సర్వము కావ్యమే కావున, అట్టి నవలనుగూడ కావ్యమే.అనవలెను. కావ్యము లన్నియు అంతయో యింతయో ఉపదేశముకూడ చేయును—"రావణాదులవలె ప్రవర్తింపగూడదు. రామాదులవలె ప్రవర్తింపవలెను" అని. అట్టి ఉపదేశమే లేకున్నచో కావ్యము విశ్వశ్రేయమునకు కొఱగాని దగును. కావ్యమునకు నీత్యవినీతులతో బనిలేదను వారుగూడ, తాము సాధించు రసము, సౌందర్యము నియమ రహితమని చెప్పరు. నియమానువర్తనమే నీతి. అట్టి నీతియొకటి సృష్టిని బరిపాలించుచున్నది. దానివలననే లోకమునకు స్థితి యేర్పడుచున్నది. సృష్టిమూలమందున్న ఆ నియమమును, ధర్మమును దర్శించి,అది లోకవృత్తము నెటుల పాలించుచున్నదో విప్పి చెప్పుటయే కావ్యముల పని. అదియే సౌందర్య బోధకు జీవగఱ్ఱ. ఆ నీతికి సౌందర్య పరముగా వ్యాఖ్యానము చేయలేని కావ్యకళలు కొఱతను బుట్టించును. సృష్టిమూలమైన ఆ ఛందోనువర్తనము చెడినప్పుడు దుఃఖ హేతువులైన వికార

ములు సంభవించి అమంగళమును జేకూర్చును. దానిని పరిహరించి, దాని వెనుకనున్న నిత్య మాంగళ్యమును దర్శింప జేయుటయే కావ్యములు చేయు మహోపదేశము. గద్యకావ్యమైన నవలగూడ అట్టి ఉపదేశమునే చేయును.

సామాన్యముగ లోకమంతయు కామవశమై వర్తించును. కామ నిర్వహణము వలననే సుఖము కొనసాగుచుండును. కామ నిర్వహణముకోస మేర్పడిన అర్థములు పురుష ప్రయత్నముచే లభించును. ఆ ప్రయత్నములో హెచ్చు తగ్గులనుబట్టి అర్థ సంపాదన మందును హెచ్చుతగ్గు లేర్పడును. అందువలన కొందరి కధిక సౌఖ్యము, కొందరి కల్ప సౌఖ్యమును చేకూరును. ఈ భేదములచే అసూయలు, ద్వేషములు నుప్పతిల్లును. బుద్ధిశాలులు, బలవంతులు ఇతరులను వంచించి, పీడించి అధిక సౌఖ్యము పొందుచుండ; దుర్బలులు,అల్పబుద్ధులు,పురుషకారహీనులు సౌఖ్యదూరు లగుచుందురు. ఈ భేదములను సాధ్యమైనంతవఱకు పరిహరించి ఎల్లవారికి ఏ కొంచెమో సౌఖ్యము కల్పించుటకై అర్థ కామములకు వ్యవస్థ యేర్పరచవలెను. ఆ వ్యవస్థయే ధర్మము. ఆ ధర్మమే సంఘమును పాలించుచుండును.

ఇట్లు ధర్మబద్ధమైన సంఘము నడచుచుండగా, ఆ నడక అలవాటై, సుస్థిరమై, కొన్ని విధులు, నిషేధములు ఏర్పడును. నలిగిన బాటలవెంట సంఘమిట్లు సులభమైన సుఖజీవన మనుభవించుచుండ స్వతంత్ర కాములగు పురుషులు స్వసుఖము కొఱకు సంఘ నియమముల నతిక్రమింపఁ జూతురు. సంఘము గీచిన గిరులలో, వారికి ఊపిరాడదు. నలిగినబాట లిరుకై తోచును.సంఘము

నిలిపిన ద్వారము లెత్తుచాలక నెత్తికి దగులుచుండును. సమష్టి క్షేమము విచారించుచు, సంప్రదాయ బద్ధమైయున్న సంఘము ఆ ద్వారముల నెత్తుచేయుటకు, ఆ బాటలను వెడల్పు చేయుటకు నంగీకరింపదు. అట్టి సంఘమునే రవీంద్రుడు అచలాయతన మని నాడు.

ఆ అచలాయతనమున చిక్కువడిన పురుషుడు స్వాసుఖము కొఅకు దాని నుల్లంఘించు యత్నములో నలిగి నశించును; లేదా, ఆ సంఘమును శపించి దాని యాశ్రయమును వదలుకొని, అది పెట్టిన గోడలకు క్రంతలుచేసి బైటపడును. సంఘముపై క్రొత్త గాలియు, వెలుగును ప్రసరించును. సంఘావతరణ మిట్లు శిథిలమగు చున్న కొలఁది సంఘము సంస్కృత మగుచున్నదని వెలుపలి వారందురు. దుర్బల మగుచున్నదని లోపలివారు బాధపడు చుందురు.

వ్యష్టి సమష్టుల సంఘర్షణ వలననే నూతనాచారములు పుట్టును. సంఘ సుస్థితికి విరుద్ధముకాని స్వేచ్ఛ పురుషునకు లేనిచో పురుషకారము నశించును. పురుషకారము నశించినచో సంఘము కూడ క్రమక్రమముగ నిర్జీవమగును.అట్లని పురుషకారమును యథే చ్ఛముగ వదలి వేసినచో అది నిగ్రహరహితమై సంఘ సుస్థితిని కుద్దలించును. ధర్మనియమితమైన పురుషకారము పదియడుగులు పైకిలేచినచో దానితోపాటు సంఘముకూడ ఏ రెండడుగులో పైకిలేచును. వ్యష్టికినెత్తిపై మేకులుగొట్టిన సంఘము తనగోయి తానే త్రవ్వుకొనును. కావున దేశకాలాను గుణముగ ధర్మము మారుచు సంఘసుస్థితికి పోషక మగుచుండవలెను. ధర్మశాస్త్రములు,

రాజశాసనము పరిష్కరింప వలసిన ఈ వివాదలోనికి సాహిత్యము కూడ అడుగుబెట్టును. ప్రభుసమ్మితమైన స్మృతులు చేయలేని పనిని కాంతా సమ్మితముగ దాను చేయజూచును.

మనకు క్రైస్తవధర్మముతోడన, యూరపు సభ్యతతో డను సంపర్కము కలిగిన పిమ్మట పురుషునకు స్వతంత్రతా వాంఛకలిగి, సంఘములో గదలిక పుట్టినది. సంఘప్రాకారములో చిన్నవి, పెద్దవి గండ్లుపడి; స్త్రీ పునర్వివాహము, ప్రౌఢావివాహము, విగ్రహ పూజానిరసనము వంటి సంస్కరణములు పురుషప్రయత్నములవల్ల ఆరంభమైనవి. స్త్రీజాతి చదువుకొని, స్వతంత్రముకావలె ననియు, కులభేదము పనికిమాలినదనియు, వర్ణాశ్రమాములు సుస్థిరము కావనియు, వ్యష్టిస్వాతంత్ర్య సౌఖ్యకములైన నూతనభావములు బయలుదేరినవి. ప్రత్యక్షమే ప్రమాణమనియు, ఎవరికి వారు స్వతంత్ర విచారణచేసి తమ బుద్ధి కనుగుణముగ నడుచుకొనవలె ననియు, సంస్కర్తలు చెప్ప నారంభించిరి. శాస్త్రము ప్రమాణము కాదనినంతట మన సంఘమున గగ్గోలుపుట్టి, కలత పొడసూపినది. సాంఘికమైన ఈ విప్లవమున జొరబడి, సాహిత్యముకూడ బుజము కాసినది. అనుకూలముగను, ప్రతికూలముగను ఉపదేశ మారంభించినది. వీరేశలింగం పంతులుగారి ప్రహసనములతో అరంభమైన యీ సాహిత్యోపదేశములో నవల అనెడి కావ్యభేదము రంగస్థలమం దవతరించినది.

ప్రభువులైన ఆంగ్లేయులు ఈ వివాదములో తటస్థులైనారు. ధర్మశాస్త్రనిర్ణయములుచేయు పండిత పరిషత్తులు మూలబడి, ఆంగ్ల

విద్యాసంపన్నులు రచించు ఆంధ్రసాహితి ప్రచారములోనికి వచ్చినది. నవల అనెడి ఈ నూతన సాధనము పట్టిష్టమైనది.

పూర్వాధర్మ ప్రతిపాదకములగు భారతాదులు ఇంకను పల్లెలలో అక్కడక్కడ ప్రజలు పురాణముచెప్పించుకొని వినుచున్నను; ఆంగ్లభాషాసంపర్కముగల నగరవాసులకు క్రొత్తతరపు ప్రజకు నవలలుచేయు ఉపదేశమే రుచింపసాగినది.

శ్రవ్యకావ్యముకంటె దృశ్యమైన నాటకమున నెక్కువ సౌలభ్యముండును. కావున కన్యాశుల్కమువంటి నాటకములు, ఇప్పుడిప్పుడు చలనచిత్రములుకూడ సంఘసంస్కారమును ఉపదేశించుచున్నను తొలుత నవలలే అంశములకు ప్రధానసాధనములైనవి. శ్రవ్యకావ్యములోవలె నవలలో గ్రంథకర్త స్వయముగ వ్యాఖ్యానించుచు, అవసరమందు తాను వైదొలగి, నాటకములోవలె పాత్రలచేతనే మాటలాడించగలడు. నేటి కాలపు ఇతివృత్తమును చెప్పుచున్నప్పుడు పద్యకావ్యములో ఒదగని అనేక నూతనాంశములను గద్యమయమైన నవల ఇట్టే చెప్పివేయగలదు. కావునే నూతన భక్తోపదేశమునకు నవలయే పట్టుకొమ్మ సాధనమైనది. దీనిలో రామకృష్ణాద్యవతారపురుషుల గాథ లుండవు. కావున ప్రాతకాలపు ప్రజ వీనివంక చూడకపోయినను ఈ కాలపు ప్రజ తమ చుట్టునున్న సంఘములో ప్రచలితమగుచున్న నవీనధర్మములను ప్రస్తావించు ఈ నవలలకు తీయ నీటికి చేపలవలె ఎగబాకసాగినది.

వీరేశలింగంపంతులుగారి రాజశేఖరచరిత్రతో ఆరంభమైన ఈ నవలలలో స్వతంత్రతాకాములైన స్త్రీ పురుషులు నిజబుద్ధులనే

ప్రమాణముగ ఎంచుకొని, సంఘముగీచిన గిరిలో నుండి విడివడి, నిజసుఖమును ఆరాధించుట కనిపించును. బాల్యమందే భర్తలను గోల్పోయిన నిర్భాగ్యకాంద్రు పుట్టినిండ్లన్ననుభవించు బాధలను, ముక్కుపచ్చలారని పసితనమునందే పెండ్లియాడి దంపతుల అనను కూలదాంపత్యమందలి అనర్థములను జాలిపుట్టునట్లు ఈ నవలలు వర్ణించును. విద్యావిహీనులై సంప్రదాయబద్ధులైన స్త్రీ పురుషుల మిథ్యామును, ఆ మిథ్యామూలముగ జీవనము సాగించు దంభాచారులను అవహేళనచేయును. స్వేచ్ఛను గోరు పురుషులకు, వారి నరికట్టజూచు సంఘమునకు పోరాటమే యీ నవలల కథివృత్తను. పంతులుగారి అనంతము చిలకమర్తివారు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, చలంప్రభృతు లిట్టి రచనలు చేసిరి. వీరిలో అతి ప్రతిభాశాలియైన 'చలం' ఈ మాత్రపు సంస్కరణలతో ఆగలేదు. వివాహధర్మమందు కాలక్రమమున జొరబడ్డ లోపము లను సవరించుటకై వానిని నవ్వులపాలుచేసి ఊరకుండరు. వివాహ ధర్మ మూలమునకే మోసముతెచ్చు స్వేచ్ఛాచారమును వీరు ఉపదేశించుచున్నారా అనిపించుచు శృంఖలమై నోరూరించు కామక్రియా కలాపమును వన్నెచిన్నెలతో వర్ణింతురు. శృంగార వర్ణనౌచిత్య విషయములో మనపూర్వ ప్రబంధములను నిరసించిన వీరేశలింగంగారి శ్రోత్రియత్వమును చప్పగా తుడిచిపెట్టి, నేటికి, రంగు రంగుల బొమ్మలతో చిత్రించినగాని తనివిచెందని స్థితికి తెచ్చి నది చలంగారి అమోఘలేఖిని.

వీరేశలింగంగారితో, ఆరంభమైన యీ సంఘసంస్కారక నవల చలంనాటి కిట్లు పట్టపగ్గాలు లేకుండ, ఒకవంక సాగిపోవు

చుండ, రెండవవంక దీనికి ప్రతిస్పర్ధిగా విశ్వనాథవారి వేయిపడ గలు పూర్వాచారమునకు సంప్రదాయమునకు నెత్తిన ధ్వజమై బయలుదేరినది. పురుషుని స్వేచ్ఛ అదుపులో పెట్టనిచో దాని వికారములు సంఘవిచ్ఛిత్తికి కారణమగునని నిరూపించుచు, స్వేచ్ఛ పేర జరుగు అన్యాయములకు, అక్రమములకు 'చెలియలికట్ట' నిలుపజూచిరి వీరు. శాస్త్రప్రామాణ్యమును అంగీకరించని హేతు వాదము నిస్సారమనియు, తుద కది గోతిలోనికి దింపుననియు వీరి యుపదేశ సారము.

ఇట్లు చెరియొక దెసకు లాగుచున్న ఈ యిరు తెగలకు, అడివి బాపిరాజు నవలలు మాధ్యస్థము చేయుచున్నట్లుండును. నిగ్రహ రహితమైన విశృంఖలతవలన వచ్చెడి హాని నంగీకరించుచు మానవ మాత్రులు చేయు పాపములను సానుభూతితో పరామర్శించు చుండును వీరి నవలలు. విశ్వనాథవారివలె వీరు నీతి రహితులకు పాపకూపములు త్రవ్వి భయపెట్టరు. మునిమాణిక్యమువారి 'తిరు మాళిగ', ఉప్పలవారి 'అతడు-ఆమె' కూడ ఈ జాతిలోనివే. పిమ్మటి తరములోని రావూరి నవలలుగూడ, యీ తరగతిలోనికే వచ్చును. ఇక "బుచ్చిబాబు", వి. డి. ప్రసాదరావు, ప్రభృతు లున్నారు. శాసనరూపముగా ఉన్న జాతిసంస్కారమునకు, నూత్న సంస్కారముచే కలిగిన స్వతంత్ర ప్రవృత్తికిని జరగు పోరాటము కనిపించును వీరి రచనలలో. తుదకు కామప్రవృత్తికే లొంగిపోవు టయో, నీత్యవిసీతుల కతీతమగు ఒకానొక అవస్థలో మైమరచు టయో తటస్థించును. తుదకు కనులు తెరచుసరికి, ప్రతికూలమై ఎదుట నిలచిన పరిస్థితులచే వీరి నాయికా నాయకులు హతాశులై

నిట్టూర్పు విడుతురు. అంతియేకాని చలంగారి నవలలలోవలె యథేచ్ఛా విహారమును చేయలేరు; నిగ్రహమును పూనలేరు. పాపము చేసితిమను పశ్చాత్తాపమును లేదు; ఘనకార్యము చేసితిమను విరుగుబాటును లేదు. పాపమో, పుణ్యమో, తనువంతునకు వచ్చిన ఆ సుఖస్మృతులు వినా యీ లోకములో ఎవరికిని, ఏమియు మిగులదను వైరాగ్య మొకటి కన్పించును. బుచ్చిబాబు నవలలలో గోస్తా జిల్లాలకు, రాయలసీమకు నేడు కలిగిన మెర మెరల స్వరూపమును వివరించి సమన్వయింపవలెనను యత్నమొకటి కని పించును. ఇక గోపీచందు; కొడవటిగంటివారు నవలలో పాపనిర్ణ యమునకు స్వబుద్ధియే ప్రమాణమందురు.

ఇట్లు సంఘము నుల్లంఘించి, స్వతంత్రమై సౌఖ్యమందజూచు పురుషప్రయత్న మొకవంక నడచుచుండగనే యీరపుటో మరల సమష్టికి పురుషుని దాసునిగావించు నూతనోద్యమము బయలుదేరి నది. తదనుగుణమైన అర్థవ్యవస్థ యేర్పడినది. స్త్రీ పురుష కామ మున కిది ప్రతిబంధకము కాకున్నను పురుషుని అర్థదాసుని చేసి వాని సకల ప్రవృత్తిని తదనుగుణముగా మార్చివేసినది. అంటితో సాహిత్యము అర్థమూలకమైన సంఘవ్యవస్థనుగూడ పరామర్శింప వలసివచ్చినది. అర్థకారణముగా సంఘములో ఏర్పడిన మిట్టపల్ల ములను తన్మూలముగా గలుగు విరోధములను ద్వేషముచే హింసచే మట్టుపెట్టవలెనా? అహింసవలన, సత్యమువలన సమన్వ యింపవలెనా యను విమర్శ ఒకటి గాంధిజీ బైలుదేరదీసిరి. ఉన్నవవారి మాలపల్లి ఈ హింసా హింసల స్వరూపమును వ్యక్తీకరించి వ్యష్టిసమష్టి విభేదములను సమన్వయింప జూచినది. స్వసుఖము

కోసము సంఘమును ధిక్కరించువారు పొందు పశ్చాత్తాపమును, సంఘదౌస్థ్యముపై కత్తిగట్టినవారు, అహింసవలన సత్యమువలన దానిని ఎదురొక్కనెడివారును, పొందు బాధలను మూలపల్లి వర్ణించినది. చక్రనేమిక్రమముగా వచ్చు నూతన ధర్మపు సవ్వడు లా గ్రంథము మనకు వినుపించును.

ఈ కోవకుచెందు నాటకములు, కథానికలు ఇప్పుడిప్పుడు విరివిగ బయలుదేరుచున్నవి గాని వీనిలో నిగ్రహపూర్వమైన ఉపదేశముకంటె రజోవశమైన ఆవేశమే ఎక్కువగా కన్పించుచున్నది. తత్కాలసంఘస్థితిని ఇతివృత్తముగ్రహించి సంస్కరింప బూను ఈ సాహిత్యము ఆ పని ముగిసినపిమ్మట జీవించునా యను సందేహమొకటి యున్నది. ఇతివృత్త మేకాలపుదేనియు రసమయ కృతిగా నిర్మించి, కాంతాసమ్మితమయిన ఉపదేశముచేయు కావ్యమునకు శాశ్వతత్వము లభించును; సర్వకాలములందు ఉత్తమ సాహిత్యము అట్టి ఉపదేశమును చేయుచుండును. వ్యష్టిసమష్టుల మధ్యమున, ధర్మాధర్మముల మధ్యమున, హింసాహింసల మధ్యమున అప్పటప్పటి ఈ వివాదములు పొడసూపుచునే యుండును. స్మృతికర్తలతోపాటు కావ్యకర్తలుగూడ వానిని పరిహరించుటకో, సమన్వయించుటకో యత్నించుచునే యుందురు. ఇట్లు మారిపోయెడి లోకవృత్తసౌందర్యమును సాహిత్యదర్పణము తనలో భద్రముచేసి శాశ్వతము చేయుచునే యుండును.

BLANK PAGE

ఉత్తమ శ్లోకుడు బాపిరాజు

కాలమునకు గూడ గళ్ళాకళ లున్నవికాబోలు. ఒకప్పుడు కలకలలాడుచు ప్రసన్నముగా, మఱియొకప్పుడు చిరచిరలాడుచు జీకాకుగా, ఇంకొకసారి ధుమధుమలాడుచు, మఱియొకసారి కన్నీ రోడ్చుచు నుండును. ఒకతూరి కనులెఱ్ఱజేసి, కణకణ వేగుచుండును. ఇంకొకతూరి మోడిగా ముసుఁగు బిగదన్నును. ఒకప్పు డాటలా డును. వేఱొకప్పుడు హేలగా పాటలుపాడును. ఆయా వేళావేళ లలో బుట్టినవారి కాయా లక్షణములు సంక్రమించునేమో ? కాకున్నచో నొకప్పుడు తెరలు తెరలుగా నుసుళ్ళు పుట్టనేల, ఇంకొకప్పుడు కుప్పలు కుప్పలుగా నింద్రగోపములు పొడమనేల ? మఱి జగత్కంటకులైన డిక్టేటర్లు, జగత్కుటుంబకులైన సత్పురు షులు ఏయే వేళలలో బుట్టుదురో !

మా బాపిరా జనుచుండెడివాడు— "మన్మథసంవత్సరములో బుట్టిన మీరును, విశ్వనాథయు, నేను గవులమైనాము. చూచితిరా బావగారూ !" అని. నేను "అది యేమి మాటండీ మన్మథలో

బుట్టినచో నందగాండ్రము గావలెను కాని కవుల మగుట యెట్లు?" అనెడివాడను. ఇటుల నాలోచించినచో ఖరనికారి దుర్ముఖ వత్సరాలలో బుట్టిననా రందటిమాట యేమి? అని నవ్వికొనెడివారము. ఏని కేమికాని 1891_1900 సంవత్సరముల మధ్యమున కాలపురుషు డెంతో ఉల్లాసముగ బ్రసన్నముగ నుండెనేమో యని తోచుచుండును. నేటి తెలుగునాట చిత్రకారులుగా, గవీశ్వరులుగా, గాయకులుగా, నటులుగా బ్రసిద్ధిచెందినవా రందఱు నా పదియేండ్లలోనే జనించి అనేక విధముల నాంధ్రకళాలక్ష్మి నలంకరించిరి. చాళుక్యుల కాలమున గాని, తిక్కనతరమునగాని, శ్రీనాథుని శకమునగాని, రాయలభువనవిజయమునగాని, తంజనగరాస్థానిలో గాని ఇంచఱు దిగ్గజములవంటివా రేకకాలమున దర్శనమిచ్చి యుండరు. ఈ నలుబదియేండ్లనుండి అనేక మార్గముల నాంధ్రజన చిత్తములను సంస్కరించుచున్న వీ రందఱు షష్టిపూర్తి కించుమించు వయసులో నున్నారు. కొంద ఱప్పుడే రాలిపోయినారు.

వీరిలో నుత్తమశ్లోకు డనిపించుకొని, ఇంచఱకు దలలో నాలుకగా వర్తించు నదృష్టము బాపిరాజున కొక్కనికే పట్టినది. 'బావగారు బావగారనుచు నోరార మనసార బలుకరించుచు, నెంతగా దలుపులు మూసికొన్న హృదయములంపైన నిట్టే ప్రవేశించెడివాడు. చీకటికోణములవంటి చిత్తములలో బూజులు దులిపి, చల్లని దీపము వెలిగించి, అగరుధూపముచే నింపి కలకలలాడజేయు నేర్పు బాపిబావకే చెల్లినది. మిత్రులయిండ్లకేగినపుడు బాపిబావ తలచావడిలో నిలువక సరాసరి వంటయింటిలోనికే వెళ్ళి అక్కగారిని పలుకరించి పనివడిసచో, బాకప్రక్రియలోగూడ వ్రేలుపెట్టుడి

మా బాపిరాజు

వాడు. మేనల్లుడ్రను, మేనగోడండ్రను చంక కెత్తికొని ముద్దు లాడినపిమ్మటగాని బావగారితో నిష్ఠగోష్ఠి కారంభించెడివాడు కాడు. 'బావబావ' యనినచో వట్టి వయసులకు సరసాలకే కాదు; బావ యను పిలుపులో ఎంతో విశ్వాసము నెంతో మాధుర్యము, ఎంతో పావిత్ర్యము నింపే బాపిరాజు మన కష్టసుఖాల బాలుపంచికొనే పరమాప్తుడు.

బాపిరాజు మిత్రులలో గొంద అన్నాదమ్ములవరుసలవారు కూడ నున్నారు. కావున నాతడు వదినామఱదండ్ర యోగక్షేమ ములుగూడ విచారింపవలసివచ్చెడిది. బాపిరాజునకు దొలగి తలుపుచాటున కేగుమఱదండ్రు లేరు. ఎంతటి మువ్వరాండ్రేనియు నాతని యాత్మీయత కలవడి పలుకరించితీరవలసినదే. ముసురు బ్రొద్దులు దరుణారుణరేఖవలె, ఆకల్లాడని గ్రీష్మసాయంతనవేళలు బయ్యెరగాలివలె వచ్చెడివాడు బాపిరాజు. అతని చల్లనిమాట లొడలు నిమిరి, సురటివిసరి, కన్నీరు తుడిచెడివి. అసుయసుకైన యాత్మల కాతని యాప్యాయత చందనచర్చ. కావుననే బాపిరాజు మగవాండ్ర కక్కరగాకును, ఆడువాండ్ర కన్నగారు ననిపించెడిది నాకు.

నవరసాభివ్యక్తి

ఆ తరము కళావంతుల రచనల బరికించిచూచినచో వారిలో జాలమంది నవ్యాత్మలు, సంశయాత్మలుగా నగుపింతురు. మనసున్న లలో నమ్మతమగు దివ్యధామమును కల్పించుకొని, అచటి మందా కినీ తీరములో, నందనారామములందు నచ్చరలతో విహరించి,

వారు కనులుదెఱచి చూచుసరికి ఎదుటనున్నలోకము సుఖదుఃఖములతో వికారభూజనమై కనిపించెడిది. తండ్రులతరమునసే హతశేషమైన యాస్తి ఇంగ్లీషుచదువులచే వట్టిపోయినది. సంసారములో జేతిలో నిండు తక్కువ. పాశ్చాత్యములైన జీవనప్రక్రియలు, భోగములు నొంటబట్టినవి. ఎక్కడనో బడిపంతులుగనో, ఆఫీసు గుమాస్తాగానో కాలక్షేపము చేయుట మనస్కరింపదు. సంఘము, శిష్టాచారము, ప్రభుత్వము శిలాప్రాకారములై తోచెడివి. లోకము కటకమయమై కన్పించి, తమ యభీష్టములకు మనోరథములకు సాఫల్యము కలవడ్యెడిది. ఇట్లు బాహ్యాభ్యంతరములకు బొత్తు కుదరక, ఆ రెంటిని సమన్వయించుకొను పురుషకారముగాని, సమ్యగ్దర్శనముగాని చాలక, భావలోలురైన కళావంతు లందఱు నిరాశావశు లైరి. వారి రచనలందు విరహవిషాదగంధ మలము కొన్నది. ఆనాటి రచన లెల్ల నించుమించు విప్రలంభకావ్యములే. శాపవశేషముచే నలకాపట్టనమునకు బాసి, మిన్నులువడిన రామగిర్యాశ్రమమందు విరహకాతరులై పరిదేవనమొనర్చు యక్షులే ఆనాటి కావ్యకథానాయకులు.

బాపిరాజుకూడ నట్టి యక్షుఁడే. బాపిరాజే కాదు. తత్త్వమరసినచో గవు లందఱు శాపగ్రస్తులై, గంధర్వలోకమునుండి మర్త్యమున బడినవారే యగుదురు. జనన్నాంతరమందు బరిచితమైన యా గంధర్వలోకమునకు, సౌందర్యధామమునకు వారు భూపకల్పనమొనర్చుచుందురు. వారి యుత్ప్రేక్షలు, నుపమానములు ఆ స్వర్గసీమను ధ్వనింపజేయు నుపాయములు. ఆ స్వర్గమును భూమిపై నవతరింపజేయుటకే వారి కృషి యంతయు. ఆత్మ కందునేకాని

చేతి కంద దా స్వర్గము. ఈలోకమందలి విషయజాలమును చెప్పెడి మాటలు దానిని చెప్పలేవు, రూపింపలేవు. అట్లని వారు కేవలాత్మ భోగముచే దృప్తిని చెందరు. ఈ లోకమును వదలికొననుజాలరు. ఇచటి రూపము లన్నిటిని అతీంద్రియమైన ఆ సౌందర్యముచే నింపి రూపాంతరముల గల్పింపజూతురు. రాగద్వేష కారణములైన ఇచటి రూపములను వారిభావనలో బుటముపెట్టి రసరూపస్పృష్టి గావింప నెంతురు. స్వర్గమర్త్యముల కిట్లు సువర్ణసేతువులు నిర్మించి, దివ్యులను భూమికి దింపుచు, మర్త్యులను స్వర్గమున కెత్తుచునుందురు. ఈ సాధనయందు సౌందర్యభావన కాస్తికమ్యముగూడ దోడగునేని వారికి మనశ్శాంతి లభించును. కానినాడు అసంతుష్టులై ఆయాస పడి పోవుదురు. శబ్దవర్ణ రూపాదులగు నుపాదానముల యావరణ లను భేదించి, వాని నైశ్వర్యపూర్ణములు, నానందమయములు, చేయగలిగినవారికే శాపవిముక్తి. అట్టి కళాసిద్ధిలభించుదనుక వారాయలకానగరమును, నచటి ప్రియురాలిని దలచికొని పరిదేవన మొనర్చుచునే యుందురు.

అలకాపురవాసియగు ప్రియురాలికి బాపిరాజు, శశికళయని పేరుపెట్టుకొనెను. ఆతని పాటలు, కథలు, చిత్రలేఖనములు - నన్నియు నా యక్షుణిని భూమిపై నవతరింపజేయు సాధనములే. శారదరాత్రులలో గోదావరీతీరపు టిసుకతిన్నెలలో దరళచంద్రికా రేఖయై యామె బాపిరాజునకు దర్శన మిచ్చినది. తొలుచిన మృత్యు ముఖమందలి నీలజిహ్వికవలె బాపికొండల మధ్య కదలాడే భయద గోదావరిలో, భోగీరలోయయందలి గుహాచైత్యముల బ్రవాసినియైన శిల్పసుందరిలో, కరచరణములు తాల్చినిల్చి పలుకరించే కైలాస

నాథాలయశిల్పములలో ఆతఁడా శశికళనే పోల్చుకొన్నాఁడు. శిల్పములు, చిత్రలేఖనములు, సంగీత సాహిత్యములు - అన్నిట నామె విలాసములే తొంగిచూచి, దోబూచులాడినవి. అవ్యక్త మధుర ధ్వను లొనర్చుచు బురాస్మృతులను రేపునేకాని ఆ దేవి పల్లె త్తిపలుకరింపదు; కనికరమునై గటాక్షింపదు. ఆ దేవిని బ్రసన్న నొనర్చుకొనుటకై బాపిరాజు అలమటించి, అల్లాడిపోయినాడు. చీదరగొని, శివమెత్తినట్లు తన్నుదానే వెంటాడుకొనుచు దిరిగెను. కనుపించిన సుందరరూపములెల్ల నామెవే యని యెంచి దరియఁజేరి, మరులుగొని మనసిచ్చికొన్నాడు. ఏమి చేసినను, ఈ రూపపు దొరల నెంత యారాధించిసనుదృష్టిలేదు. ఆ తెరలచాటున నున్నది శశికళాదేవి. "నీకు ఇవతలా నాకు అవతలా తెరయున్నది బాలా!" అన్నాడు బాపిరాజు. ఈ తెరను జించివేసినను ప్రయోజనము లేదు. ఈ తెరలనే పట్టికొని భాగవతమాడినను ప్రయోజనము లేదు. తెరలవంటివి, అద్దాలవంటివి యీ రూపములు. వానిని రసరూపము లొనర్చినపుడేకదా కళలకు సార్థకత లభించును!

కాగా, కవిహృదయమంటలి సౌందర్యబోధమే యీ శశికళ. ఆ దేవి సర్వరసమయి; సకలజన హృదయాంతరాళ వాసిని. ఆమె మనలో నిద్రించుచున్నది. ఆమెను మేలుకొలుపుటే కళలపని. ఆమె కన్ను విప్పగనే ఈ లోక మంతయు రసమయమై దివ్యమై దర్శన మిచ్చును. కళలు కల్పించే రూపము లన్నియు ఆ దేవి దివ్య సౌంద ర్యమును ఈశ్వరవిభూతిని ధ్వనింపజేయగలవేకాని శృంగగ్రాహి కగా బట్టి యీయనేరవు. రవీంద్రనాథ మహాకవియు, కృష్ణ శాస్త్రియు నాదేవి కూర్వశియని పేరిడిరి. పాలసముద్రమును దేవ

దానవులు మథించినపుడు పుట్టిన దా యక్షయ యౌవనవతి. సకల హృదయములందు వసంతరాగమును దోలకరింపజేయు నామె కడగంటి చూపులు. ఆమె యభవ; ఆమె సర్వోయౌవన; ఆమె యయోనిజ. లోకమెల్ల నామెను వలచినను ఆమె యెవ్వరికి గృహిణి కాదు. అనుచు నా యూర్వశికి వారు పలువితముల రూపకల్పన గావించిరి. ఎంత చేసినను సాధనయేకాని యిందు సిద్ధి దుర్లభము. "అతీంద్రియ భోగ్యమైన ఆ వస్తువు ఆలింగనమున నిముడ" దని రవీంద్ర మహాకవియే వచించెను.

కళలు – స్త్రీల ప్రకృతి

బాపిరాజు శశికళా సాక్షాత్కారమునకై కొండలు తిరిగి, కోనలు వెదకి ప్రతిరూపమును బలుకరించుచు బాటలు పాడికొనియెను; చిత్రములు రచించెను. అతని కళాభాండార మంతయు శశికళాచరితచిత్రిత మని చెప్పవచ్చును.

ఇట్లు కళారాధనతో తృప్తినందక బాపిరాజు శశికళ కుపాసనాకాండగూడ నిర్మించెను. అతని కళాపీఠమున నా దేవికి నర్చనలు, షోడశోపచారములు, నివేదనలు జరుగుచుండెడివి. అతని శిష్యులందఱు శశికళాభక్తులు. నవీనులలో ననేకులకు రుచింపని యీ ప్రతిమార్చనమందు బాపిరాజున కింతటి యభినివేశమున కాతని యాస్తిక్యమే కారణము. ఒకొక్కరూపమునందు నీశ్వర కళాప్రతిష్ఠ సలుపు శిల్పసంప్రదాయము బాపిరాజున కలవడినది.

ఇది పామరత్వమే యగునేని శకునములను, రక్షరేకులను, మ్రొక్కుబడులను గూడ నాతని పామరత్వమున జేర్పవలసియుండును.

ఇది యంతయు నెందులకు చెప్పుచుంటి ననగా _ బాపిరాజుది సంప్రదాయబద్ధము, నాచారపరాయణము నగు స్త్రీ ప్రకృతి. ఆతని లోనే కాదు; కళావంతు లందఱిలో నీ స్త్రీ ప్రకృతి కెక్కువ పాళ్ళుండును. కేవల బుద్ధివ్యాపారమునకు గళాసృష్టికి బొత్తుకుదరదు. కళలు తర్క-సహాములు గావు. కళలకు ప్రాణపదమైన భావలౌల్యము స్త్రీల సొత్తు. కళలయందలి అద్భుతదర్శనము శిశువుల సొమ్ము. స్త్రీలు మంచిచెడ్డలను శాస్త్రదృష్టిచే, తర్క-బుద్ధిచే నిర్ణయింపరు. ప్రేమానురక్తులను పసిపట్టెడి అతీంద్రియదృష్టి వారిది. ఈ గుణమే స్త్రీలను కళానురక్తలను గావించును. తెల్లవారి లేచినది మొదలు గేహాలంకరణము, దేహాలంకరణము, పాకకల్పనము, శిశుపోషణము_ ఇట్లు వారి బ్రదుకంతయు గళామయమై సాగుచుండును. ధన సంపాదనము, నిచ్చిపుచ్చుకొనుటలు, విరోధము, మాత్సర్యము, పరవంచనము_ వీనితో సంసారపుదొడ్డు గీడ్చుచు బెనగులాడెడి పురుషచిత్తములు కర్కశములు, గలుషితములు నగుచు గళల కల్లంత దవ్వున మసలుచుండును. పురుషులు కాలహరణమునకై, వినోదముకోసరము, విశ్రాంతికొఱకు కళల నాశ్రయింతురేకాని వానియందు సహజాభిరతిచే గాదు. అట్లుకాక స్వభావముచేతనే పురుషుడు కళారక్తుడగునేని వానిది స్త్రీ ప్రకృతియని చెప్పదగును. అట్టి పురుషునకు వ్యవహారదక్షత లోపించి, స్త్రీ సాదృశ్యము లభించును.

వ్యవహారదక్షతా లోపము

మఱి, కవిగాయకాదు లందఱు లోకజ్ఞానహీనులా యందురేని, కారు_ సన్నయ తాను లోకజ్ఞుడనని చెప్పికొన్నాడు. కవికి

ప్రతిభా వ్యుత్పత్తులతోపాటు లోకానుశీలనముగూడ గావలసినదే. కళ లన్నియు లోకము నాశ్రయించి, దాని కష్టసుఖములయందు ప్రవర్తింపవలసినవే కావున లోకపరిశీలన చాలని కళలు రాణింపవు; నిక్కమే. ఆ పరిశీలనము లోకధర్మమును, స్వభావాములను గ్రహించుటతో సమాప్తిచెందునేకాని లోకముతో దలపట్లుపట్టి, పైచేయి యగుటకు బనికిరాదు. కళావంతులకు లోకముపట్ల రాగద్వేషములుండవు. వారి చిత్తవికారములు రసాభిముఖములై ప్రసరించును. కావున వారిలో వ్యవహారదక్షత లోపించును. కకుత్థితైర్వ్యవహార జంబాలమున దగులొక్కన్నచో 'బొడ్డుపల్లను గొడ్డలి మోసపోవుట' నిక్కమగుచుండును. అట్లుకాక, లోకవ్యవహారమునగూడ గడిదేరిన కవిగాయకాదులుండురేని ఆ సమయమున నట్టివారు కళావంతుల పంక్తిలో దిగువపీటలపై గూర్చుండదగినవారగుదురు.

వ్యవహారదక్షుడనెడి నిందకు బాపిరాజుమాత్ర మెన్నడు బాల్పడినవాడు కాడు. లాయరుగా, అధ్యాపకుడుగా, పత్రికా సంపాదకుడుగా, ఎందును బాపిరాజు దక్షునిపించుకొన్నది లేదు. అతని యాప్తుల కీమాట కష్టము కల్గించునని యెఱుగుదును. నేను మాత్ర మాతని దక్షతాహీనతకు వగవను. ఆయా పనులు చక్కగా నిర్వహించుకొని పోగల సమర్థత బాపిరాజునకు లేదని కాదు నా యభిప్రాయము. మనబోటి సామాన్యుల నిత్య పనులలో రాణింపగలుగగా బాపిరాజువంటి మేధావి యీపాటి యుద్యోగములకు దగడనియు గాదు. పనివడినచో ఆయా యుద్యోగముల నిర్వహణమునుగూర్చి బాపిరాజు గంటలకొలదిగా ప్రసంగింపగలడు. మఱి, దక్షతాలోప మెట్లు వచ్చెనందురా, కళాసృష్టి లేనిచోట బాపి

రాజు హృదయము రమింపదు. అట్టి వ్యవహారదక్షతయే యులవడి నచో ఆ బాపిరాజు మన బాపిరాజు కాకుండబోయెడివాడు. ప్రయోజకుడైన ఆ బాపిరాజును మనము గౌరవింతుమే కాని మన మనస్సుల నీయము. మనకవి, మన చిత్రకారుడు, మన నెయ్యుడు నగు బాపిరాజు అప్రయోజకుడు, కల్లకపటము లెఱుగని పసివాడు. ఆతని తప్పటడుగులను జూచి, యల్లంతమాత్రాన మనము చేతులు సాచి, హృదయముల నర్పించుము. ఇట్లు తన యసమగతచే, నమాయికతచే లోకమును జయించుట బాపిరాజునకే చెల్లినది. "అయ్యో! మన బాపిరాజు జంటి వెఱ్ఱివాడయెనే" యని మనము విచారించుచుండగనే, అక్కట పాటలుపాడుచు, నభినయించుచు మనలను బసికందుల నొనర్చి, మనచేగూడ నిసుకతో బిచ్చుకగూండ్లు కట్టింపగలడు. "ఏమి, బాపిరాజూ ఇంటిపై తెలివిమాలిన పనిచేసితి" వని యడుగుటకు మనకెవిమీాయడు. బాపిరాజుపై దప్పు లెన్ని యుపాలంభింపగల కటికగండెవా రెవ్వరని నే నెఱుగను జిలిబిలి సవ్వడు లొనర్చుచు, నుపవ్యసవ్యాలతో జరచరా నేతెంచి పాదాలను చుట్టవేసి, అంతలోనే బుస్సున జారిపోయెడి జలధియూర్మికలపై నెవరు చిరాకుపడగలరు? చిరాకుపడి, వాని నెవరు నివారింపగలరు?

కర్మముచాలక యెవ్వరేని పకాలతు నిచ్చి, వాయిదానాటికే తెంచి, తన ఆఫీసునొద్ద – ఆఫీసనున దొకటి యుండిసనే సుడీ! – వచ్చి కూరుచున్నచో, లాయరుగా రెచట నుండెడివారు? ముస్లిలక్ష్మీనారాయణ తోటలో బుష్పజాతులనుగూర్చి యానుపూర్వకముగా నద్భుతమైన ప్రసంగము చేయుచుండును. ఎట్లో అటనుండి

పట్టి పెచ్చి కోటును పాగను దగిలించి కోర్టులో గూరుచుండ బెట్టి నచో ఆ ముసిముసి నవ్వులు, ఆ వాలకమును జూచి ప్రతిపక్షి వకీలె ముందుగా వాయిదా గోరెడివాడు. సభ్యజ్ఞి మాత్రమేమి చేయ గలదు? కోర్టుకూటు మటు లిపోయి "ఏమండీ ? బాపిరాజుగారూ ! ఎంతవఱకు వచ్చినది మీ నవల ?" యనుచు గుశేల ప్రశ్న మొనర్పనలసినదే.

ఇట్లు తనకు, నెవుటి వారికిగూడ జిక్కు ఘటించు ఘట్టము లం దేనియు నిర్వికారముగా జిఱునవ్వు లొలుక బోసెడి బాపిరాజు నేమనగలము ? ఇంటిలో నెవరికో జ్వరమొకెను. జేబులో డబ్బు వేసికొని మందుకోసము బయలు దేరవెళ్ళిన బాపిరాజు ఆ మందు గొనితెచ్చునను నమ్మక మెక్కడిది ? ఆ సొమ్ముతో నక్కపల్లి బొమ్మలో, కాళహస్తి కంచువిగ్రహమో కొని చక్కవచ్చును. 'ఏమి ఇట్లు చేసితి వని యడిగినచో ఆ బొమ్మల పనితనమును, వాని పౌరాతన్యమును గూర్చి ప్రసంగింప నారంభించును. మందు కావలెనన్నచో మరల నేగి తెచ్చికొనవచ్చును. అట్టి విగ్రహములు కావలె ననుకొన్నపుడు దొరకునా ?

ఈ వెఱ్ఱిబాగులప్రొద్దు ఒక్క బాపిరాజు నొసటనే బొడువ లేదు. మా కవిమిత్రులలో జాలమంది దిదియే వాలకము. బాజాల సందడిలో మంగళసూత్రము మఱచెడివారు కొందఱు, భార్య ప్రసవబాధ పడుచుండగా మంత్రసాని కోసమేగి, పురోహితుని బిలిచికొని వచ్చెడివారు కొందరు. ఇంకు కొంత అతిశయోక్తి యున్నను మాలో జాలమంది ప్రాప్తకాలజ్ఞుల రాశిలో జేరుదు

రనుట నిక్కము. లాభనష్టపరిగణనమునకు, మాకుగాని వావి. రేపటి పనినిగూర్చి– రేపటివరకు నెందులకు ?– ఇంకొక గంటకు జరుగ వలసిన పనినిగూర్చి ఇప్పుడే జాగరూకత వహించుట మా మతము గాదు. మాలో బాపిరాజుది అగ్రతాంబూలము. ఆంగ్ల కవులలో ఆలివరు గోల్డుస్మిత్తే మరల నిట్లు బాపిరాజుగా నవతరించె నేమో యనిపించుచుండును నాకు.

బాపిరాజు అల్పసంతుష్టుడు

ఇతర వృత్తులవారిలోకంటె ఈ కళావంతులలో అసూయపా లెక్కువగా గన్పించుచుండును. నిజమున కిది వీరికి వృత్తికూడ కాదు. కవిత్వ మల్లియు, సంగీతము పాడియు, మేడలు గట్టుట వరకు నెందులకు, – సుఖజీవనము జేయగలవారు గన్పింపరు. అట్లయ్యు, వీరిలో నొకరిపొడ యొకరికి గిట్టదేమో అనిపించును. బాపిరాజులో నీ యసూయ యే కొంచెమో లేకపోలేదు. ఎపుడేని మొగము చిన్నబుచ్చుకొని కూరుచుండినను అంతలోనే బాపిరాజు ముఖము విప్పారి కలకలలాడెడివి. నిజమున కీ కన్నులకు గావలసిన దేమియున్నది ? మడిమాన్యములు, అగ్రహారములు, నాందోళికలు నర్పించినదానికంటె 'నీ రచన బాగుగా నున్నదిసుమా' యన్నచో నట్టె యందల మెక్కుచుము. ఈ యసూయయు, నల్పసంతుష్టియు గూడ స్త్రీ ప్రకృతియందలి పాళ్ళే. 'నీవు కట్టినచీర సొంపుగా నున్న'దనియో, 'నీవు చేసిన వంట యమృతోపమానముగా నున్న' దనియో, 'నీ జుట్టుముడి చూడముచ్చటగా నున్న'దనియో మెచ్చు కొన్నంతనే యుబ్బితబ్బిబ్బుగాని స్త్రీ లకునుగా నుందురు. అందును బాపిరాజున కున్నంత అల్పసంతుష్టి మఱియొకరి కుండదు. నే

మా బా పి రా జు

నెన్నడేని బాపిరాజుత్రో 'మీ కథ యమ్మతముగా నున్న' దన్నచో నెంతగా పొంగిపోయెడివాడో చెప్పలేను. ఆ సమయ ములో నా హృదయము క్షాళితమైనట్లు తో చెడిది. ఆతని సంతో షముగాంచి నే నేదియో మహోపకారము చేసితి ననుకొనెడివాడను. బాపిరాజు మనస్సునకు దుష్టిగూర్చుట మనకేపండుగ. ఆతని మనస్సును నొప్పించుట మనకే వేదన. 'ఇంతసత్పురుష చిత్తము నొచ్చిన దిత్తరోవునే' అన్నట్లు బాపిరాజును నొప్పించుట మహా పాతకములలో జేరును.

ఈ గుణసంపద యటులుండ మా బావగారి రూపమందును స్త్రీల కవళిక లుండెడివి. చిఱుగుంటలుపడు నా చెక్కిళ్ళు, నా నితంబభారము, కుసుమకోమలమైన యా శరీరము, పాటలు పాడు నపుడు చేతులుద్రిప్పుచు జేసెడి ఆ యభినయము_ నివి యెల్ల నటు లుండ_ నవనీతమృదులమైన ఆ మనస్సు_ చూడగనే శ్రీనాథుడు చెప్పిన 'భాగోతుల బుచ్చిగాడు' అనే పద్యపాదము జ్ఞప్తికి దగు లును. ఈ లక్షణముల గాంచియే ఆస్థానకవులే బాపిరాజుచే భామవేషము గట్టించెను.

శిశుప్రకృతి

ఈ సందర్భమందే మఱియొక ముఖ్యవిషయము చెప్పవల యును. బాపిరాజునకు బిడ్డలనుగనుట యొక్కటి చేతగాకపోయెనే కాని తక్కిన శిశుపోషణాదిక మెల్ల సహజముగా నలవడెను. బాపిరాజు వచ్చెసన్నచో జాలును; ఆతనిమాట వినవచ్చిన జాలును ఎంతటి మకుబిడ్డలేని కలకలలాడుచు నాతని బుజముల కెగబ్రాక వలసినదే. పిల్లలను జూచినంతనే బాపిరా జొడలుమఱచి, వారితో

నాడుకొనును. తొక్కుపల్కులు వల్కును, నేలపై బ్రాకును, పిట్టలవలె గూయును. శిశుజగత్తులో నిట్టి లీలలైపోయి, వాండ్రకు గథలుచెప్పుచు గూరుచుండును. అబ్బబ్బ! ఆ కథలు కథలుగావు. ఆ కతిలపుట్టనుండి అప్పటికప్పుడు పరమాద్భుతమైన కథాప్రపంచము పుట్టుకొని వచ్చెడిది. బాపిరాజు వట్టి కతిలకామరాజు.

బాపిరాజు తాను పసివాడు కావుననే పసివాండ్రతో నిట్టుల గలిసిపోయెడివాడు. పిల్లలపలెనే క్రొత్తవారిచెంత గొంచెము బెరుకుదనము నాతనికి గద్దు. ఎంతసేపు? ఒక్క క్షణము ఇంచుక చనవిచ్చి పలుకరించినచో నిట్టి చంక కెక్కెడివాడు.

బాపిరాజు పాండిత్యము

ఇంతటి హృదయనైర్మల్యము, శరీరసౌకుమార్యము, నార్ద్రచిత్తముగల బాపిరాజు కవియు, శిల్పియు, గథకుడు నగుటలో వింత యేమి! అతడు పుట్టుకవి, పుట్టుశిల్పియు. అతని చేతులు వట్టి చిలిపిచేష్టలు. అతని పసిమనస్సున కీ లోక మంతయు నపూర్వముగా గనుపించెడిది. కావుననే అతని సకలరచనలందు స్వభావోక్తి తక్కువగా, అతిశయోక్తి అధికముగా నుండును. ఉత్ప్రేక్ష లాతని సొత్తే. నిజమున కాతడు ప్రబంధకవుల రాశిలోనివాడు. పాండిత్యప్రదర్శనమం దాతనికి మక్కువ. వ్యావహారికజగత్తు అతని రచనలన్నిట చూపాంతరముచెంది రసమయత్వము నందుచుండును.

బాపిరాజు రచనలందు గన్పించు పాండిత్యప్రదర్శనమున కాతని వ్యుత్పన్నతాలోపమే కారణమనువాకు లేకపోలేదు. కాని బాపిరాజే అపండితుడైనచో పుటి పండితు డెవ్వడు? అతనికి

దెలియని శాస్త్రము, రాని విద్యయు నున్నవియా? ఆతడు తిరుగ వేయని గ్రంథమనుచు నున్నదియా? ఆతడు వ్రేలుపెట్టిన విద్య లన్నిటి నేకరువు పెట్టినచో నాలుగుపుటలేని నిండును. అతనిబుద్ధి సర్వాంకషము, అతని ప్రతిభాదర్పణమందు ప్రతిఫలింపని విద్యయనుచు లేదు. అట్టి బాపిరాజు రచనలలో పాండిత్యప్రకటన యుండకపోవు టెట్లు? హంసవింశతివంటి గ్రంథము ప్రాయపలెనన్నచో నట్టి యధికార మ్రాకాలమున బాపిరాజున కొక్కనికే కలదు. భాషా పాండితిమాత్ర మాతని కించుక కొఱవడినమాట నిజము. శబ్ద దోషము లెడనెడ ఆతని రచనలందు గన్పించుచుండును. కాని, ఆ లోపము లెల్ల నాతని అమేయ ప్రతిభయందు గరగిపోవుచుండును. శబ్దజ్ఞానమే జ్ఞాన మనుకొనెడివారికి మాత్రము బాపిరా జసహ్యుడే.

బాపిరాజు పాండితి యంతయు గురుముఖతః నేర్చినదికాదు; చాలవరకు స్వయముగా సాధించినదే. ఆతని పాండితికి గ్రంథ ములు హద్దులు పెట్టజాలవు. గ్రంథస్థ విషయముల కాతని ప్రజ్ఞ వన్నెలుపెట్టును. స్వభావతః కవియగుటచే నాతని దివ్యచక్షువు శాస్త్రగ్రంథములు పరామృశింపని క్రొత్తసీమలను త్రొక్కుచుం డును. కావునచే గ్రంథములలో నిముడు పాండిత్యముల కాతనిమాట లశాస్త్రీయములుగా, సభూతకల్పనలుగా దోచును. ఆతని స్వభావ మందుగూడ నీ దోషము కొంత యున్నది. కావ్యరచన చేయునపు డాతనిలోని పండితుడు తొంగిచూచును; శాస్త్రచర్చ సలుపునపు డాతనిలోని కవి తొంగిచూచును. ఈ రెంటిని వానివాని హద్దులలో నిలుపలేకపోయెడివాడు బాపిరాజు.

బాపిరాజు పాండిత్యమునుగూర్చి ప్రసక్తి వచ్చినది కావున

నిచటనే యింకొక విషయము చెప్పవలసియున్నది. బాపిరాజుకు కవిత్వాదివ్యసనము లెన్నియున్నను ఆతని గ్రంథపఠన వ్యసనమున కవి యెన్వాయు సరితూగవు.

చదివికొనుట కొక గ్రంథమున్నచో జాలును; ఆకలి దప్పులు, నితరతాపములు బాపిరాజు నంటవు. నడిరేయి వేళగూడ గ్రుడ్డిదీపపు వెలుగులో, వట్టినేలపై సాగిలబడి గ్రంథపఠన మొన ర్చుచు విశ్వమును మఱచెడి ఆ వ్యసని నా కనులయెదుట మెదలు చున్నాడు. ఖర్యూరము పెదవిచెంత మధుపాత్ర కావలెనన్నట్లు మా బావగారికిగూడ మధ్యమధ్య నంజుకొనుట కొక సిగిరెట్టు మాత్రము కావలెను. సంసార వ్యధాశీధిలము గాకుండ బాపిరాజు మనస్సును రక్షించినవానిలో నీ గ్రంథవ్యసనమే ప్రధాన మను కొందును.

కొందఱు బాపిరాజు నతిభాషిగా నెంచువారు. మఱి యాతడు మితభాషికూడ. ఒక్కొకప్పుడు మూగివాడై పోయి, మాట లకు దడవికొనెడివాడు. మఱి యొకప్పుడు రుుకీవేగమున బ్రసం గించెడివాడు. బాపిరాజు ప్రసంగనైపుణికి నికషములు సభావేదికలు కావు; ఇష్టగోష్ఠులలో, శిష్యోపదేశవేళలందు వినవలయు నా పండి తుని వాగ్ధోరణి. జాతీయ కళాశాలలో బాపిరాజు సరసప్రసంగములు వినుచు నెన్ని రాత్రులు గడిపితినో! అటఇటగా సిగరెట్లు ముట్టిం చుచు బాపిరాజు ప్రసంగించుచుండ, జుట్టులు వెలిగించును విను చుండెడివాడను. కొడిరాల్చి పీల్చినపుడు మిణుకుమిణుకు మనెడి ఆ ధూమకాష్ఠముల చిఱువెలుగులే సాక్షులుగా సాగిన ఆ గోష్ఠులు మరపురాకురావు. ఆ ప్రసంగములు తర్కసహాములైన పరామర్శలు

గావు. విషయగర్భములోని కరిగి, యచట బుద్ధిని వెలిగించి శోధించుమార్గము కా దది. ఎక్కడి కక్కడ జిలవలు బలవలు వేసి కొనుచు ననలుగొనలు సాగి, అల్లుకొనిపోయెడి చలువపందిళ్ళవంటి వాతని ప్రసంగములు.

అతీంద్రియదృష్టి

బాపిరాజు వీరాంధ్రుడు. ఆంధ్రభూమిపై, నాంధ్రజాతిపై నీగను ప్రాలనిచ్చెడివాడు కాడు. మానవ సభ్యతకు భారత సభ్య తయే గురువనియు, భారతీయ సంస్కృతిహారమున నాంధ్రసంస్కృతి నాయకమణి యనియు నాతని మతము. బాపిరాజు నేటివాడు కాడు. శాతవాహనుల నాటినుండి, యిక్ష్వాకుల నాటినుండి ఆంధ్రుడుగానే జన్మించుచున్నాడు. నాగార్జునకొండలో, అమరావతిలో శిల్పరచన చేసిన బౌద్ధ భిక్షులందున్నాడు బాపిరాజు. అజంతా కుడ్యచిత్రము లలో దాను చిత్రించిన వేపయో పోల్చుకొనెడివాడు. శాతవాహ నులు ఆంధ్రక్షత్రియ బ్రాహ్మణులు. ఆనాడే అడివిశాంతిశ్రీ పేరు కానవచ్చుచున్నది. అడివివారు సాలంకాయనులు. వారికి, నిక్ష్వా కులకు బాంధవ్య ముండెడిది. బాపిరా జీరీతిగా జెప్పికొని పోవు చుండ "సీతడు వెట్టివాడా యేమి కర్మ?" మనిపించెడిది. ఆతనికి మాత్ర మిది యెల్ల యధార్థమే. దీని నభూతకల్పన యని త్రోసి పుచ్చుట సులభమేకాని బాపిరాజు ఆ గతకాలములోని కేగి, తా నెఱింగినవియు, చూచినవియు జెప్పుచుండ వానిని కా దనుట యెట్లు? ఇంతియే కాదు. బాపిరాజు మా కందజేసిన, జాతకచక్రములు చూచియు, హస్తరేఖలు పరిశీలించియు ఏష్యము చెప్పెడివాడు. ఎన్నో ఫలితములు దాఖలా లిచ్చెడివి. కాని ఆ చెప్పెడి పద్ధతి

శాస్త్రప్రమాణమునుబట్టి చెప్పినట్లుండెడిది కాదు. చిత్ర మేమనగా నా ఫలితముల కన్నిటికి, వెనకిచూచినచో, ఎక్కడో ప్రమాణము లుండనే యుండును. భవభూతి చెప్పినట్లు శాస్త్రముచే ఆతని మాటల ననుసరించును. శాస్త్రములను బాపిరాజు తిరుగవేయ లేదని కాదు. ఆ ఫలితములను చెప్పునపుడు శాస్త్రోపస్థితికంటె నాతని యతీంద్రియదృష్టియే ప్రాభాస్యము వహించు ననుకొందును. అటులే ఎన్నడో గడచిపోయిన వృత్తాంతముల నాతడు చెప్పుచున్నా డన్నచో వానికి నెదటనో ప్రమాణములు లభింపకపోవు. ఆంధ్ర సామ్రాజ్యమునాటి విశేషములను 'హిమబిందు'లో నాతడు చిత్రిం చిన అద్భుతచిత్రణమును గాంచిన వారికి నా మాటలలో వైప రీత్యము గోచరింపదని యెంతును. మన మెఱిఁగిన చరిత్రగ్రంథ ములలో నాతని చిత్రణమునకు ప్రమాణములు నేడు దొరకనిచో రేపేని దొరకకపోవ్రు. "అన్నా! బాపిరాజు చెప్పుచుండెడి వాడు సుమా! మన మానాడు, నమ్మలేకుకాని – నేటికి దొరకెనది సాక్ష్య"మను కొందుము.

సాహిత్యగోష్ఠులలో, బరిషత్తులలో బాపిరాజు పదిమంది వెట్లు. ఆతడులేని గోష్ఠినీరసము, నిస్సారము. ఆతడన్నచో నొక యాటలా, పాటలా, అభినయమా, వాదోపవాదములా! సర్వకళావిషుడైన బాపిరాజుతోనే పోయినది సాహిత్యాది గోష్ఠుల రుచి. ఆ విచిత్ర వ్యక్తి యున్నచోట బదిమంది మూగవలసినదే. పైడ్‌పైప రాఫ్ హాబ్లిను' పిల్లలనే మోహింపజేసెనుగాని బాపిరాజు పిల్లలను, పెద్ద లను, స్త్రీలను, పురుషులనుగూడ మోహింపజేసెడివాడు. సాహిత్య సభలలో రక్తి తగ్గినపుడు "పిలువండి! బాపిరాజు" ననెడివారు.

మా బా పి రా జు

ముసిముసి నవ్వులతో నపుడు బాపిరాజు ప్రవేశించి "గడవళ్ళసెల్లాయి కూతురు, కడుపవక్కనివని సూతురు" అనుచు ఎత్తుకొనుసరికి సభ యంతయు వింజమూకిడి నట్లయ్యెడిని. ఇట్టిదే మఱియొక వ్యక్తి ఈ సమయాన ఇపికి దగులుచున్నది - బాపిరాజుకంటె ముందుగానే మమ్మల్ని డిగవిడిచియేగిన బుచ్చి సుందరరామశాస్త్రి ఎచట నున్నాడో! ఈ యిరువురను గోల్పోయి ఆంధ్ర సాహితీరంగము చిన్నబోయినది; సరసగోష్ఠుల సౌరస్య మస్తమించినది.

చెండు దశలు

బాపిరాజుది రసమూర్తమని చెప్పితిని. ఆతని రచన లందు సాదృశ్యకల్పనము, స్వభావోక్తియు లేకపోలేదు. ఆ రచనలందు చెండుదశలు కనుపించును. 'తోలకరితో' అంతమైన దశ మొదటిది. దానికి గాఢతము, నుద్బోధకమునైనది ఆస్వాదుకాలేజి శిష్యత్వము, సాహచర్యము. జానపద జీవనమండలి మాధుర్యమును, వీధినాటకములు, తోలుబొమ్మలాటలు, పల్లెపదాలు, భావగీతాలాపము మున్నగు దేశీయ రచనలందలి సారళ్యమును అవగాహించిన దశయిది. కళాకుశలుడు, శిల్పవత్సలుడు నగు ఆ సౌందర్యపండితుడు బాపిరాజు దృష్టితోడను, సహజకళాకుశలుడగు బాపిరాజు పండితుని దృష్టితోడను దేశికళలను, పల్లెజీవనమును దిలకించిరి. ఇద్దరి చూపులను గలియబోసికొనిరి. ఆ దృష్టితో బాపిరాజు చేసిన రచనలన్నియు స్వభావోక్తి రమణీయములు, సాదృశ్యకల్పనా మహితములును. ఎడనెడ బాపిరాజులోని నున్న రసదృష్టి తొంగిచూచినను తోలకరినాటి రచన లన్నిట నీ గుణములే ప్రచురములై కన్పించును. బమ్మెకవి గీతములే అప్పటి కాతని కాచార్యకవ

రెండవదశ ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోద కుమార చట్టోపాధ్యాయుల శుశ్రూషతో నారంభించినది. చట్టోపాధ్యాయునిది ప్రాచీనమగు రసమార్గము. యథాపస్తు కల్పనకంటె ఆయన చిత్రరచనలందు రసభావవ్యంజకత్వమే ప్రధానము. ప్రాచీనమగు భారతశిల్ప సంప్రదాయమున దాతడు కృతహస్తుడు. ఆ మహనీయుని సాహచర్యము బాపిరాజునకు గనువిప్పు చేకూర్చెను. ఆతనిలో నుండి వెడలుటకు దహతహ చెందుచున్న రసభావములకు దలుపులు విడివడినవి. అంతకుమున్ను కూల్డ్రిఫ్ దేశమెల్ల దిరిగి దర్శించిన భారతీయ శిల్పముల రహస్యము బాపిరాజు కిపుడు కరతలామలకము కాజొచ్చెను. ప్రాచ్యపాశ్చాత్య శిల్పరీతుల అంతర్యమును కజిన్ను మున్నగు రసజ్ఞులు విప్పిచెప్పనారంభించిరి. ప్రమోద బాబు రచనలను వ్యాఖ్యానించుచు ముట్నూరి కృష్ణారావు ప్రాచ్యకళలందలి రసస్వరూపమును నెఱిగించుచుండెను. జాతీయకళాశాల ఆ దినములలో ప్రాచ్యకళాసృష్టికి, వ్యాఖ్యాలకు నిలయముగా నుండెడిది. ఆ కాలమునసే శారదా పత్రిక యావిర్భవించినది. కళాశాలలో పీచెడిగాలియు, కళామర్మముల నుద్ఘాటించెడు దినములవి. అచట బ్రమోదబాబు, రామకోటీశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, కవుతా శ్రీరామశాస్త్రి, ముట్నూరి కృష్ణరావు మున్నగు రసజ్ఞులందరు చేరి సలిపెడి కళాగోష్ఠి లెంత హృదయంగమముగా నుండెడివో! ఆ గాలికో బాపిరాజునకు నూతన జవసత్త్వములు చేకూరినవి. ప్రాచ్యపాశ్చాత్య కళారీతులను దనలో నాతడు సమన్వయించుకొన్నాడు.

అంతకుమున్నే ఆతనిలో భారతీయతాభిమానము నెలకొని కారాగృహవాసము చేయించినది. ఆ యభిమానమునుండి యాంధ్ర

తాభిమానము మేలుకొన్నది. ఆ నాళ్ళలో ఆంధ్రజాతీయ కళా శాలలో జేసిన క్షేత్రవాస మాతనిలో ఆస్తిక్యమును, భక్తిని బాదు కొల్పినది. అపుడు లభించిన నూతన దర్శనమది మొదలుగా నాతని రచనలలో వ్యక్తముకా జొచ్చినది. అంతకుమున్ను జానపదజీవన మాధుర్యమును గానముచేసిన బాపిరాజు అంతర్ముఖుడై, రసలోక యాత్రనారంభించి "దేశాలు తిరిగాను, దేవుళ్ళ గొలిచాను"అనుచు గ్రొత్తపాటలు పాడ దొడగెను. ఆతని చిత్రరచన మందు సాదృశ్య కల్పనము వెలుకబడి, రసభావములు మూర్తిదాల్వ నారంభించెను. ఆతని జననాంతర సంస్కారము మఱియు బ్రస్ఫుటత్వము నందెను. బాపిరా జెన్ని శాస్త్రములు తిరుగవేసినను, ఎన్ని విద్యలు నేర్చి నను ఆతని సత్వమం దున్న ఆ సంస్కారబలమే వాని కన్నిటికి వెలుగు నిచ్చినది. ఆతని చదువు లన్నియు నలంకారములు, విడం బనములు మాత్రమే. పుట్టుకతో వచ్చిన ఆ సంస్కారమే యాతని మూలబలము.

స్త్రీలకు రహస్య గోపనశక్తి చాల దందురు. ఆమాట ఎంత నిజమో తెలియకుకాని బాపిరాజు నోటిలో మాత్రము నువ్వగింజ నానెడికాదు. చాటుమాటులు, గుట్టుబెట్టులు నాత డెఱుగడు. మొదటే దర్పణస్వచ్ఛమైన పసిమనస్సాయె; మఱి మిత్రులకు మన సీయకుండ నోర్వగలడా బాపిరాజు. సొంతరహస్యములు సరేసరి. సంసారపుగుట్టుగూడ దాచుకొఱుగడు "ఇది రహస్యము సుమా" యనుచు నొకొకక్క మిత్రునకే మనసు విప్పెడివాడు. అటులే తన మిత్రుల రహస్యములను దెలిసికొన ముచ్చటపడెడివాడు. తన రహస్యములను మూపవ మొనర్చి మమ్మెంత గౌరవించినాడు!

బాపిరాజని యిష్టపడనుకొందును. తన్ను గన్నవారికి, దానుగన్న వారికి, దోబుట్టువులకుగూడ దెలుపరాని "నిజాంతర స్మర వికృతి ప్రవర్తన" లాతనివలన విననోచిన మిత్రులు _ ఆతడు తెమయం దుంచిన యీ విశ్వాసమునే ఋణమునెట్లు తీర్చుకొనగలరో ! మిత్రులపలన నాతడుగోరిన దొక్క మనస్సునే. దానినే నిర్భాగ్యుల మాయలేకపోతివి. ఒకపట్టున నోటిని మనస్సును విప్పక ముడుచు కొని కూరుచుండే యీ అరమరిక మన కాంగ్లేయులవలన నలవడిన దనుకొందును. మనవెర్రిల ధారాళత మనయందు లోపించినది. బాపిరాజు వెనుకటి తరమువాడు. చిననాటి నెచ్చెలుల మధ్యనాతని కలవడిన యీ ధారాళత నాతడు కాలేజి చదువులవలన గోల్పో లేదు.

బాపిరాజు విరహి యంటిని. ఆ విరహముచే గలిగెడి నైరా శ్యమునుండి ఆస్తికత్వ మాతని రక్షించినది. అతని యాశాలతలు తుదివరకు చిగురించుచునే యుండెను. ఆరామలతవలె నెప్పటికప్పు డేదియో యాలంబనమున కల్లికొనిపోవుచు, వసంతోదయము కాక పోవునా యను విశ్వాసముతోడనే బ్రదుకు వెళ్ళబుచ్చుకొనెను.

తన కళావేత్తృతకు సినీమాపలన సార్థకత లభించు ననుకొన్నాడు బాపిరాజు. ఆ యాసయే ఆలంబనముగా బదియేండ్లు గడపెను. రంగరచనము, ప్రసాధనము నాతనికి వెన్నతో బెట్టినవి. కథాకల్పన మాతనికి నల్లేరుపై బండి. పాటలు, మాటలు మటి చెప్పెడిదేమి? ఇట్టి బాపిరాజుసేవకు సినీమాకళ నోచుకొనదాయెను. కల్లకపటము లెఱుగక, తెల్లనివెల్ల పాలనుకొనెడి యీ పెర్రి బాపి రాజు _ఎప్పటికప్పు డాశభంగ మెదురొక్కనుచున్నను లెక్కసేయక

'మైకాబరు'వలె, మటియేదియో యొరగి యొడిలో బడునటెడి నమ్మ్ర కముతోడనే ఇహయాత్ర చాలించెను.

ప్రా ప్తకాలజ్ఞుడగు బాపిరాజు కంఠము మ్రోదికి వచ్చుదనుక పనిలు జేసెడివాడు కాడు. 'మిజాను' పత్రిక కేనాటి కానాడు మేతవేయక తప్పుగావున, నప్పటికప్పు డొకొక్క ప్రకరణమే దానినోటి కందించుచు హిమబిందు మున్నగు నవలలు రచించెను. ఆ కారణమునవే ఆతని రచనలందు సాఫుసంతసలు కనుపింపవు. ఎత్తుగడలోని నిండుదనము ఉపసంహారమున లోపించి నట్లగుపడు చుండును. తీరికగా గూరుచుండిచేసెడి రచనలందలి వన్నెచిన్నెలు, తీరుపు నేరుపులు నా రచనలందు గొఱవడి యుండును. ఏకాగ్ర తయు, నిరంతరాభ్యాసము లోపించినను ఆతని రచనలందలి గుణ బాహుళ్యము మన కక్కజము గూర్చుచుండును. నవనవోన్మేషమైన యాతని ప్రతిభ అడుగడుగున మనచే శిరఃకంపము చేయించును.

ఇటు లెంత ప్రఖ్యినను తరుగని స్మృతులు బాపిరాజునుగూర్చి పెల్లగిలివచ్చుచునే యుండును. నే నాయనతో ననుచుండెడి వాడను; "బావగారూ! మీ మంచితన మంతయు పసివాళ్ళది, మీలో ఏమేని చెడ్డతన మున్నచో నది యీడువాండ్రది. ఇక మిమ్ము ననవలసిన దేమున్నది? ఏమేని యన్నచో—

"ఒకరికి చేయి యిచ్చి
ఒకరికి కాలు నిచ్చి
కూచున్నానోయి బావా!
కూచున్నానోయ్!"

అనుచు బాట పాడుదురు" — అని.

ధన్యుడు మా బాపిబావ. అతని పోకచే మేము నిరుపేదలము.

BLANK PAGE

పేరిగాడు

విజమైనహాస్యం మెదడునుంచి ఉద్భవించేది కాదు. హృదయంనుంచి స్రవిస్తుంది. హాస్యమంటే వెక్కిరింతకాదు. విరసనకాదు. దాని సున్నరూపం 'ప్రేమ'. పెద్దపెట్టున గలగలలాడుతూ వచ్చే నవ్వులో కంటె, సద్దుచేయని చిరునవ్వులోనే దానిలోతులు మనకు తెలుస్తాయి.

"ఉండవయ్యా నేర్చుకపోయావుగాని. పేరిగాడేంది?నీ కెవుడు సెప్పాడు నాపేరు పేరిగాడని. నేనోరను కున్నానో ?... పెత్తాత దురద మగారాజు ననుకోండి— కపడ్డార్. సారాసెంబు తాడు, ఆనంద బొస్సాలు లేకుండా మొనలు మిమ్మల్ని నీ యెట్టిమొట్టి పాట లెవుడు పాడమన్నాడంట ! నాకీ లేడియోలు, గీడియోలు తెల్దు. పిలిమేంటి కీలుం? రికార్టులంట! మా రేవులో మైలగుడ్డ లుతికినట్టు యెప్పుడూ ఒక్కటేగోల. సేతనైతే మోరచింగోయించండి. యీణ్ణి పీకండి చూద్దాం.

యెనక నేను రాజ్జమేలినప్పుడు, —నారంగా, ఒకపాలి తంజావోరునుంచి ఓ బాపనయ్యోరు, ఓ ఆటకత్తె వచ్చారు. ఆట కత్తెంటే యేంటో సెప్పుకోసూద్దాం. ఆటకత్తెంటే—కత్తేఆడుద్ది,

కత్తెట్టుకు మనిసే ఆడుద్దో అనుకుంటుండావు గావోసు; ఓస్! మరిం తేనా నీతెలియి. ఆటకత్తంకే బోగవమ్మోరు. ఆ బోగవమ్మోరు నా యెదట యే మెగిరిందని, యేం దూకిందని, నేతులిసుకుకుంటా యేంసిందాపిందని. నా నేమన్నానో తెలుసా? నాకాణ్ణా నీటక్కూలు; నేతులటా యెగరేసావెందుకు? నికేం ఓయువా? ఓత లేయిసాలే యేడవకన్నాను. ఆనుట్నా కిక్కురు మనకుండా నాకు దణ్ణాలెట్టి నామీద వోసన నీళ్ళు సల్లింది. దున్నపో తనుకున్నావా, వోన కురిపిస్తుండావని నాను నవసమాడేను. అన్నట్టు మరశా; ఆ తంజా వూ రయ్యావోగు-నెత్తెమీద రొవ్వంత కొప్పు, మెళ్ళో అదేంటో తాటిపిందంత గింజ, యియ్యి మొయ్యలేక తల తిప్పి తిప్పి, నాలికెళ్ళ మెట్టి తసక లాడతా ఏ మరిచాడని. వొవ్వా! వొవ్వా! నా రంగా... నా గాడిద ఓర్డ మెడితె రేపు రేపంతా రొయ్యి రొయ్యి రొయ్యిమని మోగి పోయినట్టు ఆ బ్యామ్మకు గుక్కతిప్పకుండా అరిచేతలికి, నాను అచ్చం మాగాడిదవేనయ్యా అని మెచ్చుకోని, నా నత్తె పమానకంగా అచ్చర నచ్చలిచ్చేసినా...అంతకంటె మిన్నాలేడియో పాట లెచ్చేంటీ అంబా? మరిగత్తె, మిన్నా రికార్టులు కొంచెం నయం. డ డ డా, డ డ డా అంటూ రేపు తాళామేస్తా పాడారే— దానిగ్గో సాయంపాకం మాత్ర మిస్తా నంతే.

మీరు సెప్పే కయిత్తాల్లో మాత్రం యిసేస మేంటీ అంటా. యెనకటికి ఒక కయాస్సుడు నా సబకొచ్చాడు, కయాస్సయ్యా! నాను అన్నంలోకే రసంలో కయిత్తం సెయ్యవయ్యా అంటే చణంలో సలవమడతల కయిత్తం సేసినాడు. అట్టా పెతివనిసికీ— సాకలోడికి,మంగలోడికి తెలిసే కయిత్తం మీరు సేయగల్తురా...?

ఆ కయ్యాస్సరయ్య సేసిన కుయుక్తానికి ఆ బ్రెరికి, ఆ పెగ్గెకీ అచ్చెర నచ్చలు గాదు, అచ్చెరక్కోల్లు యీ నా మిచ్చేసినా. ఆ బ్యామ్మాను అట్లాంటి కయ్యాస్సకులు మళ్ళా ఆయ నూరేళ్ళకు పుడతా రన్నాడు. ఆళ్ళకోసం నావంటి పెబువులుకూడా పుడతా రన్నాడు నాకు మల్లేనే ఆ కయ్యాస్సరులుకూడా సదువుకున్నోళ్ళకంటె తామే యెచ్చనుకొంటారంట మరి. ఆయనకి మా కులంగుట్టు యెట్టా తెలిసిందో. బలే బ్యామ్మడా !

నా కటువంటి కయ్యాస్సరులే కావాలన్నాను. ఆ సలవమడ తల కయ్యిత్తం విన్నారు సెప్పగల్రురా మరి? నిజమే—నిజమేమి సత్తె పెమానకంగా నిజమే. మర్రై తే కానీండి. నేను సారా శెంబు తాడు తగిలించుకుంటా!"

ఇదీ_ పేరిగాడు ఆడిన ప్రతాపరుద్రీయ నాటకం. ఓరుగల్లు ప్రభువైన ప్రతాపరుద్రుణ్ణి అడవిలో వేటకువెళ్ళి నిద్రిస్తుండగా తురకలు బంధించి ఢిల్లీకి పట్టుకుపోయారు. రాజు లేకుంటే రాజ్యం అరాజక మవుతుంది గనుక, యుగంధర మంత్రి, తురకలు పట్టుకు పోయినది చాకలి పేరిగాడినని ప్రవాదము పుట్టించెను. పేరిగాడికి రాజువేషం వేసి, సింహాసన మెక్కించి, రాజును విడిపించుటకై తాను వెట్టివాని వేషంతో ఢిల్లీకివెళ్ళినాడు. ఇక్కడ ఓరుగల్లులో విద్యానాథ జనార్ధన మంత్రులు పేయ్య రాజుగా ఆరునెలలపాటు ప్రతాపరుద్రీయ నాటక మాడించినారు.

ఓరుగల్లు కొలువుకూటములో_ఒకసారి_సభలో యీ రహస్య మెరిగిన పదిమంది పొగై కవిగాయకాది వేషములతో ఈ నాటక

మునకు రిహార్సలు నడిపించినారు. అంతకుముందు పేరిగాడికి అనేక విధముల రాజకీయ, మర్యాదలు, లక్షణములు బోధించిరి. జుట్టుకు సౌరస్యం క్రాపుకట్టి దాని నొక సొకరు లాగునట్లుర్చాలుచేసి అది లాగిసపుడెల్ల పేరిగాడిని తుత్రిప్పుచూ "అదీ స్వారస్యం" అందుమని బోధించిరి. కవిత్వము, సంగీతము వినుచు ఆనంద బాష్పములు విడచుటకోసం కళ్ళకు కర్పూరశలాక లంటించిరి. ఇన్ని హంగులుచేసిననూ, పేరయ్య తాను చేయవలసిన రసాభాస చేసి తీరినాడు. మంత్రులు "ఏమిరా పేరిగా! మేము చిలుకకు చెప్పినట్లు చెప్పిన చదువంతా సమయానికి బుద్ధిచేసితి వేమిరా" అంటే; పేరిగాడు_"సామీ, మీకు దండమెడతా, నాకివంతా తెల్లిబాబు, నాకు సదువొద్దు. సదువు కున్నోళ్ళకంటె నా నెచ్చెగందా, నన్నెం దుకు మారాజా సదువుసెప్పి కులం సెడుపుతాను." అని యెమరు తిరిగి దీనంగా నిష్ఠురోక్తి లాడుతాడు. ఔనుమరి. పేరిగాడే కాదు, మరో మహారాజేకాదు, తలకు వగని అధికారం కట్టబెడితే యేం చేస్తారు చెప్పండి. పోనీ, యిప్పుడు లోకంలో దొంతనం చేస్తున్న వారివలె, పేరిగాడు తన కీ పదవి కావలెనని అఘోరించి అటుకులు తిని తెచ్చుకొన్నడా, యేమైనానా? మొత్తో నాకిది వద్దని మొత్తుకొనినాడు. "సింహాసోనం కాడి కెళ్ళితే నాకేమో బయ మేస్తదండీ" అని బ్రతిమలాడుకొనినాడు. అప్పటికీ కాదుకూడదని మెడలు విరిస్తే, "రాసోళ్ళ ఆడోళ్ళా వాళ్ళా నా కాడికి రారు గందా" అని హామీకోరినాడు పాపం! వాడు నీతిమంతుడు గనుక. మంత్రులు తమ కక్కుర్తికొలది, "నీకా భయమక్కర లేదు. నీ యెల్లి యే నీకు రాణి అవుతుంది" అని అగచూపి మభ్యపెట్టిరి. వెర్రి పేరయ్య యీ యెర చూపుసరికి సరేయనినాడు. పాపం! వాని

కెన్నాళ్ళనుండివున్నదో లోలోపల ఆ ముచ్చట. ఇంటివద్ద పూరిగుడి సెలో, నులకకుక్కలో మైలగుడ్డల మాటల మధ్య కూలబడి యెల్లితో ఆడే సరసాలు వస్తుతహా కొంత సరసత్వ మెరిగియున్న వాడగుటచే పేరిగాడికి రుచించి ఉండవు. అంచువల్ల ఎల్లియే నీకు రాణి అవుతుందని చెప్పుసరికి ఎగిరి గంతువేసినాడు. ఒవ్వా యింకేం గావాలిరా నారంగా! అనుకొనినాడు. "యెల్లి నాతో గడ్డి యెక్కుంటదీ, జాజిమల్లి నాతో గడ్డి మానుంటదీ, సందుట్లో సమ యాముసేస్తామురా ! నేను అందుట్లో సడిసాము లాడ్తానురా" అని ఉబ్బిపోయినాడు. సింవాసోనంమ్మాద టక్కుసేసి, ఎోరికీ తెలియ కుండా ఎల్లిని, లంజెను ముద్దిస్కుంటా-నారంగా!" అని ఉబలాట పడినాడు.

అంతేకాదు-మనము వెట్టి పేరాయ అనుకొనిన ఆ అమాయ కత్వము చూటున కొంత కొంచెతనం, గడుసుదనం లేకపోలేదు పేరి గాడికి. "సదరంగాల కాడ" కాయముందుకు త్రోయుమనిన వెను కకు త్రోయుటయు _ జంబెం యెడమచేతివీాద వేసికొమ్మనిన కుడిచేతికి తొడుగుకొనుటయు, యిటువంటి వన్నియు పేరిగాడు యెరిగి చేసిన కొంచెతనములే. యేమ్మా యెరుగనట్లు "రాసోళ్ళ ఆడోళ్ళు నా దగ్గరకు రారు గందా !" అని యెందుకడిగినాడు ? యెల్లి యే నీకురాణి అవుతుందని చెప్పించుకొనుటకు చేసిన గడుసు దనమది.

ఇంతచేసిననూ యెల్లినీ మల్లినీ ఆ చాయలకు రాసీయక పోగా, తుదకు కల్లునీళ్ళకూడ దొవకనిచ్చిరిగాదు. ఈ ఆసునెలల భోగం కాస్తా వదలిపోయి "పెత్తా దురద మగారాజు" మరల

పేరిగాడుగా తయారవుతాడు. తన యింటివద్ద కులసోళ్ళందరితో కూర్చుండి తనివితీర కల్లుపుచ్చుకొనుచు "యీ సీళ్ళకు మాత్రం మొగంవాచి పోయానురా, కల్లుసీళ్ళ ఊసెత్తితే సంపేస్తామన్నారు బాపననాయాళ్ళు" అంటూ విచారపడతాడు పేరయ్య. అవును. పురుషకారంవల్ల సంపాదించుకొని స్వేచ్ఛగా అనుభవించినదే భోగం కాని, ఒకరి వద్దిలో చెప్పుచేతల్లో అనుభవించిన దొరతనము కూడా బండిఖానాయే గదా.

ఆ యారునెలలూ తా ననుభవించిన రాజభోగ మంతయు చిలవలు పలవలతో కులపువాళ్ళకు వర్ణించి చెపుతాడు పేరయ్య. కులపువాళ్లు ఆ మాటలు నమ్మక 'చాకలి నాయాల కియ్యన్నీ జరిగినయ్యా ఉత్తదే' నంటారు. పేరిగాడికి కోపం, రోషం వస్తుంది. కాని ఏమి చేయగలడు? తన రాచరికం, తన దౌలత్తు, దర్పమూ పోయె. మరల ఎప్పటి మైలగుడ్డలు, కల్లుసీళ్ళు, కంపెల్లి మాత్రం మిగిలిరి. పోయిన వైభవం, అధికారం ఎలాగూ పోయింది. ఆ సుఖాన్ని నెమరువేసుకొంటూ ఆ ముచ్చట్లు చెప్పుకుంటూ సంతోషించెద మనిన ఆ మాటలు నమ్మక యెగతాళికూడ చేసిన ఎట్లు? సింహాసన మెక్కి అభావ చేష్టలు చేయు పేరిగాడిని చూచినపుడు నవ్వొస్తుంది గాని రాజ్యంపోయిన "యీ పెత్తాత దురద మగా రాజు" "బ్రతికేడ", "దూడపేడ" లేకుండా నేను కూడు దిననని ఒగ్గేసి కూర్చున్నపుడు నవ్వూ వస్తుంది.—అంతకంటె అధికముగ జాలీ కలుగుతుంది. రాచరికం మంత్రిత్వం మొదలైన అధికారాలూడిపోయిన పిదప అంతకుముున్న సౌకర్లకు, మోటార్లకు పూలదండలకు అలవాటు పడివున్న ప్రాణములు అవిలేకపోవుటవల్ల

దిగాలుపడి యేమీ తోచక మళ్ళీ సాదా మనుష్యులవలె తిరగలేక బాధపడుచుండ జాలికలుగక ఏమి చేస్తుంది.

అదృష్టదేవత యిట్లు లోకరినాకాశమున కెందు కెత్తునో, మరల పాతాళమున కెందుకు దిగద్రోయునో చెప్పలేము. మన భాగధేయములతో బంతులాడుకొనుట ఆమెకు వినోదము. నేడు మన కళ్ళయెదుట యెందరికో రాజయోగములు, పట్టుచున్నవి. ఫలానాకులమున పుట్టుటయో, ఫలానాకులమున పుట్టకపోవుటయో ఆ యోగమునకు కారణమని మనము, సరిపెట్టుకొని సంతోషింతుము. పేరయ్య విషయమునకూడ మనమట్లు సంతోషించుటకు ప్రత్యక్షమైన కారణము కనిపించుచునే ఉన్నది గదా! ప్రతాపరుద్ర మహారాజుకో వానికో ఉన్న రూపసామ్యము తక్కువదా ?

పేరయ్య విషయమున మన మింకొకందుకు కూడ సంతోషించవలెను. తన కో అదృష్టమో, దురదృష్టమో పట్టి రాజైనంత మాత్రమున లోకంలో యితరులవలె పేరయ్య విర్రవీగి ఉబ్బి తబ్బిబ్బుకాలేదు. ఊరివిర్రాద విరుచుక పడనూలేదు. తాను వట్టి అలంకార విగ్రహ మన్నమాట మరువక, ఒడలు తెలిసి మాట దక్కించు కొనినాడు. కొన్ని కొన్ని వెకిలిచేష్టలు చేయుట తప్ప యితర ప్రమాదము లేమియు కలిగించలేదు. "కాపమ్మ మొగుడంటే కామోసు" అనుకొనినాడు. కాదు పొమ్మన్న తన కష్టాబుష్టా తీసికొని మెదలకుండ వచ్చిపోసినాడు. అంతేకాని, కాదు కూడదని పేచీలు పెట్టలేదు. లాభా లాభాల నంత సమదృష్టితో చూచుకొనే యోగ్యుడు నాకు మరొక్కడు కనిపింపడు. బుద్ధిశాలు లైన సెక్రటరీల వంటివారు వెనుకనుంచి సర్వవ్యవహారములు చక్క-

దిగ్గుకు పోవుచుండ నిశ్చింతగా సెలూన్‌లలో ప్రయాణములు చేయుచూ, పూలదండలు, బుక్కాయలు స్వాగతపత్రాలు పుచ్చుకొంటూ, ఊరేగే పేరుగాడివంటి ఉత్సవ విగ్రహాలు ప్రభువులైతే ఇంకా కావలసిన మిటి మనకు? మళ్ళా ప్లెబిసైటో, రిఫరెండమో, లేక బై ఎలక్షను వంటిదో యేదైనా ఏర్పాటుచేస్తే నా మట్టుకు నేను మా పేరయ్యకే ఓటిచ్చి ప్రభువుగా వరిస్తాను. కాని ఆ బుద్ధిమంతుడు అందుకు సుతరామూ ఒప్పుకొనడు.

ఇంతకూ చెప్పవచ్చిన దేమన – హాస్యరసమనేది యిలా ఉండాలి. మన అవివేకాన్ని, అమాయకత్వాన్ని, మన వర్తనలో ఉండే హాస్యాస్పదత్వాన్ని యిలా కన్నులకు గట్టినట్లు చూపెట్టి, మనకు నవ్వు పుట్టించేది హాస్యరసం. అంతేగాని మనలను ఎత్తిపొడిచి, ఉడికించి, ఏడిపించి, కోపతాపాలు కలిగించేది మంచి రకపు హాస్య మనిపించుకోదు. నేడు మన సినిమాలలో క్రోతిగంతులు వేస్తూ, పండ్లికిలిస్తూ, వెర్రికేకలబడి వెక్కిరించే వెకిలిచేష్టలూ, అసభ్య భినయాలు హాస్యరస మనిపించుకొనవు.

ఈ హాస్యమునకు నాటకం, సినిమాలువంటి సాధనం మరియొకటిలేదు. నాటకము లోకవృత్తానికి అద్దము వంటి దందురు. మనలోవుండే కామక్రోధలోభ మోహ శోకముల నిజస్వరూపాన్ని యెత్తి చూపెట్టుతూ నాటకం వాటిని శృంగార వీర కరుణాది రసములుగా సంస్కరించును. అందునా, హాస్యరసము మన లోపాలూ, లేకితనాలు మనకు చూపెట్టి, నవ్విస్తూనే సదుపదేశం చేస్తుంది.

మన సాహిత్యం మొదటినుండి పద్యకావ్యమయ మగుట వల్ల యిటువంటి హాస్యరసానికి చోటులేకపోయినది. నాటకములో, వచనంలో నప్పిప్పుడ్డు హాస్యం పద్యకావ్యంలో నప్పదు. తిక్కన, శ్రీనాథుడు, అనంతుడు, రామకృష్ణుడు, సూరనవంటి హాస్యరస ప్రియులైన కవులెందరో ఉండినను వేరో ఉత్తమని పాత్ర వంటి దొకటితప్ప యితరం మనకు లభ్యం కాకపోవుటకు పద్యకావ్యా లలో హాస్యం రాణించదనుటే కారణమనుకొనవలెను. కనుక, మనకున్న హాస్యమంతటికీ చాటువులూ, శతకములే ఆధారం కావ లసి వచ్చినది.

తుదకు, వీరేశలింగంగారి ప్రహసనములతోడనే మనకు హాస్యరస పాత్రలు దొరక నారంభించినవి. పిన్నాటి; కన్యాశుల్కం, ప్రతాప రుద్రీయం, కంఠాభరణంవంటి హాస్యరస ప్రధాన నాట కాలు వెలసినవి.

ఈ ప్రతాప రుద్రీయ కర్తయైన వెంకట రాయశాస్త్రిగారు మహాపండితులు, శిష్టాచారప్రియులు. గంభీర దర్శనలు. అయి ననూ వారిలో పరిహాస ప్రియత్వము మిక్కుటముగా నుండెడిది. గ్రామ్యాదేశ నిరసనంలోను, సాహిత్య పరిషదధ్య క్షోపన్యాసం లోను, నవీనులపై వారు విసరిన చురోక్తులు, చేసిన పరిహాస ములు అందరూ ఎరిగినవే "ఆంధ్ర ప్రసన్న రాఘవ విమర్శ"నిండా అడు గడుగునా తేలుకొండిలె. వారి చతురసంభాషణలను హాస్య ప్రియత్వమును యెఱిగియున్న సన్నిహితుల కేమోగాని, ప్రతి పక్షులకు వాగు భయంకరులు. విద్యా వివాదాలంకు వారు నిర్ఘృ ణులు. ఆ నిర్ఘృణత్వమునుండి పుట్టినదిగనుకనే వారిహాస్యం సూటిగా, చురుకుగా, చబుకు దెబ్బలవలె తగులుచుండును. ఎంత చిలిపి

హాస్యంచేస్తున్నా శాస్త్రిగారి ముఖమున గంభీరతాముద్ర చెక్కు-చెదర దనిపించును.

ప్రతాపరుద్రీయం చూచినప్పుడు మాత్రము "జగద్భారా వెంకట్రాయ పాస్తుర్లు సాబ్ యింత షులభులా" అనిపించును. వారి గాంభీర్యము, గడుసుదనము చాటుకుపోయి మూర్తిదాల్చిన అమాయికత్వము, అరసికత్వమువలె పేరిగాడు మనయెదుట నిలిచి కడుపుబ్బ నవ్వించును. నీరసులైన కవులు కవిత్వాలు చెప్పటయు, అరసికులైన ప్రభువులు వారిని మెచ్చుకొనుటయు, యిటువంటి పట్టులలో శాస్త్రిగారి చురుకు వ్రేటులుకొన్ని తగులుచున్ననూ మొత్తముమీద పేరిగాడి పాత్రపైనునకు ప్రీతి, ఆత్మీయత కలుగు చుండును. పేరిగానివంటి పాత్రను మన కిచ్చినందుకు శాస్త్రిగారికి "నా సత్తెప్పెమానకంగా అచ్చరనచ్చ లీనాం" యివ్వాలని పించును.

ఆ శు క వి త్వ ము

వస్తువునుబట్టి, గుణమునుబట్టి కావ్యము ననేక విధముల వర్గీకరించిరి. చిత్ర, బంధ, శ్లేష, మధుర విస్తరాదులగు కావ్య భేదములలో ఆశువనునది యొక భేదము. అప్రయత్నముగ చేయు శీఘ్రరచనము నాశుపంచురు.

జొన్నచేనుకాడ జొగసుకత్తెను జూచి
విన్న జేలనుంచి విదరరాదు
దాని నన్నుగూర్చి దయజూపు మాధవా
పొన్న పూలుదెచ్చి పూజసేతు !

అనినాడట రాగాంధుడగు నొక పడుచువాడు. ఇది ఆకు గంటము పుచ్చుకొని వ్రాసిన పద్యము కాదు. దీనిలో కల్పన, శిల్పము వీమియును లేవు. తన మనసు నందున్న కోరికను తీర్చు కొను ఉపాయము తోచక ఆ ముగ్ధ హృదయుడు భగవంతునితోడ మొర పెట్టుకొనినాడు. ఆత డంతకుమున్ను కవిత్వం చెప్పియుండడు. ఆ సమయమందు తాను పద్యము చెప్పుచుంటిసనికూడ ఆత డెరుగడు. అతని భావభరము ఛందోమయముగ వెలువడి ఆతని నొక

కవిని గావించెను. క్రౌంచపక్షుల జంట యందొక దానిని కొట్టిన బోయని జూచిన వాల్మీకి బాధకూడ నిట్లే 'మానిషాద' అని ఛందోమయమై ఆశువుగ; అప్రయత్నముగ వెలువడినది.

మరియొక సందర్భమున వేశ్యాగృహమునకు జని అచట తనకు ఉచిత మర్యాదలు జరుగక కినిసి—

అసనింటి వేశ్యయైతే
కుశలాదిక వార్తలడిగి కూర్చోమనదా,
కనవూడ్చు లక్ష్మీకాంతికి
రసి కత్వం బేమితెలుసు రంగా వినరా !

అని వెంటనున్న చెలికానితో అనినాడట. ఇవి యన్నియు స్వీయానుభవమును అప్పటికప్పుడు చెప్పినవే. వీనినే చాటువు లని కూడ చెప్పవచ్చును. శాలివాహన సప్తశతిలోని గాథలన్నియు ఇట్టివి. అందు చాలభాగము ఆకును గంటమును పట్టి కవులు చేసిన రచనలు కావని తోచును. వీని నన్నింటిని ఆశు కవిత్వము లన వచ్చును.

సాహిత్యగోష్ఠి

పూర్వము, మనదేశమున నాగరకులు సాయంవేళల ఉద్యానవాటికలందు; సంపన్న గృహస్థుల ఇండ్లలో చేరి మధుమైరేయములను సేవింపుచు, అచటనే సంగీత సాహిత్యగోష్ఠి చేసెడి వారు. అందు స్త్రీలకు పురుషులకుగూడ ప్రవేశముండెడిది. అచ్చట ప్రహేళికా, మాత్రాచ్యుతక, బిందుచ్యుతక, సమస్యాపూరణము లనెడి కావ్యవినోదములు జరిగెడివి వారి వారి పాండిత్య ప్రకర్ష

ఆ శు క వి త్వ ము

మును, నవనవోన్మేషమైన ప్రజ్ఞను ప్రకటించెడి ఆ రచన లన్నియు ఆశువు లనియే చెప్పవలెను. పదునేడు పదునెన్మిది శతాబ్దులలో ఫ్రెంచి యా పానకగోష్ఠులను పారిసు నగరమున కళాచతురులగు స్త్రీ పురుషు లొక్కచో జేరి జరపుకొనెడివారు. ఆ గోష్ఠులు SALONS అని ప్రసిద్ధి కెక్కినవి. పరాసుప్రజల కళాభిరుచి, చిత్తసంస్కారము ఆ గోష్ఠులయందె పదను దేరి పరిపాకము చెందెడిది.

ఇక, రాజసభలందు బ్రవర్తిల్లు కావ్యగోష్ఠుల గురించి చెప్పెడిదేమి? భోజరాజు సభయందు దండి, కాళిదాసాది కవీశ్వరు లెల్లరుజేరి ఒకరినిమించి రొకరు ఆశు చిత్ర కవితలల్లి ఆ ప్రభుపును మెప్పించి అక్షరలక్షలు, అగ్రహారములు బహుమానములు పొందుట సంస్కృత సాహిత్యమున సుస్థిరముగ నిలచియున్నవి. రాజసభ యనెడి దొకటియున్నపుడు, అచట ఒక ఆస్థాన పండితుడు, ఆస్థాన కవీశ్వరుడు, విద్వాధికారి మున్నగు వారుండుట; రాజదర్శనము కోరివచ్చిన కవీశ్వరులను వారు పన్నించి పరీక్షించుట, ఆ కవీశ్వరు డా ప్రశ్నలకు ఆశువున సదుత్తరము లిచ్చుట _ అట్టి కవిని ఆప్రభువు సత్కరించుట_ అట్టి సమ్మానితులు దేశమున సుప్రసిద్ధు లగుట _ ఇది మన దేశమునం దనాదిగా నున్న యాచారము. కవి యెంతటి ప్రసిద్ధుడైనను గ్రంథరచన చేయగనె సరిపోదు. దానికి ప్రసిద్ధికావలెనన్నచో రాజసభాసమ్మానముకూడ ఆర్జించవలెను. అట్టివారి గ్రంథములకు మాత్రమే ఊరూర బ్రతులు వ్రాసికొని భద్రపరచెడివారు.

కవిత్వావదరణము

నేడుకూడ గ్రంథ మచ్చువేసిన పిమ్మట, దానిని పత్రికలు రేడియోలు సమీక్షించి బాగున్నదనిన మీదట ఆ గ్రంథము

ప్రసిద్ధికెక్కుటచే, ప్రతులవ్రాయుబోవుట తటస్థించుచున్నది. ఇదిలేని నాడు గ్రంథ ప్రతులు బీరువాలందు చెదపురుగుల పాలగుట తథ్యము. రాజసభల ద్వారా జరిగెడి ఆశుకవితా పరీక్షలు కవి ప్రజ్ఞకు ఒరపిడిరాళ్ళుగ నుండెడివి. ఆ ప్రభువులు కృష్ణరాయాదుల వలె స్వయం కవులు, పండితులు అయియుండిన నిక జెప్పవలసిన దేమి? రాయల సభలో పెద్దనార్యుడు "పూతమెరుంగులున్, పసరు పూప బెడంగులు జూపునట్టివా క్షితులు" అని ఆశువుగా జెప్పిన మ్నాదట రసిక శేఖరుడైన రాయలు "బిరుదైన కవి గండ పెండేరమున కీవె తగుదని తానె పాదమున దొడిగె" నట. భోజ రాజ సభలోవలెనె రాయల సభయందుగూడ చమత్కారజనకము లైన యిట్టి రచన లెన్నియొ జరిగినట్లు మనము వినుచుందుము. తనువాతి కాలమున నాయకరాజసభలో, ఆ పిమ్మట మొన్న మొన్నటివరకు కూడ విజయనగరము, పిఠాపురము, వెంకటగిరి మున్నగు రాజసభలలో కూడ నిట్టి ఆశుకవితా వినోదములు జరుగు చుండెడివి.

మన తెలుగు కవులలో శ్రీనాథుడు మొదలుకొని మొన్నటి తిరుపతి వేంకటకవుల వరకు రాజాస్థానములను ఆశువులచే సమ్మో హపరచిన కవు లెందరో గలరు. వీరి ఆశువులు రాజసభలందు పరీ క్షార్థమే కాక యితరత్ర ఆ యా కవుల యిష్టానిష్టములను, కష్టసుఖ ములను గూర్చిగూడ ప్రవర్తిల్లినవి. ఇట్టి కవితలు శ్రీనాథాదులవి అనేకములు చాటు కవితల పేరిట ఆనాటి సంఘ మర్యాదలను తెల్పుచు నేటికి నిలిచియున్నవి. వేములవాడ భీమకవి మున్నగు వారి శాపనార్థములు, ఆశీర్వాదములుకూడ ఆశుకవితారాశిలోన చేరును.

ఆశుకవితా పద్ధతులు

ఇట్టివేకాక, శతలేఖినీ కవిత్వమనెడిని కూడ ఒక కవితా ప్రక్రియ మన దేశమున వాడుకలో నున్నది. చిత్రభారత కర్తయైన జడికొండ ధర్మన్న తన్ను గూర్చి "శతలేఖి న్యవధాన పద్యరచనా సంధాను రక్తాణ చిహ్నిత నామా!" అని చెప్పికొనినాడు. భట్టు మూర్తికూడ తన్ను గూర్చి "ఘటికా శతగ్రంథ నిర్మాత"నని చెప్పి కొనినాడు. నాయకరా జాస్థానమున మధురవాణి యను వినుషీ మణి తాను "తత్తాదృటి కార్థ నిర్మిత శతశ్లోకో" అని చెప్పికొని నది. ఇట్టి ప్రజ్ఞావంతులలో పూర్వము "యాదవరాఘవ పాండవీయ కర్త నెల్లూరి రాఘవకవి యొకడు. అభినవ పండితరాయలని బిరు దంచిన మాడభూషి వేంకటాచార్యులు, పిఠాపురాస్థాన కవులు దేవులపల్లి కవిసోదరులు, వేంకట రామకృష్ణ కవులుకూడ నీ శత ఘంట కవనము చెప్పినవారె. ఇట్టివా రింకెందరో యుండి ఉందురు.

వీ రెల్లరు చెప్పినవి ఆశుకవిత్వములె యైనను వానిలో మధురవాణి మున్నైన వారి దొక తెగ. అది కేవలము శీఘ్రరచన. ఆమె అరగంటలో నూరు శ్లోకములు చెప్పగల నన్నది. ఇట్టివారిలో మొన్నమొన్న గతించిన కొప్పరపు సోదరకవులు చాల ప్రసిద్ధి కెక్కిరి. వారు గంటకు మూడువందల పద్యములు ఆశువుగ చెప్పెడి వారు. అనగా ఆ రచనకు కాగితము, కలము పనికిరావు. పనివడి చూచి_ వ్రాతవ్రాసినను గంటకు నూరు పద్యములు వ్రాయజాలము. మరి యీ కొప్పరపు సోదరకవుల ఆశుకవితా ప్రవాహము నెట్లు వర్ణింపవలెనో యాలోచింపుడు.

సభవారు కోరిన కథనో, కళ్యాణమునో గ్రహించి ఆ కవులు అనర్గళముగా చెప్పుకొని పోయెడివారు. గ్రంథమనగా అనుష్టుప్పు శ్లోకములని సంకేతము వాడుకలో నున్నది. ఘటికా శత గ్రంథ నిర్మాతలు అట్టి అనుష్టుప్పులు నూరు చెప్పగలినచాలు. ఈ కొప్పరపు వారి ఘంటాత్రిశతిలో వృత్తములు, సీసములుగూడ దొరలిపోయెడివి. ఆ మహాధారలో ఎడనెడ కొన్ని స్ఖాలిత్యములు కూడ దొరలెడి మాటకూడ యథార్థమే కావచ్చును. ఆ పద్యము లందలి యధిక భాగములు నిస్సారములు కావచ్చును. అయినను, ఆ శక్తి అతిమానుషమని చెప్పక తప్పను. తిరి కూర్చుండి ఆలో చించుకొనిన భావమును పద్యమునం దిముప్పటికే తెలగ్రాణము తోకకు వచ్చును గద! అట్టిచోట గ్రుక్కతిప్పికొనక పద్యము లల్లుకొని పోవుట యన్న మాటలు కావు. కీ. శే. అవ్వారి సుబ్ర హ్మణ్యశాస్త్రిగారు గూడ అంతవేగముగ అశువు చెప్పెడివారు.

అవధానము

శతలేఖినీ కవిత _ యనగా నూరు గంటములకు పనికల్పించు పద్యరచన. నూర్గురు సభ్యులు నూరు ప్రశ్నము లడిగి ఘంటములు పట్టి కూర్చుందురు. వారందరికిని తలకొక పద్యము చెప్పికొనుచు పోవుట. విషయ భేదముండుటచే మొదటిదానికంటె ఇది కష్టము. ఇట్లు చెప్పిన వాటిని జ్ఞప్తి యందుంచుకొని తిరిగి ఒప్పజెప్పుటకూడ జరిగిన _ అట్టిదానిని అవధాన మందురు. ఇందు ఆశువుతోపాటు అవధానము _ అనగా, బుద్ధి హెచ్చరికకూడ ఉండవలెను. దీనినే ధారణాశక్తి యందురు.

అష్టావధానము, శతావధానము అని అవధానము రెండు విధములు. అష్టావధాన మనగా నేకకాలమున బుద్ధిని ఎనిమిది వేర్వేరు పనులంశ నిలిపి ఉంచుట. ఆ యెనిమిదింటిలో కవిత్వారచన యొకటి. వ్యస్తాక్షరి సమస్యాక్షరి, చతురంగము, పుష్పగణనము, కావ్యపాఠము, పురాణము, సమస్యాపూర్తి, అప్రస్తుత ప్రశంస మొదలగునవి వుండును. వీనిలో దత్తాక్షరి, నిషిద్ధాక్షరి, సమస్యా పూర్తి అనునవికూడ కవిత్వ రచనలలోనివే. ఆ కవిత్వము అశువని వేర చెప్పనక్కరలేదు. ఈ యెనిమిది పనులకు సభలో ఎనమండు గురు నియుక్తులై ఒకరు చదరంగపు టెత్తు వేయవలసినదని, ఒకరు ఫలాని అక్షరములు వదలి పద్యము చెప్పవలసినదని, మరియొకరు ఫలాని అక్షరములు కూర్చి పద్యముచెప్పుడని, ఇంకొకరు కావ్య పాఠము చెప్పుడని – ఇట్లు తలకొకవంకకు అవధానిని లాగుచుండ, అన్నిటియందు హెచ్చరికతో అతడు ప్రవర్తించుచుండును. ఇది బుద్ధికి కడుశ్రమ కల్గించును. ఈ అష్టావధానము చేయుటకు ఇంచు మించు మూడుగంటల వ్యవధిపట్టును.

ఇక శతావధానమున నూర్వురు పృచ్ఛకులు వేర్వేరు విషయములపై, వేరువేరు వృత్తములను చెప్పవలసినదని కోరుదురు. ఇట్లు నూరు పద్యములు చెప్పి, ఎప్పటి వప్పుడుగాని, అన్నియు పూర్తియైన పిమ్మటగాని తిరిగి ఒప్పజెప్ప వలసియుండును – దీనిలో ధారణా శక్తితోపాటు కవితాశక్తికూడ పరీక్షకు నిలువవలెను. ఇది సుమారు ఇరువది నాల్గుగంటలలో పూర్తికాగలదు. అనగా ఒక్క దినమున తేలెడిపనికాదు. గనుక ధారణను రెండు మూడు దినములదనుక చెడిపోకుండ పట్టి ఉంచవలెను. ఈ శతావధాన మున దత్తాక్షరి సమస్యాపూర్తులుగూడ యుండును.

. జంటకవులు

ఇట్టి యవధానములు ఇప్పుడుకలసి నెరపుటయనునది తిరుపతి వేంకటకవుల నాటినుండి పరిపాటియైనది. ఒకొక్కరే చేయు దానికంటె ఇరువురు కూడిచేయుటయందె కష్టమెక్కువ. ఎవరి పద్యమువారు పూర్తిచేయుట, దానిని జ్ఞప్తి యుంచుకొనుట కంటె, ఒకరు ఆరంభించిన పద్యమును రెండవవారు కలిపి పూరించుట, ఉభయులుచెప్పి పూరించిన పద్యమును ఉభయులు ఎవరికివారు ఒప్పజెప్పుటలోగల శ్రమ చాల నధికమని వేరే చెప్పనక్కరలేదు.

తిరుపతి వేంకటకవులు శతావధానముచేయుట మానివేసి నలువదేండ్లు గడచినవి. కనుక నీతరము వారి వినోదము కొరకు ఆ యవధానపద్ధతి యెట్లుండెడిదో కొంచెము వివరింతును. అవధాను లిరువురిలో నొకరు మొదటి పృచ్ఛకుని నీకు దేనినిగూర్చి పద్యము చెప్పమందువని అడుగును_పృచ్ఛకుడు ఉద్యానవనమును వర్ణింపుమని కోరును. ఏ వృత్తమున వర్ణింపుమందువని యవధాని యడుగ, ఉత్పలమున చెప్పుమని పృచ్ఛకుడనును. అంతట అవధాని "సేనల తోడ నిందువిడిసెన్ మదనుం డన నొప్పెనొక్క యు" అని ఒక్క పాదముచెప్పి యూపును. పిమ్మట రెండవవారిని మూడవవారిని ఇట్లే అడిగి వారుకోరిన చొప్పున ఒకొక్క చరణమును చెప్పికొనుచు పోవును. ఇట్లు నూర్వురకు ప్రథమచరణములు పూర్తిచేయును. ఇవి మున్నియు ఆలకింపుచు గూర్చున్న రెండవ యవధాని అంతట వచ్చి పృచ్ఛకులను_విచారడిగిన విషయమేమి? మీకు చెప్పిన పద్య పాదమేమి ? యని అడుగగకయే క్రమముగ "ద్యానవనమ్ము

చూచితెసఖా !" అని మొదటి చరణమందుకొని నూర్వారకు రెండవచరణములు చెప్పికొనిపోవును. పిమ్మట మొదటి యవధాని మూడవచరణము, రెండవయవధాని నాల్గవచరణము చెప్పి పద్య ములను పూర్తిచేయుదురు. తుదకు ఇర్వురు కలిసిచెప్పిన నూను పద్యములను వేర్వేరుగ ఒప్పజెప్పవలయు. తిరుపతి వేంకటకవులు చేసిన శతావధాన ప్రక్రియ ఇట్టిది. ఇందెంత కష్టమున్నదో యెంతటి ధారణాశక్తియుండవలెనో ఆలోచింపుడు.

ఏకాగ్రత

ఇంతటి ఏకాగ్రత బుద్ధికి ఎట్లు కుదురునని నే నొకమారు వేంకటశాస్త్రిగారి నడుగగా_"నా బుద్ధిని పదిగదులుగా విభజింతును. మొదటి పదిమందికి పది చరణములు చెప్పిన మ్మాదట వాటి నొక్క పరి సింహావలోకనముచేసి మొదటిగది యందుంచి తలుపు మూయు దును. ఇట్లు పది పది చరణముల చొప్పున పదిగదులు నింపిన మ్మాదట, మొదటిగది తలుపు తెరచి చూచినచో అందుగల పది చరణములు వరుసగపచ్చి కనులముందు నిలబడును. పిమ్మట రెండవ చరణమును వానికిజోడించి తలుపుమూయుదును. ఇట్లు గదులన్ని పడేసి పద్యములతో నిండినమ్మాదట ఒక్కొక్కగది తెరచి వాటినిచదివి ఆ చెర విడిపింతును.ఇట్లు గది ఒకటింటికి నూరు పద్యములువేసి మొత్తము వేయి పద్యములనుకూడ జ్ఞాపకము పెట్టు కొనగలమని మా కా రోజులలో ధైర్యముండెడిది" అని వారు చెప్పిరి.

ఇది అద్భుతమైన బుద్ధి ఉండినగాని కుదురని పని. మా చిన్నతనమున ఈ యవధానములతో, అశుకవిత్వములతో.

తెలుగునాడెల్ల సందడిగ నుండెడిది. ఇప్పటి విద్యార్థుల మనస్సులు రాజకీయ పక్షముల యభిమానములతో నిండియున్నట్లు – అప్పటి విద్యార్థుల మనస్సులు ఈ యాశుకవితా వినోదములతో, ఆ యవధానగోష్ఠులతో నిండియుండెడివి. ఆ రోజులలో దేశమంతట అట్టి కవితావాయువు వీచుచుండెడిది. కనుకనే అప్పుడు కళాశాలలందు చదువుచున్న వారిలో పలువురి మనస్సులకు సాహిత్యవాసనలు పట్టి యెందరో కావ్యరచన కారంభించిరి. ఆంధ్ర సాహిత్యమునకు వసంతోదయమువంటి ఉద్యమము ఆ కాలమున తిరుపతి వేంకట కవులవలన ఉదయించినది.

సాహిత్యపు విలువ

ఈ యవధాన కవిత్వముకూడ ఆశువేయైనను, మొదట చెప్పిన ఘంటాత్రిశతికి, దీనికి భేదమున్నది. ఈ యవధానాశువు వ్రాసికొనుటకు అనువైనది గనుక దానిలో కొంత కవితాగుణ ముండినచో తరువాత చదువుకొనుటకు పనికివచ్చును. ఆ యవధానము చేయు కవిగారు సహజముగ మంచివారై యున్నచో నూటికి పాతికమైనను అందు మంచిసరకు తేలును. ఘంటాత్రిశతిగా చెప్పెడి ఆశువులో, నిగ్గుకొంతయున్నను అది వ్రాయుటకు అవకాశ మీయక గాలికిపోవును గనుక "చచ్చినబిడ్డను కళ్ళు చేరెడు, ఒళ్ళు బారెడు" అనినట్లు నిరుపయోగ మగును. పెద్దనగారి "పూత మెరుంగులు." అనెడి మాలికయేమి, "లొట్టియుడేటిమాట పెనులోభులతో మొగమోట"యని భట్టుమూర్తి చెప్పిన మాలికయేమి – యివి యన్నియు వ్రాసికొనుటకు వీలుగా చెప్పినవే. అట్లుగాక, అవి అత్యాశువులైనను గాలిలోనే కలసిపోయెడివి. అత్యాశువులో

ఆ శు క వి త్వ ము

వెలువడు వికారములనే పానుగంటివారి కంఠాభరణములో చిత్ర విచిత్రముగా పరిహాసపాత్రము చేసిరి. ఈ యాశుకవిత్వమున ఆకాశ పురాణ మనెడి మరియొక ప్రక్రియకూడ ఉన్నది. ఎవరైన ఏదేని గ్రంథము పఠించుచుండిన, మధ్యలో అందుకొని దానిని ఒక్కొక్క పద్యముగ ఆశువుగా పురాణము చెప్పినట్లు చెప్పవలెను. గత శతాబ్దిలో ప్రసిద్ధిచెందిన శిష్టు కృష్ణమూర్తి కవి కీ ప్రజ్ఞ యుండెడివట.

ఇట్లు, అప్పటి కప్పుడేదో విషయమునుగూర్చి చమత్కారముగా ఆశువు చెప్పు టట్టులుండ, కవీశ్వరులు దినమున కొక ప్రబంధము చెప్పనేర్తుమని ప్రతిజ్ఞలు చేసినవా రుండిరి. అనగా – సామాన్యముగ జేయు గ్రంథ రచనకంటె ఇట్టివారి గ్రంథరచన కొంత వేగముగ సాగుసన్నమాట. మంచి కల్పనాశక్తియు, ధారాపాటవముగలవారికి పద్య రచనచేయుట క్రీడామాత్ర మైయుండును. వారికి ముందుగ భావోదయమై, అటుపిమ్మట దానిని ఛందోబద్ధము చేయుట యనెడి వ్యవధానముండదు. వారికి కలుగుభావము ఛందోమయముగనె బయలుదేరును.

ఆశుకవిత్వ స్వరూపము

మరియొక తీరున చూచినచో భావతీవ్రతగల కవిత్వమంతయు ఆశువుగనే పరిణింపవలసి వచ్చును. తిక్కన్నగారు చెప్పినట్లు మహాకవిత్వ దీక్షావిధి నొంది, రసపరతంత్రుడైన కవి పద్య రచనకొఅకు ముందువెనుకలు తడవికొనుట యుండదు. అట్టి ధారాశుద్ధిగల కవిత్వమే హృదయంగమముగ నుండును. కొందరు కవులు ఒక్కొక్క పదమును ఏరికోరి– ఆచితూచి పద్యరచన చేయుదురు.

అట్లు చేసినను వారి శిల్పపాటవమును బట్టి పద్యము కుంటినట్లుండక పరుగులెత్తును.

'కావ్యము' అనినపుడు రమణీయార్థకల్పనచేసి, రసాను గుణమై తమలోన దొరయు శబ్దములను ముత్తెపుసరులవలె పోహా ళించిననే కవికి సంతృప్తి; సహృదయుల కానందమును ఘటించును. అంతియేకాని, వేగమే ప్రధానముగ చేసిన రచనలు వినోదప్రాయ ములుమాత్రమే కాగలవు. రసభావపరతంత్రతయే కవికి ప్రధానము గాని రచన ఆశువుగ సాగినదా? సవ్యవధానముగ సాగినదా? అనునది అంత ముఖ్యముకాదు. ఎంతటి ఆశుకవియైనను తనమనస్సు రమించని విషయమును చెప్పవలసి వచ్చినపుడు కలమాడదు. కావు ననే చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రులవారు "అగుదున్నేను మహాశుధార కవితావ్యాసంగి, నట్లయ్యు యత్నగతిన్ జెప్పెడుపట్ల పగలున్ రేయును ఒక్క పాదమునకే పట్టున్" అని తము అనుభవమును చెప్పిరి.

మనఃస్ఫూర్తిగ రచన చేయునప్పు డట్లుండునో వారే వేరొక చోట "శ్రీరంజిల్లెడి నీమ వర్ణనకునై చేయూప శబ్దార్థముల్ నేనే వచ్చెద, నేనె వచ్చెదను, నేనేవత్తు, నేవత్తు, నేనే, నేనేయని వచ్చి మీదబడు" ననిరి.

మంచిపను లన్నింటికిని ఆలోచన సవ్యవధానత ఉండవలసి నట్లే మంచికావ్యమునకుగూడ ఇవి ఉండవలెను. కనుకనే అప్పకవి 'నిలుకడవలయు కృతికి' అనినాడు. ఫలితార్థమేమన, రచన నిలు కడగ చేసినను, వేగముగ చేసినను, మనఃస్వాస్థ్యము ముఖ్యము.

అంతటి ఆశుకవియని హేర్వడ్డ పెద్దనకూడ కావ్యరచనకు నిరుపహతి స్థలంబు, రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెము మున్నైన మనోరంజకమున్లైన సామగ్రి కావలెననిరి. ఆ విషయమునే—

రమ్మన్నన్ వెసరావు, రావలదనన్ రాకుండగా బోవు,
రమ్యమ్మ్మల్ కైతలకుంగళాకళలు వేళావేళలుం గల్గు సం
ద్రమ్మ్మం జెందెడి నాటుపోట్లకుబిలెన్, సంగీత సాహిత్య, మా
ర్గమ్మ్మల్వో యివి స్వస్థచిత్తులకు దక్కన్ ద్రొక్కగారానివౌ

అని జనమంచి వెంకటరామయ్యగారు చెప్పిరి.

BLANK PAGE

విదురుని విందు

శ్రీ భట్టాచార్య విరచితమైన "శ్రీ కృష్ణుడు-విదురుడు" అను త్రివర్ణ చిత్రపటము ఈ వ్యాసమునకు మూలము.

జనార్దనుడు పాండవ దూతయై హస్తినా పురమునకు వచ్చు చుండెనను వార్త విని నయశాలియగు వృద్ధరాజు తూర్యాది శోభన పదార్థంబులతో నాప్తుల నెదురు పుత్తెంచి, నగరమంతట మంగళా లంకారములు చేయించి, అతిమాత్ర గౌరవముతో నాతనిదోడ్తెచ్చి, ఉన్నత కనకాసనముపై నుపవసింపజేసి యెంతెయు బేర్మినెఱపెను.

యాదవ పట్టభద్రుడును, విదిత పరాక్రముడునగు శ్రీకృష్ణు తనవానింగా నొనర్చుకొనగోరెనో, ఆయన యెడ సీశ్వర భావన సలుపు భీష్మాదులకు సంతుష్టి కూర్పనెంచెనో, తన కొమరుల యవినయము నీ సత్కార సన్నాహములతో గప్పి వెట్ట నెంచెనో కాని,ధృతరాష్ట్రుడు తనజన్మమున కానాడు పండువని చెప్పుకొనెను. వంశము తరించె ననెను. హస్తినాపుర సార్వభౌముని ప్రాభవ మంతయు గృష్ణోపచారమునకే వినియుక్తమగుచున్నట్లు లుండెను.

అంధరాజు నుపదేశముచే గాబోలు, సుయోధనాదులు శ్రీ కృష్ణుని సగౌరవముగ సంభావించి, తమ తమ యిండ్ల గుడువు మని ప్రార్థించిరి. భీష్మాదులమాట వేఱ చెప్పనక్కరలేదు. 'మీ యందఱ యిండ్లకు వచ్చినట్లే, మీ యాదరమే చాలు' నని కృష్ణుడు భీష్మాదులకు వచించి, 'నీవు నాకు విరోధివి, నీయింట గుడువజన' దని సుయోధనుని చిన్నబుచ్చెను.

ఈ రీతిగా కౌరవ మహారాజాతిథ్యమును తిరస్కరించి, శ్రీ కృష్ణభగవానుడు, తనకొఱకు కెదురుచూచుచున్న విదురుని యింటికి విందై యేగెను. భక్తసులభుడు గదా స్వామి! రాజమందిరములకు వెనుకచక్కఁ వీధిలోనున్న విదురుని జీర్ణకుటీరము స్వామి రాకకొర కెన్నాళ్ళనుండి యుత్కంఠతో నెదురు చూచుచున్నదో కాని! రత్నతోరణములా! కనకార్ఘ్య పాత్రములా! వాదిత్ర నాదములా? యెవ్వియును లేవు. లక్ష్మీ సనాథుడగు శ్రీ మహా విష్ణువున కావేద విదురు డేమి కాన్కలు పెట్టగలడు? త్రిలోక పావనియగు మందాకినికి ప్రభవ కారణములైన ఆ చరణ పద్మముల కాత డొసగు నర్ఘ్యతోయమే లేపాటివి? 'కొండంత వేల్పు మన యింటి కతిథియైవచ్చినే ఎట్లుపచరింపగలమా?' యను సందియము, సంభ్రమము విదురునకు బొడమలేదు. ఆ మృణ్మయ పాత్రము తోడనే పాద్య మొసంగి, ఆనందాశ్రు మిళితముగా బాదములు గడిగి లోనికి గొనితెచ్చెను.

స్వామి తనకేమి క్రొత్తవాడా? తాను స్వామికి క్రొత్తయా? తన భాగ్య భోగములు ఆయనమాత్ర మెఱుగడు గనుకనా? నిత్యము తనలో వసించు స్వామికొఱ కిపుడు తాను క్రొత్తగా

నిల్లలుక వలయునా, క్రుంగులు పెట్టవలయునా? స్వామికొఱ కామందిరమెప్పటికప్పుడు వాసకసజ్జికవలె పరిశుభ్రమైసిద్ధమైయున్నది. రా! తండ్రీ! నీ యింటికోనికి రమ్మా!

యఱ్ఱోదా గేహమున ఉలూఖినిబద్ధమైన ఆ యుపనిష దర్థమునకు హేమసింహాసనము కావలెనా? హంసతూలికా తల్పము కావలెనా? భక్తి నక్రమగు విదురుని తనువు వలెనే వంగి యున్న నలక మంచమదిగో! స్వామి శరీర స్పర్శకొఱకు నిలువెల్ల పులకింప వేచియున్నది.

ఇంటిలో భోజన సంభారము లేమియున్నవో, ఏమిలేవో? విమున కాచింతయేలేదు. కుచేలుని కొంగున ముక్కటుకులు, శబరి యొంగిలిపండ్లు నారగించిన తండ్రికి తాను క్రొత్తవానికి బలె మధుర పదార్థ సంపాదనముకొఱ కలజడి చెందుట ప్రీతి లక్షణము కాదు. తనతోబాటు కలియో, గంజియో నిత్యమువలెనే నేడును స్వామి ఆరగించును.

కాని విదురుని కుటీరమున ఆ వెలుగేమి? ఆనందజ్యోతీ సముజ్జ్వలమగు విదుర మనఃకుహరము వలె నా యిల్లుగూడ రత్న తోరణము గట్టినమాడిక; విద్యుద్దీపికలు వెలిగించిన పగిది నపూర్వ కాంతిపరిష్లావితమైనది. అభ్యంతర గృహమున కడ్డముగనున్న తడ కలు తమంతతాము విప్పుకొనినవి. అపురూపమగు నా వెలుగు వెల్లువ లోనికి ప్రవహించుచున్నది.

పీతాంబర ధారియు, హరితోత్తరీయుడును దీర్ఘపీవర భుజుడును, విశాలవక్షుడును, 'అభినవనవనీతస్నిగ్ధ దేహుడును

అర్ధనిమీలితారవింద సుందర నయనుడు నగు నాస్వామి వసించినది కుక్కినుంచమా! హేమసింహాసనమా! కెంటనుగాదు. భక్తి ప్రఫుల్లమగు విమల హృదయాంబుజము మీదనే ఆ స్వామి యాసీనుడు కానోపు. లేనిచో ఆ ప్రశాంతి, ఆ నీరవత, ఆ యేకాంతము నెట్లు లభింపగలవు! సజలజలదనీలమగు కృష్ణుని దేహకాంతి విదుర హృదయానంద జ్యోతిలో కలసి పలుచనై సాత్వికతేజము వెదజల్లుచున్నది.

ఆ తేజము యజ్ఞోదా హృదయానందమగు కిన్నోరా కృతియా? కాదు. అమర భయంకరములగు శంఖచక్రములా? లేవు. కౌరవ రాజసభలో నాసీనుడైనప్పటి లెక్కా? కానరాదు. మునిమనోనేత్రములకు మిణుమిణుగొల్పుశతకోటి సూర్యప్రభయా యది? కాదు. శ్రుతి సీమంత భాగముల విహరించు జ్ఞాన జ్యోతియా? కాదు. మఱి విదురుని యెదుట నిలై ఆ కూర్చున్నదెవరు? ద్రౌపదీ మానరక్షకుడు. తండ్రిలేని ప్రజయగు పాండవులకేడుగడ. కౌరవ కుటుంబమున తగవు దిద్దవచ్చిన రాజబంధువుడు. 'మా విజయుంజేరెడి వన్నెకాడు'. వేయేల? రూపెత్తిన విదురుని స్వానుభూతి. విదురుని విందు.

కౌరవరాజ మంత్రియయ్యు విశదవర్తనుడై, పాదజుడయ్యు మహాజ్ఞానియై, బ్రహ్మచారియయ్యు సాధుబాంధవుడై; కృష్ణుని బహిఃప్రాణములగు కౌంతేయులకు శ్రేయస్కామియు, సదుపదేష్టయు, ప్రాణదాతయు నగు విదురుడు నేడు ధన్యుడు. ఆ యుగతికుని యిల్లు నేడు వైకుంఠమైనది.

విశ్వాత్ముడగు వాసుదేవుని తనయింట, తన కట్టెదుట, తన చెంత గూరుచుండ బెట్టుకొని, ఆ జగద్బాంధవుని ఆత్మీయుని గవించుకొనిన సమోన్మాదముచే విదురుని వృద్ధదేహమునకు తారుణ్యమంకురించుచున్నది.

ఏకాంతయోగమున తొల్లి ఆ స్వామితో ఆనందరతి సల్పునపుడు నిర్వ్యాపారములగు విదురుని ఇంద్రియగ్రామము నేడు ఎట్టియెదుట సాక్షాత్కరించిన పరమాత్మను తనివిదీఱ ననుభవించుచున్నది. బక్కచిక్కి కౌపీనము ధరించియున్న విదుర శరీరము ప్రమోదరసమున నార్ద్రమై నిలువున కందళించుచున్నది. ఆతని సకలాంగకములు నుప్పొంగుటచే కంఠమందలి తులసిపూసలపేరు గుత్తమైపోయినది.

స్వామి సన్నిధాన సౌభాగ్యము జుబ్బన జూఱగా గ్రోలుచు ఆ భక్తుడేమో మాటలాడుచున్నాడు. 'నా తండ్రి దీర్ఘప్రయాణమున బడలివచ్చినాడు. ఇంచుక సేదదేఱిన పిమ్మట నారగింతువు గాని. బిడ్డలు ధర్మజాములు కుశలముగా నున్నారు కదా! ఎన్ని కష్టములు వచ్చినవి బిడ్డలకు! పాపము! మహారాజదుహిత, కోడలి కెన్ని కడగండ్లు వచ్చినవి. ఏమో, నాయనా! బిడ్డలపాలిటికి నీవే కలవు. దాయాదుల యింట దినమొక యుగముగా వేగించుచున్నది వదినగారు. చూచివచ్చితివికదా, ఆ దేవిని. పదమూడేండ్లకు తిరుగా నామెకు నేడే పండువు. ఔనుకాని, బాబూ! నీకుగూడ నీ వెఱ్ఱియేమి! అంధుడు కార్యవచనములు వినునని నీ కింకను ఆసయా! కోడుకులు విననిత్తురా? ఏమో నాయనా! ఈ పాపకర్మాల మధ్య వచ్చిపడినావు జాగ్రత్త సుమా'

అనుచు నే మేమో బాలుని వలె మాటలాడుచు, వీజన సేవ చేయుచు ఆ కృష్ణమేఘు ముఖమున వెడలు గంభీర శబ్దములను శ్రోత్రపుట ముల నార గ్రోల నువ్విళ్ళూరు చున్నాను. స్వామి ప్రసన్న ముఖతామరసమునం దాతని చూపులు లగ్నమైనవి. అందనక స్వామికి వీజన సేవ సలుపు చున్న చింకివిసన కట్టి అతని బుజమున నట్టె విశ్రమించినది. మోకాలిపై నానుకొనిన విదురుని దక్షిణ హస్తము తనంత సాగి అల్లన స్వామిని స్పృశించు చున్నది.

- ఓహో! ఏమి యా స్పర్శ సుఖము? ఆస్పృశించు చున్నది విదురుని హస్తమా? విదుర హృదయము నుండి పొంగి వచ్చిన ఆనందరసతరంగ లేశమా! లేక విదురుని ప్రాణమే లేచి వచ్చి స్వామిపై వ్రాలినదా! ఆ స్పర్శలో ఎంత సౌకుమార్యము, ఎంత వినయము ఎంత భక్తి ఎట్టి కౌతుకము చిప్పిలు చున్నదో! భట్టా చార్యుని రచనమునందీ స్పర్శయే రసవద్ఘట్టము. తక్కిన దంతయు నా రసవన్మహూర్తసిద్ధికొరకు గల్పింపబడిన పూర్వరంగము వంటిది.

కిసలయ కోమలమగు హస్తముచే ప్రియుని స్పృశించు ప్రేయసీ మధుర స్పర్శయా యది? కాదు. వాత్సల్య రసపూర్ణమై బిడ్డను అంకతలమునకు లాగికొను జననీకర స్పర్శయా? కాదు. చనవు పెంపున సానురాగముగ మిత్రునిపైకి సాచిన కేలా? కాదది. భక్తి పారవశ్యమున నిష్ట దైవమును బిగియార గౌగలించుకొన గోరు భక్తాగ్రేసరుని పాణిస్పర్శయు నది కాజాలదు. తాను దైవమున నుండగా ప్రవాసమున కేగి చిరకాలమునకు తిరిగివచ్చిన తండ్రిని, తల్లి లేని బిడ్డడు కొంకుచు దరిచేరి 'నా తండ్రియా యితడు?'

అను నాశ్చర్యముతో, 'ఈతడా నా తండ్రి ?' యను కౌతుకముతో 'నా తండ్రికదా' యను చన వొక వంక, నూతనత్వముచే గల్గిన కొం కొకవంక సందడింప అల్లన దరిచేరి విశద వీక్షణముల నాతని మోమునుగాంచుచు మెల్లన స్పృశించు అనుభవ విశేషమేమో యది. విదురుడు ఆత్మజ్ఞాన నిష్ఠితుడయ్యు పరమయోగి. తనయందు నిఖిల భూతములందు పరమాత్మను దర్శించు నా జ్ఞానికిది నూత నానుభవము. ఆ సచ్చిదానంద పదార్థము తన యెట్టయెదుట సాక్షాత్కరించి ఏకాంత మొసగినతటి కరచరణ విశిష్టమగు నా రూపమును వింతయు మోదమును గడలొక్కను జూపుల జూచుచు శిశువుపోల్కి చాపల్యముమై నొక్కసారి స్పృశింప గోరెను. ఆత్మైక భోగ్యమగు నాయానంద కంద మిట్టిదియా యని యచ్చెరువుతో, ఆ సుందరపదార్థమే యిది యని రూఢిపఱచు కొనుటకు అట్టి యా సత్య శబ్దార్థము మూర్తిమంతమై తన కేకాంత మిచ్చెగదా యను సంతోషముతో, ఈ శాంత తేజము నాపాలిటిది గదా యను ఆత్మీయబుద్ధిచే, ఒక్కసారి ముట్టిచూచిన ఎట్లుండునో యను కౌతుకముచే, ఇట్టి మహాభాగ్యము నాకుగదా లభించెనను సంతోషముచే, అది మఱల జుణిగిపోవునేమో యను భీతిచే, నొక్కపరి చేతులార స్పృశించి యానందించుచున్నాడు.

కవితా సమాధియందు తన మనఃఫలకమున ప్రతిబింబించు భావమున కక్షరరూప మొసగి నోరార చదువుకొని యానందించు కవియు, తన మనోనేత్రమున సాక్షాత్కరించిన సుందర రూపమును వర్ణములతో చిత్రించుకొని కనులార జూచుకొని మురిసిపోవు చిత్ర కారుడును, ఆ యక్షరమూర్తిని; వర్ణరూపమును తమ హృదయములకు ప్రతిబింబము లగునో కాదోయని పరీక్షించు కొనుచు,

మాటి మాటికి వంకరలు దిద్దుచు, అంతకంతకు కైసేయుచు, ఒంటి పాటున లాలించుచు, అనునయించుచు ఆమూర్తి సోయగమున కబ్బుగపడుచు, ఇది నాసృష్టియని ఆనందించు భవ్యమహూర్త మిది విభుని స్వర్గానందమున సాక్షాత్కరించినది.

సౌమ్యములు, సుకుమారములు, సాత్త్వికములు, నగు వర్ణముల మేళనముచే చిత్తరువు సముద్ర గర్భమువలె గంభీరమై, జ్ఞాన దీపోజ్జ్వలమగు యోగీంద్ర మనఃకుహరమువలె నిశ్చలమై, నీరవమై శాంతరస ముట్టిపడుచున్నది. నిస్తరంగమగు పాలకడలి నుండి పైకిలేచిన 'చిన్ని వెన్నెలకందు' వలె రేయెల్ల దిమ్మరించిన జడివానచే ప్రకృతియెల్ల నివము గొన్నతటి ప్రత్యూష మందహస నముచే, కించిచ్చలితమగు నారామ గర్భమునుండి వీతెంచిన తొలిపిట్ట కూత పోల్కి, అవనత వదనయగు నవవధూ నయన యుగ్మమునుండి ప్రియునిమోమువై నల్లన ప్రసరించు ప్రథమ వీక్షణము భంగి, అమృతభాండమువై గట్టిన మిగడ తరకవోలె ఆ హస్తస్పర్శ భట్టాచార్యుని సంస్కార విశేషమును చెప్పక చెప్పుచు మన హృదయముల నల్లన ప్రబోధించి, విభునకేగాక మనకుగూడ శ్రీ పరమాత్మను విందుసల్పుచున్నది. భట్టాచార్యుని సిద్ధహస్తమునకు స్వస్తియగుగాత.

"మధురభారతి"

మా బుచ్చి సుందరుని స్మృతి

మధురభారతి, స్వయంవ్యక్తి, మా బుచ్చి సుందరరామ శాస్త్రిగారు దేహమును చాలించి రనిన దుర్వార్త విని ఆంధ్ర రసజ్ఞలోక మెంత పరితపించునో! శాస్త్రిగారిని చిరకాలమునుండి శ్వాసామయ మొకటి బాధించుచున్నను, "లంఘనములు, మనుగుడుపులు" అనినట్లు వారు కాలక్షేపము చేయుచు వచ్చిరి. నాలుగైదు మాసములనుండి బొత్తుగా దేహాస్వాస్థ్యము చెడినదనియు, ఇంటి వద్దనే ఉండిరనియు వింటినిగాని, ఇంతలో నిట్లు ముంచుకొనివచ్చు నని ఊహింపనైతిని. "శాస్త్రిగారు నిన్నొకసారి చూడగోరుచున్నా" రని మిత్రులు కాళిదాసుగారు జాబువ్రాసి పది దినములైనను కాలేదు. శరీరస్వాస్థ్యము లేని కారణమున, నిర్భాగ్యుడను, వారి తుదికోర్కి తీర్పజాలక నేడో రేపో వెళ్ళి చూచివత్తు ననుకొను చుండగనే, మా బుచ్చయ్యశాస్త్రి పరలోకవాసి యయ్యెను.

"బాబుగారూ!" అనుచు ప్రియమార పలుకరించి, కౌగిట జేర్చుకొను మా బుచ్చిశాస్త్రి కనుమరుగైపోయెను. అడుప దడ్డ

కలసినపుడెల్ల, అప్పటికి క్రొత్తగ వ్రాసిన పద్యములు ముందుగా వినిపించి, "ఎట్లున్నవి చెప్పరూ?" అని యడిగి, నేను మోమోట మిచే "బాగున్న" వనుచుంటినేమో అను సందేహము కొలది, "బాబుగారూ! నిజంగా చెప్పండి" అని గడ్డము పుచ్చుకొని అడి గెడి మా బుచ్చయ్య నెట్లు మరువగలను? వీధివెంట నడచుచునే పద్యములు వినిపించుచు, చప్పున అడ్డము తిరిగి నిలబెట్టి "ఏమం టారు? నా మామూలు ధోరణిలో ఉన్నవా?" అనెడి మిత్రసత్తముడు, కావ్యేక జీవనుడు, మా బుచ్చన్న కన్నులలో మెదలుచునే యున్నాడు.

విశాలమైన ఆ ఫాలతలము, ఒత్తయిన కనుబొమలు, కొట్ట వచ్చినట్లుండు ఆ ముక్కు, శరీరమునకు సౌష్ఠవమాపాదించు ఆ బొజ్జయు— "ఎగ్రోయ దిగజారు నెద్ది మాధవపెద్ది" అని ఆయన చెప్పుకొనినట్లే— ఎంత ఎగలాగినను బొడ్డుక్రిందికి జారిపోవు ఆ పంచె కట్టు,— అడుగో! మా సుందరరామ వామనుడు! పరధ్యానముగా ఒకొక్కక్క అడుగే వేసికొనుచు నడచి వచ్చుచున్నట్లే ఉన్నది. బొత్తములులేని ఆ చొక్కా, ఎంత తుడిచినను ఊటలూరు ఆ పొడుము చారికలు, మడిచి చంకను బెట్టికొన్న ఆ పైపంచెయు, అయ్యో! ఆ యవతారము తలచుకొనినచో నవ్వువచ్చును. మటి సారస్వత తేజము ఉట్టిపడెడి ఆ ఫాలతలము చూచినచో ముద్దు వచ్చి చేతులు మోడ్చ బుద్ధి పుట్టును.

విజయవాడలో రసజ్ఞులందరు ఒకసారి మా బుచ్చన్నకు సత్కార మేర్పాటుచేసి చేతికి సువర్ణఘంటాకంకణము తొడిగిరి. ఆ కంకణముతో ఫోటో తీసిరి. కృష్ణాపత్రికలో ప్రకటించుటకై ఆ

ఫొటో తీసుకొని వెళ్ళగా, మా గురుదేవులు కృష్ణరావుగారు చూచి "ఈయనలో ఎంత తేజస్సూ అందము ఉన్నదంటేను!" అని ఆశ్చర్యపడినారు.

అన్నట్లు మా కృష్ణరావుగారికి శాస్త్రిగారు వచ్చిరని నంతనే ప్రాణములు లేచివచ్చెడివి. ఆయన ఉండిన న్నాళ్ళు మా దర్బారు కవితా వర్షమున ఓలలాడెడిది. పద్యములు చదువు చున్నంతసేపు ఆ సరస్వతీమూర్తికి చగాపులు, మనస్సు చూఱ విడిచి, దర్బారు దర్బారంతయు చెంతనున్న శిలాప్రతిమలలో ప్రతిమయైపోయెడిది. అట్లు గంటలకొలది కంచుకంఠముతో తనివి చెందక, రాత్రి ప్రొద్దుపోయి ఇండ్లకు వెళ్ళునప్పుడు మరల మరల త్రోవవెంట నెమ్మనిగా పద్యములు చదువుచు నడక సాగనిచ్చెడి వారుకారు. కవిత్వము వినిపించు మనినంతనె అది యెక్కడి బులపా టమొ వట్టి పసివాడైపోయెడివాడు మా బుచ్చన్న.

ఇంటికివెళ్ళి చూచుకొనగ పొడుముకాయయో, ముక్కు తుడుచుకొను చేవస్త్రమో, పైపంచెయో కనిపించెడిదికాదు. అవి త్రోవలో ఎక్కడ జారిపోయెడివో! అది యెక్కడి కవితా పార వశ్యమో! అడుగడుగున మైమరచిపోవుటయే. మనతో కబుర్లు చెప్పుచున్నవాడు చెప్పుచునే యుండెడివాడు. మిషనరీ మిస్సమ్మలు తెలుగు నేర్చుకొనెడి ముచ్చటలు ఏవియో చెప్పి, నవ్వించు చుండెడివాడు. అంతలో అస్థిరుడై పరధ్యానములో పడిపోయెడి వాడు. అట్టి సమయముల మన లోకములోనె యుండెడివాడు కాడాయన.

అప్పు డాయనను జూచిన ఆశ్చర్యము, భయము, దిగులును పుట్టెడివి. మన ఎమటకూర్చుండి, మనత్రో సరస సల్లాపములు చేయుచు, పద్యములు వినిపించు ఆ బుచ్చయ్య అంతలో మన లోకమును, మనలను మరచిపోవుట చూడగ ఈయన మనలోవాడు కాదనియు, నిజమున కాయనది శిశులోకమో, సిద్ధలోకమో యని తోచెడిది. మనతో నవ్వుచు, త్రుళ్లుచు పూసుక తిరుగుచునే ఎడమై పోవుటయు, ఈ లోకమును ప్రీతిమై చూచుచునే అసక్తుడై పోవుటయు, తలచుకొనినచో మా బుచ్చయ్య కీ యిహయాత్ర లీలా మాత్రమేమో యనిపించును. రాత్రివేళల భోజనములైన పిమ్మట వెన్నెలలో పండుకొని కబుర్లు చెప్పికొనుచుండెడి వారలము. అంతలో కబుర్లుమాని గుఱ్ఱు పెట్టెడివాడు బుచ్చయ్య. మరి పది నిముసములకు "బాబుగారూ! నిద్రపోతున్నారా!" అని పలకరించెడివాడు. గుఱ్ఱు పెట్టిన ఆ పది నిముషములలో ఎటకోపోయి వచ్చెననిపించెడిది. అప్పుడు పరీక్షించి చూచినచో వ్రేళ్లు లెక్కించుకొనుచు నుండెడివాడు. ఎన్నిమారులో, "ఇది యేమని" గ్రుచ్చి గ్రుచ్చి యడుగగ ఒక పర్యాయము చెప్పినాడు _ "బాబుగారూ! నాకు లోపలఏదో ఘంటానాదమువలె వినిపిస్తూ ఉంటుంది. ఆ ధ్వని వింటూఉంటే ఎంతో సుఖంగా ఉంటుంది" యని.

"నాలో కొన్నిదినాలనుండి ఎవడో నాగస్వరంబూదుచున్" అని మృత్యుంజయ స్తవములో బైటపెట్టి నాడా యను భవమును. ఔను బుచ్చన్నా! నీవు ప్రణవమంత్రపరాయణుడవు, నే నెరుగుదును. "నావంబోలె ప్రయాణమైనది మహానందప్రవాహమ్ములో, భావం బెక్కడిక్కో" యని నీవు చెప్పనే చెప్పితివి.

"ఏదో వెన్నెల చీకట్లో కలసినట్లే పర్వతాగ్రాన నున్నారే, యొక్కరిలోన నింకొకరు లీనంబౌచు నున్నట్టులున్, వేరౌచున్నట్టు కానుపించెదరె ! కానీ, వారికే వారు పట్టరే, ఆది పురాణదంపతులు కారేవారు" అనుచు నీ దివ్యానుభూతిని బ్రకటించితివి. ప్రకృతి పురుషుల లీల నంత స్పష్టముగ దర్శించిన నీ చూపులు మమ్మ్నులను చూచుచునే లోపలకు కుంచించుకొనిపోయెడి వనినచో ఆశ్చర్యమేమున్నది.

నిజమునకు, బుచ్చయ్య కీ లోకముతోడనేమి పనియున్నది. చిననాడె భార్యా వియోగము తటస్థించి విరక్తి శిక్షించినది. కాకున్న మువ్వురాడు పిల్లలను వదలిపోయినది తమ ప్రేమఫల ముగా నాయిల్లాలు.

"కడుపుండీపియు, గాఢమైన యనురాగం బేకమై సారెకున్
విడు ప్రత్యక్షకణమ్మునందు ప్రతిబింబింపంగ సంతానము
న్నెడకున్ నాయెడ కషిగోళములు నీ విట్టట్టునున్ ద్రిప్పి చూ
చెడి యీ నీ కడసారి చూపె ననుమన్నెన్ నేటి పర్యంతమున్"

అని సతీస్మృతిలో చెప్పినట్లు ఆ పిల్లలపై చూపుపెట్టుకొని మిష నరీ స్కూళ్ళయందు తెలుగుపంతులు పనిచేయుచు కాలక్షేపము చేసినాడు బుచ్చయ్య. పిల్లలను, వృద్ధమాతను, కోడూరుగో ఇంటికడవీడి తానొక్కడె పొలుగూళ్ళయందు నౌఖరీ చేయుచు, తండ్రిగారుచేసిన ఋణములనెట్లో తీర్చికొనినాడు. పిమ్మట ఆరో గ్యముచెడి తెనాలి చేరుకొనినాడు. పిల్లలకు పెండ్లి పేరటములు నెరవేర్చినాడు. కోడూరులోనున్న తల్లి గారిచెంత ఒకయడుగు, తెనాలిలో డాక్టరు గోవిందరాజుల సుబ్బారావు, వేదాంతం లక్ష్మీ

నారాయణగారల చెంత ఒక యడుగుగ దిరుగుచు, మధ్య మధ్య సాహితీ సభలకు పొరుగూళ్ళకువెళ్ళి మరల తెనాలి చేరుకొను టయు—ఇదీపని. పాపము! వృద్ధురాలైన ఆ తల్లి—తన కుమారుని అస్థిర ప్రకృతిని యెరిగియున్నది గనుక వెట్టిబాగుల బిడ్డ డేమై పోయినాడోయని తెనాలివచ్చి ఇంటికి బిలుచుకొనిపోగా నచట రెండునా ళ్ళుండెడివాడో లేదో, మరల తెనాలిలో సిద్ధమయ్యెడి వాడు.

మిత్రులతో గోష్ఠియు, కావ్యనిర్మాణము వినా రెండవ గొడవలేదు. "ఆత్మసమోన్మాదము కల్మి కావ్యరసమున్ గొనియాడుచు నుందు" అని తిక్కనగారు చెప్పినమాటలు మా బుచ్చయ్యపట్ల అన్వర్థము లనుకొందును. ప్రణవమంత్ర సిద్ధమైన చిత్తునిను, కావ్యరసపరాయణత్వము, ఈ రెండే మా బుచ్చయ్యకు సత్య ములు. తక్కిన ఇహయాత్ర యంతయు ఆయనకు స్వప్నమువలె నుండెడిది. అలౌకికమైన ఈ విచిత్ర ప్రకృతిని గ్రహించియు మా బోటి మిత్రులపట్ల ఉన్నట్లుండి ఆయన ప్రకటించు అసక్తతను చూచి, పామరత్వముకొలది బాధపడుట కద్దు. మిత్రులము మాత్రమెకాదు, ఇంటిలో కొమార్తెలు, నూరిలో బంధువులు గూడ ఈ నిర్లిప్తతనుగాంచి ఆయనను మమకారహీను డగు కఠిను డనియు, కపటప్రేమ నటించుననియు, అనుకొనుట కద్దు. ఆయన స్వభావము కొంతకొంత యెరిగియున్న వారైనచో మా బుచ్చయ్య వట్టి వెఱ్ఱివాడని సరిపెట్టు కొనెడివారు. ఇంతకు, ఆయనను నిందించి ఏమి ప్రయోజనము? స్వప్నమువలెతోచు ఈ లోకమును ఆయన ఇంతకంటె అధికముగ ఎట్లు గౌరవింపగలడు ?

మా బుచ్చి సుందరుని స్మృతి

బుచ్చి సుందర రామశాస్త్రికి కవిత్వము పుట్టువుతో వచ్చిన దేగాని తెచ్చిపెట్టుకొనినది కాదు. బ్రాహ్మణకోడూరు మాధవ పెద్దివారు వెలనాటి వైదికులయ్యును మొదటినుండియు లౌకికవృత్తి యుండె యుండిరి. ఆ వంశమునందు జన్మించిన వారందరును-అదేమి యదృష్టమోగాని- ప్రయోజకులనిపించుకొనిరేగాని ఒక్కరును వ్యర్థులులేరు. ఆ వంశముచేవ అట్టిది. ఆంధ్రమహాభారతము మున్నగు కావ్యములు ఆ ఇంట స్త్రీ పురుషాదుల కందరకు కంఠపాఠము. వెంకట్రామయ్యగారి తండ్రి పదకవిత్వము చేయుచుండెడివారని బుచ్చయ్యగారు స్వయముగ ఆ రచనలు వినిపించుచుండెడివారు. వానిలో ఎంతయో ఉపజ్ఞ కనిపించును. ఇక బుచ్చయ్యగారి తండ్రి శంకరశాస్త్రిగారిని చూడబోతిమేని ఆయన రామభక్తుడు, మంచి పౌరాణికుడు.

బుచ్చయ్య తండ్రిగారి వద్దనే కావ్యములు చదువుకొనినాడు. ఇంటిలో అనుదినము భారత భాగవత పురాణ కాలక్షేపము ఉండనే ఉన్నదికదా! సంగీతముకూడ జంటస్వరములు, వర్ణములు, కొన్ని కృతులు బుచ్చయ్యగారు అభ్యాసము చేసిరి. లౌక్యవృత్తియు, దస్తావేజుల మతలబీ చిన్నతనమునందె పట్టువడినది. ఇక నాటకములరంది వేర చెప్పబనిలేదు. మాధవ పెద్ది లక్ష్మీనరసయ్యగారు- బుచ్చయ్య- వెంకట్రామయ్య మొదలైన కుట్టికారునంతటిని కూడగట్టి నాటకము లాడించుట యంతయు చిత్రమైన కథ.

నానావిధమగు యీ సామగ్రితో బుచ్చిసుందరరామ కవి బయలుదేరెను. పదకవిత్వ రచనముతో ఆరంభించి, ఆశుకవిత్వము

లలో బడెను. క్రమముగ కవితాసామార్గము లన్నిట గడిదేరి, పిమ్మట శ్రీ వేంకటశాస్త్రుల వారిచెంత కడియములో రెండు సంవత్సరముల పాటు శుశ్రూషచేసి, కొంచెము కౌముది చదువుకొనినాడు. శ్రీ వేంకటశాస్త్రుల వారిచెంత చేసిన గురుకులవాసమంతయు అదియొక చిత్రకథ. శాస్త్రులవారు సుందరరామయ్యను వారములు చేసికొన నీయక తమయింట నుంచుకొని పుత్రనిర్విశేషముగ ఆదరించిరి. అప్పటికప్పుడే సుందరరామయ్య చక్కని కవిత్వము చెప్పుచుండెడి వాడనియు, పాఠము చదువుకొనుటలోగూడ ఆతనిధోరణి ఆతనిదే ననియు, సుందరరామయ్య స్వయంవ్యక్తుడనియు, శాస్త్రులవారే సెలవిచ్చుట కద్దు. శ్రీ శాస్త్రులవారి తృతీయపుత్రుని ఆడింపు చుండుటయు, తనకు తోచినప్పుడేదని పాఠము చదివిన చదువుటయు ఇదియే కడీయములోని కాలక్షేపము. పట్టరాని కవితావ్యస నము పుట్టినపిమ్మట ఇంక చదువు సంధ్యలేమిసాగను? శాస్త్రుల వారి సన్నిధానములో, ఎన్నియో ప్రయోగ విశేషములు, కవితా రహస్యములు గ్రహించుట మాత్రము జరిగినది.

అంతకుమున్ను పద్యము లేమిత్రాసెనో తెలియదుగాని ఉన్నట్లుండి "భారతి" పత్రికయందు "సతిస్మృతి" యను పద్యములు పడినవి.

జ్వర లీవ్రతీవ్రతా త్వరమాణ హృద్యంత్ర
చరమసడీ హతా స్తంబనములు.
ఇహ నిరాకా నిన్న ళ్ళైక సూచనముఖ
చంద్రాస్తమయ తిరశ్చీనములు.
.....

విషమ ఘటనా విభిన్న విభిన్నమైన
నా హృదయ దర్పణమున అనంతముగ
ప్రతిఫలించి....
....

మున్నగు ఈ పద్యములు చదివి, "ఎవరా యీ మాధవ పెద్ది బుచ్చి సుందర రామశాస్త్రి ? ఇంతటి ప్రౌఢకవి సరసకవి యిన్నాళ్ళు ఎక్కడ దాగిఉన్నాడు?"అని ఆశ్చర్యపడితిని.తరువాత ఆ పద్యములు ఆపేరుగూడ మఱచిపోయిన పిమ్మట, గుంటూరు నవ్య సాహిత్య పరిషత్తులో అయన ప్రథమ దర్శనము లభించినది. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ కాబోలు _ మా కిరువురకు పరిచయము చేసెను. పరిచయము చేయుటే తడవుగ పద్యములు వినిపింప నారంభించెను. రకరకములైన పద్యము లొక్కొక్కటె వినుచున్న కొలది, నా హృదయము కరగిపోయి శాస్త్రిగారికి వశమైపోయినది.

మరల నొక సంవత్సరము పిమ్మట బెజవాడ నాట్యకళా పరిషత్తునందు మే ముభయులము కలిసికొనినాము. మరల పాతవి, క్రొత్తవి పద్యములు వినిపించిరి.పద్యములు వినిపించుచు మధ్యమధ్య నన్నేవేని పద్యములు చదువుమని కోరెడివాడు. ఊరక మరియాద కటుల అడుగుటయేగాని చదువ్రుటకు నాకు వ్యవధియిచ్చెడివాడా? క్రొత్తవారివద్ద పద్యములు వినిపించుట యనిన నాకు అప్పటికి నిప్పటికి కంపము. అప్పటికి మా సౌందరనంద మచ్చువడినది. శాస్త్రిగారు దానిని చదివిరి కావున నేను వేరుగ వినిపించుటని లేకపోయినది.

తరువాత కొన్నాళ్ళకు తెనాలిలో డాక్టరు గోవిందరాజుల వేంకట సుబ్బారావుగారి ఇంటివద్ద మరల కలిసికొనినాము. ఆ మూడవ సమావేశమునసె ఎపుడో "బాబుగారు!" అని పిలువ నారంభించిరి. తదాది ఆయనకేగాక కోడూరి మాధవపెద్ది వారి కుటుంబమున కంతటికి "బాబు" నై పోతిని. మిత్రుల మైత్రికొఅకటుల ల్లాడు నాకు బుచ్చయ్యబాబు జన్మశతములకేని స్మరింపదగిన మైత్రీ భాగ్యమును పంచియిచ్చెను.

మాకు పరిచయమైన కొలదిదినములకె శాస్త్రిగారు "బృందావన" మను గ్రంథము ప్రకటించిరి. కవిత్వములో ఆయన ఎన్ని పోకడలు పోగలరో అన్నియు బృందావనమున మచ్చు చూపిరి. వానిలో 'శారద' అను గ్రంథమునుండి ప్రకటించిన కొన్ని పద్యములున్నవి. ఆ గ్రంథము పూర్తిగ ఉన్నదనుచు శాస్త్రిగారు చెప్పుటయెగాని ఉన్నదియో లేదో నా కిప్పటికిని దెలి యదు. బృందావనములోఉన్న పద్యములు చూచినంతట యీ "శారద" ప్రతిపద్య రసాస్పదమని తోచును.

ఆ బృందావనములోనె "రామాయణమునుంచి" అనుచు కొన్ని పద్యములున్నవి. శాస్త్రిగారు తరువాత రచించి, ప్రకటించిన "పంచవంటి", "శబరి" యనెడి రామాయణ కథా ఘట్టము లన్నిటికి తలమానికముగ నున్న ఈ పద్యము చూడుడు -

"అది చిన్న చిన్న ముత్యాలు ముత్యాలుగా
పెలయేటిలో నీరు చిలుకుచోటు
ఆ చిన్న నీటిముత్యము ముత్యమును ముద్దు
లొలుకు నాసమయ మరొక్కదయంబు,

ఆ స్వర్ణ సూర్యోదయంబు పశ్చిమ పర్వ
తాంత రాంతర భూధరాంచలముల
ఆ యంచలములపై నాడు యారుణ్య
మహహా! ఎంతటి హృదయంగమంబు
ఆ యకృత్రిమ రామణీయక మనోజ్ఞ
రత్నకాంతి ప్రవాహ సీరాజనమున
రాజిలుచు నున్నయతడె శ్రీరామమూర్తి
జలధర శ్యామసుందర చక్రవర్తి !

అతి రమణీయమైన స్థలకాల నిర్దేశముచేసి పురోభాగమందు ప్రధాన వస్తువును నిలిపిచూపు చిత్రలేఖనమువలె వీనులను కన్నులు గావించు నీశబ్ద చిత్రమందలి భావనాబలము, దానికితోడు నాల్గవ పాదపు టుత్తరార్ధమున "ఆ యారుణ్య మహహా! ఎంతటి హృదయంగమంబు" అనుచు భావతరంగమంచు విరిచినవిరుపు ఎంతయో అద్భుతముగనున్నవి. శాస్త్రిగారి కవిత్వమును అమరముచేయుట కీయొక్క పద్యము చాలును.

ఇంక పంచవటి, శబరి అను రెండు కావ్యములనుగూర్చి చెప్పెడిదేమి? శాస్త్రిగారు ఆ రెండు గ్రంథములను రచించి – "పోతరాజుగారు రామాయణమును వ్రాయలే"దనిన కొరతదీర్చిరి. ఇట్లే అశోకము, ఋష్యమూకము, మిథిల, అనుచు రామాయణ కథాఘట్టము లన్నింటిని రచించవలెనను సంకల్పము నెరవేరకయె శాస్త్రిగారు గతించుట ఆంధ్రభాషా దురదృష్టమందును. శాస్త్రిగారి రచన ముఖ్యముగ నాటక పద్ధతియందు నడచును. వారి భావన కూడ ఉపజ్ఞా మహితముగనుండును. శాస్త్రిగారు "ఉమరుఖయా"

మను గ్రంథమును రచించిరి. ఖయ్యాము రుబాయిలను కొన్నిం టిని అతిసరసముగ తెనిగించుటేగాక, ఖయ్యాము కవితా సార సర్వస్వమును జీర్ణించుకొని ఆ రాగభోగ కవితారసాలమునకు అంట్లుగట్టి, భారతీయ తత్త్వాను రూపమైన స్వీయ వ్యాఖ్యానముతో ప్రోదిచేసి సరస కవితాఫలముల నందించిరి. బృందావనము రచించు నాటికె ఉమరుఖయ్యామునుగూడ సంకల్పించుటవలన దానిలోనివి గూడ కొన్ని పద్యములను బృందావనమున ప్రచురించిరి. ఉమరు ఖయ్యామునకు శాస్త్రిగారి వ్యాఖ్యానభంగిని చూపుటకై పద్య మొకటి ఉదాహరించెదను.

> అరియున్ నీకు అనిష్టమైనమెరవ సంతాన్రవృన్దాగ్రహన్నుగే
> పౌమవంగాబకినట్టి చంద్రకళవై హా మిస్నివు; దివ్యోదక
> ప్రహదమైపోదును నేను, నాయుదక మధ్యంబులు బింబించి. నే
> గదలన్గాలికి, నీవునున్ గదలియూగన్వచ్చు నా లోపలన్.

ఆంధ్రసారస్వతమును వెలిగించిన మహాకవులపంక్తిని శాస్త్రి గారికి ఆసన మీయదగిన 'పంచవటి' మున్నైన ఈ కావ్యము లన్నియు ఒకఎత్తు; వారిచాటు రచనలు మరొకయెత్తు. అందును హాస్యకవితలో శాస్త్రిగారు నిస్సపత్నమైన కవితాసింహాసన మధి ష్ఠించిరి. పండితపామర రంజకమైన శాస్త్రిగారి యీ చాటుకవిత భావుకజనైకరంజకమైన వారిప్రధాన కవితకు అపచారము చేసినదని యూహించుచుందును. ఆంధ్రలోకము శాస్త్రిగారిని అసమానహాస్య కవిగా ఎఱిగినంతగా ప్రౌఢకవిగా ఎఱుగదనియే చెప్పవలెను. సామాన్యలోకమునేకాదు; విశేషజ్ఞత యుండదగిన నేటి కవిలోక మును గూడ శాస్త్రిగారి యీ హాస్యకవితయే మిక్కిలి ముగ్ధులను

చేయుటవలన వారికి హాస్యకవితా పట్టభద్రత లభించినమాట వాస్తవమేకాని దీని ప్రాబల్యము వారి చారుకవితకు అపచారము చేసినదన్న హాస్యరసమునకు సహజమగు సౌలభ్యమే ఇందులకు కారణము.

మా బుచ్చన్న స్వభావముచే హాస్యప్రియుడు. బుచ్చన్న కెగాదు, మాధవపెద్దివారందరకు హాస్యప్రియత్వమున్నది. శుభ కార్యములంను మాధనపెద్దివారందరు ఒకచో జేరినపుడు ఒకరిపై నొకరు ఛలోక్తులు, పరిహాసోక్తులు విసరికొనెడి ఆ సరాగము చూచియే తీరవలెను. ఎవటివారిని చూచి నవ్వగలుగటలో విశేషమేమియులేదు; తన్నుదానె నవ్వుకొనగలిగిన ఈ సంస్కార విశేషము మా బుచ్చన్నకు వెన్నతో బెట్టిన విద్య. ఈ సంస్కారమే లోపించినయెడల హాస్యకవికి లోకముమీద ద్వేషము; అసహ్యత; జనించును. అప్పుడు హాస్యకవితా ప్రయోజనమే చెడిపోవును. తన లోపములను చూచి తాను నవ్వుకొనగలిగినవాడు, ప్రజల లోపములను సానుభూతితో అనుకంపతో చూడగలుగును. లోకముపట్ల అట్టి ప్రీతికొలది నవ్వనారంభించినచో లోకముకూడ ఆ హాస్య దర్పణమున తన్నుదాను చూచుకొని 'ఆటలో అరటిపండువలె' తన్నుదానే నవ్వికొని లోపములను దిద్దుకోగలుగును.

ఈ సంస్కారమె బుచ్చన్నను హాస్యకవితయందు అద్వితీయుని చేసినది. హాస్యకవితలో నున్న ఈ గుణమునకు తోడు బుచ్చన్నకవి రూపముకూడ నవ్వుపుట్టించెడిది. తెనుగుదేశము నాలుచెరగుల నానావిధములవారు వేలకొలదిగ గుమిగూడిన సాహితీసభా రంగములలో మా బుచ్చన్న కంఠమెత్తినచాలును—

కంఠమెత్త నక్కరలేదు; ఆ యమాయికపు వెట్టివేషముతో సభా రంగమున నిలిచి, పొడుముపట్టు పట్టినచాలును_సభను ఒకానొక ఉత్సాహతరంగము చుట్టముట్టును. ఆ కంచుకంఠముతో బిల్హరి రాగమో, నాదనామక్రియయో, అందుకొని "సరిగా దస్కత్తు చేతగాని క్షుపితల్, సన్నాసులుంగూడ, పార్కరు డ్యూపోల్డిట జేబులందిడగ" అనుచు నారంభించి_"అదో పోజట, ఉత్త పుణ్యమునకె సోఫా నాపసోపాలు" అనియో—

"అమెరికా కధ్యక్షుడగు రూజువెల్టుకు
పొట్ట కోసమొక రొట్టె కాని,
సకలభాతి వియంతకు గాంధికేనియు
వేళ కిన్నియే మేక పాలుగాని
.....
పనియు పాటునులే కూటి భైరవుడుగ
తిరుగు సోమరిపోతు కీదేశమందు
తీర తీరుల నెన్నెన్ని తీయములును
ఆటిరా వొక్కపూట సాపాటుకేని —

అనుచు, మెత్తమెత్తనివి, వెచ్చవెచ్చనివి, పరిహాసములు విసుచుండగ—అప్పటికి మూడునాల్గు పర్యాయములేని "కాఫీ దేవాలయములను సేవించి వచ్చినవారును" "సెల్యులాయిడు ఫ్రేము స్పెక్టికల్సువారును" "టూ ర్పెడోపేప్డు పెన్నుల వారును" "సిక్సు పెన్సీల్ నవల_గోల్డుఫ్లేకు సిజర్లు వారును" కూడ తమ్మునుదాము మరచి హాస్యరస వీచికలలో ఊగులాడిపాయెడి ఆ దృశ్యముల నెరుగని వా రెవరు? ఇప్పటికి పదునైదేండ్లనుండి జరుగుచున్న సాహిత్యసభ లన్నింటికి బుచ్చన్నయె ప్రాణము. బుచ్చన్నలేని

మా బుచ్చి సుందరుని స్మృతి

సాహిత్యసభ యేదియొ వెలితిగ నుండును. ఆంధ్రసాహిత్య జీవనము మా బుచ్చన్నతో తన రక్తినిగూడ గోల్పోయి దరిద్రాణమయినది.

"ఒక లంబోదరుడైన పుత్రకుని మున్నన్నట్టి నీకు జా
లక కాబోలును సృష్టిచేసితివి యీ లంబోదరుం గూడ"

అనియు, తన జీవితము "స్టంటుం బిక్చరుకంటెగూడ అధమస్థ" మనియు—

"ముగురుం బిడ్డలు కాపురాని కరుగన్ మొండెమ్ముగానున్న యీ
మగ యింద్రాణికి రాజయోగమటరా మందేశ్వరా"

అనియు తన్నుదాను నవ్వుకొనుచునె, అంతలో,

"లింగూలిమ్ము జపాన్ తుసానులె ఆ లీగన్ విజృంభించి, స
ర్వాంగ క్షార మొనర్చుచున్నది అఖండాంగ్లేయ సామ్రాజ్యమున్
దుంగల్ నల్వదికోటులున్నయవి హిందూజాతియం, దెందు కీ
జంగాలన్న స్వకుటిపోషణముకున్ సంతాన వృధ్యర్థమున్

అనుచు లోకమును నవ్వగలిగిన మా బుచ్చన్న హాస్యరస లోలత్వము మృత్యుంజయ శతకమున అద్భుతమైన పరిపాకము నందుకొన్నది. ఈ హాస్యరస కవిత్వమున వాడెడి శబ్దజాలమును పరికించినచో మా బుచ్చన్న కవిబ్రహ్మయై సాక్షాత్కరించును. అన్యదేశ్యములను, తెలుగునందు అంత చక్కగ, కలగలుపు జేసిన కవులింతకుమున్ను పుట్టలేదు సరిగదా, అది యేదో విచిత్రమైన అపూర్వ శబ్దజాలమును సృష్టించుకొని వాకుకందని అర్థములను అట్టె కన్నులకుగట్టు నేర్పు ఆయనకె చెల్లును.

"కైకై టక్కిరిబిక్కి గుల్గుల గులుక్టాకీల సంగీత" మని వర్ణింప దొడగును.

"లీలన్ గుడ్డకు గోచికెల్లరము లాలీపాప్పు పారీసు కిక్కి లీల కుక్కలు వాడి" అనుచు ఏదో ఇంద్రజాల మారంభించును. "తిరు గుళ్ళుం, దిఫిరీల్, దఫావతులు, వ్రాల్ దిద్దుళ్ళునుం, ఫోర్జరీ వర వళ్ళున్" అనియు—"పడదీయున్ ముకుద్రాడుంోయు, నోక దెబ్బన్ ఠస్సజెకిించు, నెత్తడచున్, గొమ్మలమీద గొట్టు, నెదో కయ్యంద్రోయు, దీయున్ వపన్ దుడుచున్ సర్వముమైల, డయ్యారు వలెన్ దోకించు, డేకించు_" అనియు ఊపిరాడకుండ అపుర్వాప మైన శబ్దపరంపరల గుప్పుచుండును. సానుకంపమైన ఇట్టి హాస్యరస దృష్టితో లోకమం దాతడు చూడని తావులేదు; స్పృశించని విషయ మును లేదు. అర్థశాస్త్ర రహస్యములను, ప్రకృతిశాస్త్ర విశేషము లను గూడ మర్మభేదకమైన దృష్టితో వెలికిలాగి, హాస్యరసముతో పొలిపి, సులభ సుందరముగ చేసి కంటిముందు నిలుపుచుండును. ఇతరులు ఆ మార్గము త్రొక్కలేరు. గురుదేవులు వేంకటశాస్త్రుల వారు సెలవిచ్చినట్లు 'తనత్రోవ తాను నిర్మించుకొనిన సుందర రామశాస్త్రి నిజముగ స్వయం వ్యక్తి.'

ఇక సుందరరామకవి నట్లు వదలి సరస సంభాషణా చతురు డైన మా బుచ్చన్న సంగతి ఎత్తుకొనినచో ఎంత చెప్పినను తనివి తీరదు. మిస్సమ్మల కథలేమి? నాటకము లేమి? పేకాటలేమి? పాటలేమి? పదములేమి? ఎన్ని దినములేని, చెప్పినదె చెప్పినను ఎప్పటి కప్పుడు-పిల్లలు, పెద్దలు పొట్టచెక్కలగునట్లు నవ్వుచు విను

చుండవలసినదె. మా కృష్ణాపత్రిక దర్బారులో మా "గురుగ్రంథ సాహెబు"తో గూడ బుచ్చయ్యగారి ఈ కథలు వినుచు ఎన్నిదో మధుర సాయంతనము లిట్టె గడిచిపోయినవి.

పిల్లలకు గావలసిన కథలు, పాటలు, ఆరంభించినచో పిల్లలందరు 'తాతగారు తాతగా' రనుచు ప్రాణము లిచ్చివేయుదురు. మా బుచ్చయ్య పిల్లలను వినోదింపజేయుట తలచుకొనిన "పైడ్ పైపర్ ఆఫ్ హామ్లిన్" జ్ఞప్తికి వచ్చుచుండును.

ఆంధ్రదేశము, ఆంధ్రసాహిత్యము ఎంతటి అద్భుతవ్యక్తిని గోల్పోయినది? బుచ్చన్నా! ఆంధ్రసాహిత్యమును, నీ మిత్రకోటిని, వారి పిల్లలను దరిద్రులనుజేసి నీ దారి నీవు చూచుకొనినావు. మా మాట అట్టులుండగ, నీ ముద్దుల బిడ్డలను, త్వదేక జీవనమైన మాతృదేవతనుగూడ దిగవిడచిపోయినావు. మమ్మెల్లరను ఇటుల మురిపించుచునే, నీ త్రోవ నీ వేనాడో చూచుకొనినావు; కావున నిన్ను గూర్చి విచారించుట పామరత్వమని యెఱుగుదును.

"పావనమౌ సహస్రదళ పద్మసువర్ణమయాలయంబులో
శ్రీవరుడైన రాఘవుడు చిన్మయుడై వెలుగొందు చుండ నీ
జీవన పుణ్యతీర్థమున శీఘ్రమె క్రుంకిడి దాటిపొమ్ము మా
యావరణమ్ము, నామ కుసుమార్చనవేళ యతిక్రమించెడిన్

అనుచు 'రాఘవ పరబ్రహ్మైక్య సంధానము" కొఱకు ఏనాడో తొందర పడినావు. ఆ నామ కుసుమార్చనవేళ అతిక్రమించ లేదనియు, "దొరకున్ మోక్షమె లేని నాకు వ్యయమందున్ కేతువే

హేతువై" అని నీవు చెప్పినమాట యథార్థమే అగుననియు ఎరుగుదును. నీవు కన్నారచూచి నేస్తము కట్టుకొనిన పురాణసిద్ధ శబరితో ఇప్పటికప్పుడె రాఘవ పరబ్రహ్మైక్య సంధానమున ఉండియుందువు. మాకు నీవు ఇచ్చిపోయిన శబరి ఉండనే యున్నది. అదియె పదివేలు.

సరస్వతీ చతుర్ముఖుల శృంగారము

సృష్టి కర్తయైన చతుర్ముఖుని విషయమున మన కవులు మిక్కిలి అవచారము చేసినట్లు కనబడుచున్నది. కృత్యాదిలో ఇష్ట దేవతా నమస్కారములు చేయునప్పుడు – బ్రహ్మదేవునకుగూడ ఒక నమస్కారము పారవేసినవారు పారవేసిరి. లేనివారు లేదు. పురవర్ణన ఘట్టమునందుమాత్రము ప్రతికవియు బనిపెట్టుకొని ఆ పట్టణమున బ్రాహ్మణుల యుత్కర్ష చెప్పుటకొఱకు బ్రహ్మదేవుని పడలాగికొనివచ్చి, 'నీవు ముదుసలివాడవు. నీకు మతిలేదు. ఛాందసుడవు; నీకు వేదములు తిన్నగ నోటికిరావు, నీకు వచ్చిన పాటివేదములు నేర్చుకొనుటకు నాలుగు ముఖములు కావలెనా ? ఇదిగో ఈ పురమునందలి బ్రాహ్మణోత్తముల చూడుము; ఏకముఖము తోడనే నాలుగు వేదములను ఎట్లు తిరుగవేసి చెప్పుచుండిరో !– అని మొగ మెదుట నాలుగు మాటలు అని, తిరిగి వచ్చినదారినే పంపింతురు. పెద్దవయసువానిని పనిచెఱపి తీసికొనివచ్చినారముకదా అని నాలుగు ఉపచార వాక్యములేని చెప్పి పంపరు. మఱికొందరు కవులు, శారదాదేవి వయసుకత్తెయైన విద్వాంసురా లనియు, ముదుసలి

మగడైన బ్రహ్మదేవుడు ఆమెను తలవాకిలి దాటకుండ జాగ్రత్త చేయుచుండు ననియు అభిప్రాయ పడిరి. మొదలీ కవులకు బ్రహ్మ సృష్టికంటె తమసృష్టి అధికమైన దనెడి అహంభావ మున్నట్లు తోచుచున్నది, అంతియేకాదు, సరస్వతి ఛాందసపు ముదిమగని ఎదలివైచి, తమ్మునే ఆశ్రయించిన దనెడి నమ్మకముతో, కొందఱు 'వాణి నా రాణి' అని చెప్పికొనజొచ్చిరి. ఇంతకు వారికంటుల దయ వచ్చినది.

కిన్నరీగాన ముఖరితములై, రత్నోజ్జ్వలములైన హిమవత్సానువుల నుండి కరగిపాఱిన పార్వతీపరమేశ్వరుల ప్రణయ భాగీరథిలో మునిగితేలిరి కవులు. పాలకడలిలో పాఁపరాపాన్పుపై బవ్వళించిన రమామాధవుల విశ్వప్రేయస్కరములగు ప్రేమతరంగ డోలికల నూగులాడిరి. నందనారామములో కల్పపాదపచ్ఛాయల అప్సరోనృత్యముల మధ్య శచీదేవేంద్రులు చవిచూచిన అనురాగ సుధాబిందు మాధుర్యమును మర్త్యలోకపు వారికి నెఱచూపి లిచ్చిరి. అట్టి కవు లే నిమిత్తముననో నారదాచలోష్ణుల శృంగార గాథామాధుర్యమును జవిచూపక వదలిపెట్టిరి. ఒక్క బాణభట్టు మాత్రము వారి గంభీరప్రణయమహిమ మొకించుక తడవి వదలి నాడు. ధాత సాధారణలోకమునకు బూజ్యుడు కాకపోవచ్చును, గాని కవి లోకమునకుగూడ పూజ్యుడు కాకపోవుటకు మాత్రము కారణము కనిపింపదు. బ్రహ్మస్తంభపర్యంతము వారికి కవితావిష యము కాని వస్తువులేదు. విశ్వమంతయు వారికి రసమయము. రస మయమైన ఈ విశ్వమునకు జననీజనకులైన వాణీహిరణ్యగర్భుల శృంగారలీల కవిభావనకు జక్కిలిగింత కావలదా ? రసపూర్ణమును

మధురభావ గర్భితమును, విశ్వహేతువు నగు ఆ నిత్యలీలారామణీ యకము ఒక్క పింగళి సూరన్నకే సాక్షాత్కరించినది.

విశ్వాత్మకుడైన శ్రీ మహావిష్ణుని జఠరగోళము పదునాల్గుభువనములకు ఊనికిపట్టు. చైతన్యస్వరూపమైన పద్మమే ఆయనకు నాభి. యోగనిద్రాధీనుడగు విష్ణుని నాభికమలమునుండి పంచభూతాత్మక మైన మహత్తత్వముద్భవించినది. అందు అహంకారము, మనస్సును జనించి సృష్టికిర్యకు గడంగినవి. మనోహంకారయుక్తమగు మహత్తత్వమే బ్రహ్మ. పృథివ్యప్తేజోవాయువులు నాలుగు ఆ బ్రహ్మకు ముఖములు. ఐదవదగు ఆకాశము తక్కిన నాల్గింటియందు నిండియుండుటచే నైదవముఖముతో బనిలేకపోయినది. ఆకాశగుణమగు శబ్దమునకే సరస్వతి యను పేరుపెట్టి, ఆ యమను చతుర్ముఖునకిచ్చి పెండ్లిచేసి, ఆయన ముఖములనే ఆమెకు నివాసములుగా జేసినవి. పురాణములు. కావునవే శబ్దాత్మకములగు వేదములు బ్రహ్మముఖోద్గతములైనవి. సరస్వతి రజశ్శక్తియనియు క్రియాశక్తియనియు దేవీభాగవతమతము. శక్త్యధీనుడై మహత్తత్వమూర్తి యగు బ్రహ్మ సృష్టిక్రియాదులను డగుచున్నాడు. ఇది పురాణములు చేసిన రూపకల్పన. మహత్తత్వమునకు ప్రాణమే ఆధారము. కావున చతుర్ముఖుడు హంసవాహనుడు. సత్యలోక మాయనకు నివాసము. బ్రహ్మాండమును లనెడి కుండలను నిర్మించు కుమ్మరి యాతడు. సమస్తభూతజాలముల నొసళ్ళపై పుణ్య పాప ఫలములు లిఖించు విధి యాతడు.

ఇక శబ్దరూపిణియగు సరస్వతి శరదభ్ర శుభ్రశరీర. సంగీత సాహిత్యము లాయమ వక్షోజములు. ఆమె వీణాపుస్తక రమ్య

పాణి. చతుర్ముఖుని ముఖములే ఆమెకు నివాసము. అభ్రబాంధవము, గాన రసజ్ఞమునగు మయూర మామెకు నెచ్చెలి.

ఇక సూరన్నగారి వాణీచతుర్ముఖు లందురా? వారు కేవల శృంగార నాయికానాయకులు. జగత్తు అంతయు వారి శృంగారకేళీ పరిణామము. ఒకరు రూపనిర్మాణము చేసిన, ఒకరు నామకరణము చేయుదురు. మనస్సు ఒక్క క్షణమేని ఊరక యుండదు. దానియం దనేక వృత్తులు, సంకల్ప వికల్పములుగా బయలుదేరుచుండును. ఆ సంకల్పవికల్పము లన్నియు నామరూపాత్మకములె యగును. అవియే బాహ్యజగత్తున బరిణామము పొందుచుండునవియు, కనుకనే జగత్తు అంతయు మనఃకల్పితమనియు తత్త్వజ్ఞులు చెప్పుచుందురు. అయినచో, సృష్టియేలేని సమయమున బ్రహ్మదేవునికి సంకల్ప వికల్పములును, మనోవృత్తులు నెట్లు బయలుదేరును? పంచ భూతములుగూడ అవ్యాకృతములై యున్న ప్పుడు మనస్సునకు విషయము కాదగిన దేమియుండును?

ఆకాశము తక్కిన నాల్గుభూతములకు ఆధారమని వెనుకనే చెప్పుకొంటిమి. కావున పృథివ్యప్తేజోవాయువులు ఆకాశమున ఒరసికొని విహరింపవలెను. శబ్దము బయలువెడలగనే సృష్టి ఆరంభమైన దన్నమాట. సృష్టి శబ్దమూలము. శబ్దమువినా సృష్టికి ప్రతీతియు ప్రసిద్ధియు లేదు. కావున పృథివ్యప్తేజోవాయువులతో గూడిన మనోహంకారములు ఆకాశమందు ప్రవర్తించి శబ్దస్పర్శ రూపరస గంధాదులైన విషయములను పుట్టించును. బ్రహ్మ తన్నుదానే ఉపాదానముగా చేసికొని రూపసృష్టిచేయుచు సరస్వతీ సహాయమున నామకల్పన చేయుచున్నాడు. ఇదియే సృష్టి రహస్యము.

దుర్బోధముగానున్న ఈ విషయమునే సూరన్న కథగా చెప్పి, దానికి కావ్యత్వసిద్ధి యొసగినాడు. విశ్వప్రపంచరహస్యమును, కావ్యదృష్టితో రసవంతముగా విప్పిచెప్పినాడు. వాణీచతుర్ముఖుల నీ విశ్వకావ్యమును రచించు జంటకవులనుగా చేసెను. సరస్వతీ సాహాయ్యములేక బ్రహ్మ సృష్టికార్యము నెరవేర్పజాలడు. కనుకనే 'నిగమంబుల పేరిట నాల్గురూపులం దనరెడి భార్యామాట జవదాటక సృష్టియొనర్చు'నని కావ్యారంభమున చెప్పినాడు. వాణీచతుర్ముఖుల నిత్యశృంగారలీల వల్లనే ఈ సృష్టి నిరంతరముగ సాగిపోవుచున్నది. సృష్టిహేతువైన ఆ జగత్కుటుంబుల దాంపత్యసౌఖ్యము అతి రమణీయముగా అభివర్ణించినాడు.

సూరన్నగారి బ్రహ్మ శృంగారనాయకుడు గాబట్టి ఆయన భూతిపూతలు, తులసి పూసలు, కెంజడలు, గడ్డము ధరింపక దుకూలములు, ఆభరణములు, అంగరాగములు ధరించి, వాణితో అంతఃపురోపవనమున విహరించుచున్నాడు. అరవింద నవామోదభరాలసపవనామోదము లుద్దీపన కారణములైనవి. అంతట వాణితో శయ్యాధిష్ఠితుడయ్యెను. ఎక్కడ? జింకచర్మము మ్రాదనో, దర్భాసనము మ్రాదనో కాముసుడీ తరుణ సంతాన కచ్ఛాయ యందు, తలిరుబొన్నపై సరోవరాభిముఖుడై శయనించినాడు. పతి పాదపల్లవములు తొడలపై నిడికొని వాణి యొత్తుచున్నది. అనాగరకలగు పూర్వకాలపు టాంధ్రకు పతిపాద సంవాహనము తప్పుగా రోచెడిదికాదు. పతికి పత్నిపాదపాతము కూడ తప్పుగతోచినదికాదు. అది యేమి విపరీతకాలమో.

సృష్టి జరుగవలెనన్న ముందు కామము కలుగవలెను. ఆ కామముచేత కలిగిన అశాంతినుండి సంకల్పస్థిరతయు, అనంతరము నామరూపకల్పనమును జరుగును. కాబట్టి, నలువ యంతట నిరంతరమై తనరారు మూరమర్దాంతతచే వాణిని పాన్పునకుతార్చి తన మొగంబులు నాలుగు నామె మధురాధరామృతాక్రాంతిరసోద్ధతిచే నొక్కపరి దత్తరిల, దదాననమును దనకై మరల్చుచుండెను. మనస్సు శబ్దదర్శనము కొఱకుపడెడి బాధయిది. కవుల కెల్లరకు నిది యనుభూతమే. వాణి ఆ లీలలకు నవ్వి - 'మేలుమేలు, ఇట్టి యన్యాయ మెందేని గలదా? మీ మొగంబులు నాలుగు నిమ్మానిక్కనువ్విళ్ళు లూరినచో వీకాస్యనగు నే నొక్కతెను ఎట్లు చాలుదును? ఇంతట జాలింపు' డనుచు మెడబిగించి, వక్త్రమించుక యెడముగా నిల్పి, అధరమున పాణి యడ్డమిడి, మొలకనగవుచే, గోపంబు చెలువు జిలుకు తళుకుజూపులచే, భ్రూలతా తాండవముచే, బ్రియుని మనస్సున మెఱయు మరుని బిగుల గెరలించెను. అజుడంతట నామె ముఖాబ్జము బల్మినివంచి, మోవిపై జేయటు పారద్రోచి, ఇంచుక నాటునట్లు అధరముపై బలుసేర్చెను. అంత నాయకు గళామర్మభేదనమై కంఠసీమలో నొక మధురాంచితశబ్దము మోహనమై ఉదయించెను.

చూచితిరా! భూ పంచక పరస్పరకషణముచే ఆకాశమున శబ్ద ముదయించినది. దీనిని నాయికానాయకుల బాహ్యారతిగా నభివర్ణించి నాయికాకంఠమున కూజితము లొదవిన వని చెప్పినాడు. నిశ్చలమై, నిర్మలమైన ఆకాశము భూతవ్యాప్తిచే శబ్దించినది. అంతట భూతమయ మీమును శ్లిష్టస్నిగ్ధమై బీజధారణయోగ్యమైనది. ఇక

సరస్వతీ చతుర్ముఖుల శృంగారము

విశ్వసృష్టి నారంభించుట కభ్యంతరమేమి ? వాగ్దేవి ప్రసన్నయై అనుగ్రహింపవలయునేకాని ఆమెయందు రమించెడి మనస్సున ఋషిత్వము, కవిత్వము కొఅవడునా? దర్శించిన యర్థమన్నచో అతి రమణీయమగు సరస్వతీముఖవిలాసము. అట్టి దివ్యదర్శనముచే వెడలు శబ్దముగూడ రమణీయమే యగునుగదా.

ఈ నాయికానాయకు లందఱివంటివారు కారు. కావున సూరన్నగారు సమరతోపరతముల దెసకు పోలేదు. భూతములు సృష్టికార్యమునకు సజ్జములైనవి కావున నిక మనోబుద్ధ్యహంకారములు సృష్టికి దొడంగుచున్నవి. బ్రహ్మ రజఃప్రధానుడు. సత్త్వము దమము నాతని కుపసర్జనములు. కావున త్రిగుణాత్మకములైన నామరూపములను మనస్సు కల్పించుచున్నది. ఆ కల్పనము శబ్దమయము. వాగ్దేవియందు పరావాక్కు దర్శనమిచ్చినది. ఇక వైఖరీ వాక్కు వెడలుచున్నది. ఇదియే వాణీచతుర్ముఖుల అభీష్ట రతికేళి. మనస్సున్కల్పన మొనర్చుటకుగూడ క్రియాశక్తి ప్రేరణము గావలయును. కావున సరస్వతి, కళామర్మభేదనముచే గలిగిన మూనలాఘవమును గప్పిపుచ్చగోరి, విభుని యభిమతకేళికి విఘ్నము సంపాదింపనెంచి, అధరపీడనాసహత్వ మభినయించుచు అవ్వలి మొగంబై పొరలినది. జలజభవుడంత విరహావికలితధైర్యుడై సరస్వతి నలుక దీర్చుట కుపాయంబు జింతించి, రసికశేఖరుడుగావున పురోవర్తిశాఖా సమాంచితరత్న పంజరమున ఉన్న చిలుకంజూచి 'ఓ చిలుక చెలువా_ ఉబుసుపోదు, కథయొక్కటి చెప్పవుగా'_ అనినాడు. చిలుక 'దేవరముందర నే నేమి కథచెప్పగలను? తమకేదైన

చెప్పినచో నాలకించెద' నన్నది. 'అట్లని చెప్పెద విను' మని కథ చెప్పుట కారంభించినాడు.

మనస్సు చేసెడి కల్పన లన్నిటికిని ఆత్మ ద్రష్టయై, జ్ఞాతయై సూత్రీకరించుకొని తనయందు ధరించుకొనును. ఈ సృష్టికార్యమున ఆత్మ కేవలము తటస్థమై యుండును. కనుక ఎన్ని కథలుచెప్పినను మనస్సు చెప్పవలసినదే. ఆత్మ సాక్షీభూతమై ఊరకొట్టుచుండును. ఈ సృష్టి వ్యాపారమున తగులొకానక పైనుండి చూచుచుండును.

ఇక చూడుము- విధాత మనస్సు ఎట్లు సృష్టించుచున్నదో! శూన్యమునుండి సృష్టి ఎన్నడు జరుగదు. బ్రహ్మకిచట దాను సరస్వతియు దప్ప ఇతరమైన ఉపాదానము లేదు. కాబట్టి తమ శృంగార లీలానుభూతినే పునస్సృష్టిచేసి చెప్పుచున్నాడు.

శారద శాలయలుక గల్పించుకొని యవ్వలిమోమునగా బొరలుటచే నామె ముఖచంద్రుడు కాసారమున బ్రతిఫలించుట నలువ యరసి 'కాసారపురమును పట్టణమున కళాపూర్ణుడను రాజుండెను' అని కథ మొదలిడెను. సద్యోయౌవనుడైన ఆతనికి స్వభావుడను సిద్ధుడు ధనుర్బాణములు, ఒక యరుణమణిశలాకయు నిచ్చెను. అని ఆమె భ్రూలతా పీక్షణముల సొగసును, అరుణాధర సౌభాగ్యమును బొగడినాడు. కుపితయైన భార్యను సాంత్వన మొనర్చుట కామె సౌందర్యమును పొగడుటకంటె చక్కని ఉపాయ మొండులేదుగదా. ఆ పొగడ్తలో నాగక, 'నీ వెంత కోపగించికొన్నను నా హృదయము, దృష్టియు నీ ముఖశోభ

యం దే లగ్నమై యున్నవిసువా!_నీ యలుక గూడ నా మనస్సును వశము చేసుకొనుచున్నది.' అని చెప్పుటకు మదాశయుడను రాజు రూపానుభూతి యనెడి భార్యతోడ, ధీరభావుడను మంత్రితోడ నచటి కేగుదెంచి, ఇంచుక ప్రవర్తించుట కళాపూర్ణుడారసి, ఆత్మ కోదండ విహారపట్టుత్వముచే ధీరభావుని పలాయితుని జేసి, తనకు శరణుజొచ్చిన మదాశయుని దత్కళత్రసహితముగా నేలి, వారిచే నూడిగము చేయించుకొనుచుండెను'_ అని చెప్పెను.

భర్తయిట్లు పలుకు నధీరోక్తులు సభ్రూవిలాసలోలలోచ నాంచలకషితకర్ణిక యగుచు, శారదవిని, ఇంచుక నవ్వుచు, సకుతూ హలమై చిలుకనుగాంచి_ 'ఆ రాజు నుతి యేమియయ్యె? ఆతనికి ఛల్లిదండ్రు లెవ్వరో? అడుగు'మని కడపెను. తన వదనవిలాస ముపై అల్లుచున్న ఈ యభూతకల్పన మెట్లు కొనసాగునో, ఎట్లు తుదముట్టునో వినవలయునను కుతూహలము నాపుకొనలేక శారద యిట్లు ప్రశ్నించెగాని, ప్రశ్నింపకున్నచో బ్రహ్మదేవుని కథ అంత టితో నంతమయ్యెడిది.

ఆ జగద్గురుడు మరల, చెప్పసాగెను_ శారదా ముఖచంద్రు నలంకరించిన యలంతినగవును కాసారప్రతిబింబమున ధాత సూచు చునే యుండెనుగాన, ఆ రాజు అభినవకౌముది యనుకాంతచే వరింపబడెను_ అనిచెప్పి, ఆ ప్రతిబింబశోభ ముఖసాదృశ్యంబు కారణంబుగా దత్కాసారమధ్య మణిస్తంభగర్భంబున నుదయించు చున్నట్లుండుట యరసి, ఆమెకు సుముఖాసక్తి తండ్రియు, మణి స్తంభుడు తల్లియునని పరాకుననో, తడబాటునననో, గడుసుదనము చేతనో స్త్రీపురుషత్వంబులు విజ్రుంభుపడం బలికెను. ఇంతకు విరహా

వికలితధైర్యుడైన వనజాసనునకు మనసు మనసులో నున్నది కాదు గదా - అదియునుగాక, కథకు కాళ్ళేమి? ముంతకు జెవులేమి? ఆమె యలుక తీర్చుటకు నోటికొచ్చిన అట్లు అల్లుకుపోవు' చున్నాడు.

శారద అంతట ఈ విపరీతోక్తులకు పక్కున నవ్వి, గ్రక్కున గ్రమ్మటి, విభుని కౌగిలించి,-ఔరౌర, ఇంతలోనే యెన్ని తబ్బిబ్బు లాయె, దద్దరిల్ల కుడని వీపుజఱచి-యెట్లైతిరూ! ఏమంటిరి? ఆ రాజు తల్లి మగడియు, దండ్రి అగువాడునా! అనుచు మరల మరల నవ్వుచు-చెప్పు డానీవు ప్రాణరమణ, ఏమి యయ్యె నా రాజు?- అని అడిగినది.

మాటుమోము పెట్టిన శారద, భర్త కథ చెప్పుట వినుచూ, ప్రథమమున చిలుక చే అడిగించినది-త్రిమూర్తి కథయడుగు; మని మరల కథ ప్రారంభించుసరికి తానే అడిగినది. అంతటితో తీరినదా? దద్దరిల్లకుడని వీపు చఱచినది. చెప్పుడామీవ ప్రాణరమణ అని ప్రసన్నయై కథ వినగోరినది.

శారద తన్నుగాంచి నవ్విన నవ్వుకొనుగాక, ఆమె ప్రసన్న యగుటయే అజునకు కావలసినది. అట్లు శారదానర్మలీలచే అధిక సంభృతానందుడై అపె కంఠము బిగ్గగౌగిలించి, నాల్గు మొగము లకు పరుసగలియునట్లు మెలపుమై కంఠము మలపుచు, గళము కౌగిలితోన చెక్కులు నిమురుచు, తదధరపాన మహోత్సవ మొసగెను.

ఈ లీలచే కథ పెరుగుచున్నదని యెఱుంగక శారద మరల జనితాధరపీడయై_ఇంక జాలింపు_డని కసరుకొనుచు, పై కథ సెప్పు డని కౌగిలి విడిపించుకొని, భర్తమోములు తన రెండుచేతులతో దూరముగ బాయబట్టెను. ఆ భంగిమముచే బ్రకాశితములైన కుచ కుంభ విజృంభణమును, లేగొను బెడంగును భర్త కనుంగొని మురియుచు, కథ యల్లుకొనుచు పెండియు నధరపాన మొనర్చెను. వాణియు_ఇవియెల్ల నేర్తురౌనౌ, నృపు డేమియయ్యో? కథ యూన తిండు_అని అడిగెను.

ఆన తిచ్చట కేమున్నది_సరస్వతి కదలిననూ మెదలిననూ ఉద్భవించుచున్న కథకు వేఱుగ వెదకికొనవలెనా_కథ సిద్ధముగనే యున్నది. సరస్వతి తన కభిముఖముగా బొరలుటచే కొలకులోని ముఖప్రతిబింబముపోయి ఆమె అంగదేశమున కంఠోపరిభాగమున గన్పట్టుటచే...ఆ రాజు అంగదేశమున గ్రముకకంఠోత్తర పుటమున పట్టము గట్టుకొన్నా_డని చెప్పెను. ఆ కంఠమును సువర్ణవర్ణములైన బాహువులచే తాను పరిరంభ మొనర్చెను గాన_మదాశయుండా పట్టణమునకు గనకప్రకారము పెట్టెను._ అని కథ యల్లెను. తనకు జనించిన అధరపానేచ్ఛకు మధుకలాలస యని పేరిడి_ఆమె మదా శయుని కూతు రనెను.ఇట్లు తన శృంగారలీల యంతయు సరసముగ అల్లుకొనుచుపోయి తుదకు మధుకలాలస కళాపూర్ణునిచే యూవన ఫల మనుభవించెనని యధరపానేచ్ఛ పరితుష్టి నొందుట వివరించెను.

ప్రౌఢయగు వాగ్దేవి కథయంతయు విని, భర్తచాతుర్యమున కెలనవ్వును, మర్మకర్మప్రకాశమునకు కృత్రిమరోషమును

పొడమ, బొమలు ముడిపైచి ... — అటు దలుడౌర! యెంతటి మహాత్ములు మీరలు, నాదుమీదనా కటకట! మీ వచోరచన కౌశల మో భువనప్రపంచ సంఘటన ధురీణ... అన్నది.

నిజమే-భువన ప్రపంచసంఘటన ధురీణుడే అగును. శారదానుగ్రహ మేమి చేయంపలేదు? వాణీపతియు తన చాతుర్య మున కల్గిన నవ్వుకొనుచు,-అటులనెద, వి౦డేమి కిటుకున్నది ? నీ కేమైన తెలిసినచో జెప్పుకొ-మ్మనియెను.

వాణి యంతటి,ఇన్ని నాళ్లు మీ సేవ చేయుచూ ఈ మాత్రము తెలుసుకొనలేనా ? ఈ దంటమాటలునూ, ఈ సరసోక్తులునూ నేను పెట్టినభిక్షకాదా? ఇప్పటి మన వృత్తమేకద యీ కథయం తయు-అని, అంతయు వివరించి చెప్పి-ఇది యంతయు నిట్లియగునో కాదో ఆనతీపలయు-నన్న-అట్లే, తప్పదు-అని విధాత నవ్వెను.

ఏల తప్పును? భువనప్రపంచ మేర్పడుచున్న దామాటల వెంబడినే. శారద అంతట ప్రేమప్రసాదమును, మెప్పును ఉట్టిపడ-

ఇమ్మగు బిరిహాసపు నా
క్యమ్మల యెద బొంకు వినముగా మీ వలనన్
మిమ్మగనిన హరి పొక్కిటి
తమ్మి కడుపు చల్లనై సదా మనవలయున్....

అని పలుక, జతురాననుము ప్రమోదమేమురహృదయుండై, తత్పరి రంభణపరుడై పొలుపొందెను.

కథ కంచికి వెళ్ళినది. పంజరబద్ధయై వినుచున్న చిలుక ఈ స్మృతిని మూటగట్టుకొని లేచిపోయినది. బ్రహ్మదేవుని మనస్సులో జరిగిన యీ వ్యాపారము మరల యెన్నటికేని బయటపడవలెనన్న అందుల కీ చిలుక యొక్కటే సాక్ష్యము. మనస్సుచేయు చిలిపి పనులు, తీరి కూరుచుండి కనులారచూచి, ఆసతో నాలకించి, ఆ వృత్తాంతమెల్ల వంటబట్టించుకొని, ఆ తలపులను దఱుమలేక, వానిని ఆవర్తించుచున్న దోసముచేత చిలుక తిరిగి శరీరబంధనము తెచ్చుకొని ద్వారకాపురమున జన్మించును. ఎంత యెఱుముగా నుండుచున్నను ఆత్మకు, మనస్సుచే వచ్చు దోషము కట్టి కుడుపక తప్పదుగదా!

వాణీ కమలాసను లిట్లు సత్యలోకమున సర్మలీలల వినోదింపుచు, కథలు చెప్పికొనుచుండ, ఆ కథ అంతయు ఒకప్రక్క జగత్తుగా రూపొందుచున్నది. సృష్టికర్తలైన వాణీహిరణ్యగర్భుల శృంగారలీలచే విశ్వప్రపంచము రూపెత్తుట న్యాయమేకదా! జగచ్చిత్ర వంకరులైన పార్వతీపరమేశ్వరుల కేళిచే రాక్షస సంహారకారియైన మహాతేజము పొడమినట్లు, విశ్వస్థితికారకులైన రమావిష్ణుల శృంగారకేళిచే లోకమోహనమగు మన్మథతేజము జనించినట్లు, వీరివలన జగత్తు ఆవిర్భవించుచున్నది.

ఈ కథయందు సూరన అద్భుతమైన కవితాశిల్పము ప్రదర్శించెను గాని మనకది ప్రస్తుతముగాదు. స్థూలదృష్టికిది చిన్న ఉపాఖ్యానముగా కన్పించినను యావత్కావ్యసృష్టికి ఇది బీజము. యావత్కథాసచ్ఛమునకు ఇది సూత్రముకూడ కాదగును. ఈ ఉపాఖ్యానమేకాదు. కథాపూర్ణోదయమునందలి ఉపాఖ్యానము

లన్నియు కూడ కథాపటమునందు పడుగుపేకలుగ అల్లుకొని యుండును.

ఈ కథయందలి సారమేమని యోచించిన—ఏమున్నది ? బ్రహ్మ హృదయము, దృష్టి వాణీముఖసౌందర్యమును మఱగి అధరపానకౌతుకమున ఉవ్విళ్ళు లూరుట, పరిరంభ సౌఖ్యమును, అధరపానమును పొందుట అను రెండుముక్కలు. ఎప్పటి పొలయలుకలు, సాంత్వనములు, చాటూక్తులు, సరస సల్లాపములు. ఇంతకంటె వాణీచతుర్ముఖులు చేసెడి ఇతర కర్మమేమున్నది. సంపాదించుకొనవలెనా? వంటచేసికొనవలెనా? వారిది దివ్యలీల. జగదుపాధికమైన మనస్సుచేయు ఈ కర్మమే జగత్కర్మయై సృష్టిహేతువగుచున్నది. మదాశయాదులగు పాత్రలు విధాతృ హృదయము, అధరపానేచ్ఛ, ముఖములు. అవియే విశ్వమున జనించి ఆ యా కష్టసుఖముల ననుభవించుచు మరల కర్మపరివృత్తములై జన్మపరంపరల నందుచున్నవి. ఈ పాత్రల పుట్టుకకు అనువైనపూర్వజన్మగాథలు కల్పించి, ఆ జన్మమందలి కర్మములుసంచితముగా, మదాశయాదుల కర్మములు ప్రారబ్ధములుగా నభివర్ణించి తదనురూపమైన ఆగామికర్మములుగూడ సంధానముచేసి మహోన్నతమైన కావ్యసృష్టి నొనర్చినాడు సూరన్న. ధాత సృష్టికంటె కవిసృష్టిలోగల విశేషమును, రామణీయకమును ప్రత్యక్షమొనర్చినాడు. సృష్టిగర్భస్థాశమున జొచ్చి, అందలి రహస్యమును, సౌందర్య మధురమును గోరిన పుట్టిచే అద్భుత కావ్యప్రపంచమును సృష్టించినాడు.

ధాత సరస్వతికి జెప్పిన కథమాత్రము చప్పగనున్నది. ఆ కథయొక్క ఆనుపూర్వికను విచారించినచో అతి రమణీయము, అతి

గంభీరమును. ఆ కథయందలి మదాశయాదులు, వారి చర్యలు, వాచ్యములు. అవి బాహ్యజగత్తునందలి చర్యలు. వానిచే వ్యంజిత మగు వాణీహిరణ్యగర్భుల నర్మలీల మాత్రము రమణీయము, రస వంతమును. ఆ నర్మలీల చర్మచక్షువులకు మానవబుద్ధికి గోచరించు నది కాదు. ఇంద్రియభోగ్యమైన బాహ్యజగత్తును పట్టుకొని వ్రేలాడు కవులు కనిమాత్రులు. నామరూపాత్మకమగు ఈ జగత్తు నందు నిగూఢమైన సౌందర్యమును, రామణీయకమును, రసమును, దివ్యలీలను దర్శించి శృంగారాది భేదములచే దానిని స్వర్ణపాత్ర ముల నందించువారే ద్రష్టలు. వారే ఋషికల్పులగు కవులు. వారే రససిద్ధులు. ఈ సృష్టికంతకు కారణము. బీజభూతమునైన ఆనంద రసమును సూరన్న దర్శించి ఆ దివ్యదృష్టిచే జగత్తును చూచి, రమణీయముగా వ్యాఖ్యానించినాడు. మన సుఖదుఃఖములకు, కామ క్రోధములకు నిర్వికారమైన ఆనందరసమే కారణము. కనుకనే అవి కవిదృష్టికి శృంగారాదిరసములుగా సాక్షాత్కరించుచున్నవి. కేవల సుఖదుఃఖములనే దర్శించుకవులు పెట్టునది మాధుకరభిక్ష. ద్రష్టలు అనుగ్రహించునది ఆనంభిక్ష.

బ్రహ్మచెప్పిన కథయందు కళాపూర్ణునకు సుముఖాసక్తి తండ్రియు, మణిస్తంభుడు తల్లియు ననినాడు. తడబాటునునో, గడుసుదనముచేతనో బ్రహ్మ మానసముచేసిన ఈ సృష్టికి అన్యథా కరణమెట్లు? కాక ఇది సంభవమగుట యెట్లు? సరస్వతికి గూడ ఈ సందియమే తోచి భర్తనడిగినది. ఆయన_అదియు నీ చేష్టావిశే షముచేతనే కాగల దనినాడు. చూచితిరా! ఈ గడుసుదనము. తాను చేసిన తప్పును ఆమె చేష్టావిశేషమున కంటగట్టుచున్నాడు. ఆమె

యీ మాటకు వెఱగంది, అంతలో సంతకమున్న దానుఁ—పరిహాసపు వాక్యమ్ములయెడ బొంకు వినముగా మిన్నా వలనన్... అని పలికిన మాట ఆదకువచ్చి, ఇంచుక నవ్వుచు...మీరు సృష్టికర్తలు ఎటులయినను జేయుగలరు. ఇష్టమువచ్చినట్లు చేసికొనుడుగాని మధ్య లేనిపోని నిందలు నాకు గట్టవలదు—అనినది.

మాటవరుసకు శారద అటు లన్న దేగాని నిజమునకు వాగ్దేవీ విలాసముగాక జగత్తునందు మఱి యేమున్నది. వాగ్దేవతయే మూగ వోయిన ఇక రూపములు, భేదములు, వ్యత్యయములు ఉండియు లేనటులేకదా.

దీనికేమిగాని, సూరన్న కవితాపరాకాష్ఠ యెట్టిదో చూడుడు. ఆ కథయందు మణిస్తంభుడే తండ్రియనగూడదా? సుముఖాసక్తియే తల్లి యనినచో తనకేమి చిక్కగలదు ? సులభముగ తేలిపోవు దానికి జేసేత జిక్కతెచ్చిపెట్టుకొనునుగదా. నిజమే కాని, యీ కథయొక్క పరమార్థమంతయు ఆ మాట తడబాటులోనే యున్నది. విరహాసహిష్ణుడైన కామునికునినోట వెడలిన తడబాటుమాటవలెనూ నున్నదది. మనబుద్ధికి నిరర్థకములుగా, అసంగతములుగా కన్పించు జగత్తునందలి వ్యత్యయములకుగల కారణమును కూడ బోధించు చున్నది. వాణీచతుర్ముఖుల ఆనందఖేలనమున కొక సంకల్పమా ? ఒక అర్థమా ? ఒక సంగతత్వమా? ఇవి యేవియు లేవు గనుకనే అది లీలయైనది. వారి అభీష్టకేళీపరత్వమునందు ఏమేమో చెప్పు కొందురు. ఏమేమో చేయుచుందురు. వారి కది లీల. మనకు గోల. సృష్టిలో వ్యత్యయములకు విరోధములకు గారణమేమి యని మన మెంత తల బ్రద్దలుగొట్టుకొనినను ఏమి ప్రయోజనము.విధాత చిత్త

మట్లు వచ్చినది. పిల్లికి చెలగాట, ఎలుకకు ప్రాణసంకట మన్నట్లు వారి పరిహాసములకు ఫలితము మనవంతుసకు వచ్చి అనుభావ్య మగుచున్నది.

ఆడువానికి మగదానికి గళాపూర్ణుడు జన్మించవలసివచ్చినది. అటులే జన్మించినాడు.

పిమ్మట ఈ కథయంతయు నిజముగ జరుగునని చతుర్ముఖుడు అనుటయు, తనూహలమున దనకు నగుబాటు వచ్చునని వాణీ భర్తను బ్రతిమలాడుటయు, ఆయన చలపట్టుటయు, అతి రసవంత ముగా వర్ణించినాడు సూరన్న. అది యంతయు మనకు ప్రస్తుతముగాదు.

మనకు దుఃఖబహుళముగా కన్పట్టు ఈ విశ్వమంతయు వాణీచతుర్ముఖుల ఆనందలీల వలె దర్శించి, జగత్తును ఆనందకంద ముగ, మంగళాంతమైన కావ్యముగ నిరూపించిన సూరన కవి బ్రహ్మకు జోహారులు.

వాణీచతుర్ముఖుల ఈ విశ్వలీల సూరన్న నమితముగ ఆకర్షించి మానసమును జూఅగొన్నది. ప్రభావతీప్రద్యుమ్నమున గూడ పాత్రముల కష్టసుఖములకు వాణీపద్మాసనుల ప్రణయకలహానకు ముడివెట్టినాడు. ఆ ప్రణయలీల లేక సృష్టియే లేదుకదా.

సూరన్న మాటలతోడనే సూరన్నకు జయువెట్టి దీనినిక ముగింతును.

చలువగల వెన్నెలలు చెలువునకు సౌరభము
గలిగినను, సౌరభము చలువయు దలిర్పం
బొలుపెనగు కప్పురపు బలుకులకు గోమలత
నెలకొవిన, సౌరభము జలువ పసయుం గో
మలతయును గలిగి జగముల మిగుల బెంపెనగు
మలయపవనంపు గొదమలకు మధురత్వం
బలవడిన నీడు మఱి కలదనగవచ్చు గడు
వెలయగల యీ సుకవి పలుకులకు నెందున్....

మా గురు దేవు లు

వీబదిరెండు వత్సరములనాటి మాట_నే నపుడు గుడివాడలో ఎనిమిదవతరగతి చదువుకొనుచుంటిని. ఆ దినములలో నానా రాజ సందర్శన మెట్లో నాచేత జిక్కినది. అదియె పనిగా పెట్టుకొని నేనా పుస్తకము చదివితిని. అందు మూడు వందల పద్యములు నోటికివచ్చి వేసినవి. అప్పటి కింకను జమీందారులనినను వారి యాస్థానము లనినను గౌరవముతగ్గలేదు. అటు గద్వాలనుండి ఇటు చెన్నపట్టణము వరకును గల రాజాస్థానములన్నియు మెట్టి తిరుపతి వేంకటేశ్వరులు ఆ రాజులను గూర్చి చెప్పిన పద్యము లన్నియు చదువుచుండిన ఉత్సాహము జనించెడిది. గద్వాల, ఆత్మకూరు, వేంకటగిరి, విజయ నగరము, నూజీవీడు, కిర్లంపూడి, సంస్థానములన్నిటికి ఆకవీశ్వరులతో నేనును తిరుగుచున్నటులె యనిపించెడిది. రాజదర్శనార్థము పడిగాపులు పడిఉండి

కఠినమ్ములగు రాళ్ళు గరపికట్టిన రామ
భజనాలయమ్ములే పడుకకాయె,
తాకిన మాత్రాన తనువు కర్రగజేయ
జాలిన చలినీట స్నాన మాయె

ఉడిసియు నుడుకని కడువేడి మెడుకులే
ఆకొన్న కడుపున కడ్డమాయె
ప్రభువిచ్చె వేనూట పదియాడు లనియెడి
స్వప్నంబులే ధనార్జనము లాయె.

అనుచు చెప్పిన పద్యము చదువుచున్నప్పుడు కవులపై జాలి, రాజులపై క్రోధము కలుగుచుండెడిది. ముఖ్యముగ ఆ కవీశ్వరులు_ రసికులు గానట్టి రాజుల గనబోము, చిల్లరకవులలో జేరబోము_ అనియు, ఇచ్చెదవుగాక మానెదవేమి కొదువ! మా కవిత్వ పరీక్ష సమ్యగ్గతి రచింపు_ మనియు;కీర్తికై రాకసుమీ_ అనియు,_కవితా లతాంగికిన్ ధనముప్రధానమా_రసికతాధికతాసుఖతల్ ప్రధానమా_ అని ధీరులై చెప్పుచున్నప్పుడు ఒడలు గగుర్పొడిచెడిది. ఓహో! కవీశ్వరులనిన ఇంత గొప్పవారు కాబోలు, రాజులనిన వీటికి లక్ష్యము లేనుగదా! ఇట్టి కవీశ్వరుల పుట్టుకయె పుట్టుక_ అనిపించెడిది.

వీరెట్టులుందురో చూడవలెనను కోరిక పట్టజాలక పనిగట్టికొని బందరు వెళ్ళినాను. వీరిరువురిలో వేంకటేశ్వర్లు అనువారు అచ్చట హైస్కూలునందు ఉండిరని విని, అక్కడ విచారింపగ, బచ్చుపేట యందు భైరవ ముద్రణాలయమువద్ద ఉందురనినారు. ఆ మధ్యాహ్న మువేళ వెదకికొనుచు వెళ్ళినాను. వారుకూడ బడిచుండివచ్చి, ఒక్క కునుకుదీసి లేచి, ఒక్క_ అరటిపండు అనుకొందును_తిని_ తాంబూలము సేవించుచుండిరి_ ఆ ముద్రణాలయము వెనుకనున్న చిన్న పంచలో. మెడలో రుద్రాక్షమాల, కత్తిరించిన మీసములు, రెండుబాసలకు మేమె కవీంద్రులమంచు దెల్పగా పెంచిన యీ కత్తిరింపు మీసములు_కొట్టవచ్చినట్లుండు ఆ ముక్కు, విశాలమగు

ఫాలము, నొసట కుంకమబొట్టు, నల్లని పలుచని శరీరము,– నాకు ప్రథమదర్శనమిట్లు లభించినది. భయము భయముగ నమస్కరించితిని. "ఎవరు నాయనా నీవు? ఎందు కొచ్చినా" వనినారు. ఎందుకువచ్చితి నని చెప్పుదును. వీమియు తోచక వీవియో పుస్తకములు కావలసి వచ్చితి నంటిని. రెండుమూడు పుస్తకములు తీసికొని డబ్బిచ్చివచ్చి తిని. ఇంత బులపాటపడి వచ్చిన పని అయిపోయినది. వారితో మాటాడుట కింకేముండును. సెలవుతీసుకొని వచ్చి రోడ్డుమీద తచ్చాడుతున్నాను – వారు స్కూలున కాదారినే వెళ్లుదురు గదా అని. కొంతసేపటికి, తెల్లని కొంచెం పొడవుపాటి కోటూ, తెల్లని తలపాగధరించి బందరుకీర్రుచెప్పులు తొడుగుకొని,గొడుగువేసుకొని మెడ ఓరగాపెట్టి శాస్త్రులుగారు స్కూలుకు వెళ్ళుచున్నారు. వారి వెనుకనే గుమ్మంవరకుపోయి ఒక్క నిట్టూర్పు విడచి తిరిగి గుడివాడ చేరుకున్నాను. ఆ నాటినుండి వారికి నా మనసులో గురుపీఠము వేసితిని.

మరుసటి సంవత్సరము బందరుహైస్కూలులో ప్రవేశించితిని. ఆ సంవత్సరమే హైస్కూలు నందు శతావధాన సభ. కాకినాడ నుంచి తిరుపతి శాస్త్రిగారుకూడ వచ్చిరి. రెండు దినములలో అవధానము పూర్తియైనది. పృచ్ఛకులేమి యడుగుచుండిరో, వీరు ఏమి చెప్పుచున్నారో–నాకు అవియేమియు పట్టలేదు. అద్భుతమైన ధారణాభారంతో కూడుకొనిన అవధానము నిర్వహింపుచునే వేంకటశాస్త్రిగారు ఛందోక్తులు విసరి, ప్రాస్తావికపు పద్యములు చదివి, సభను రంజింపచేయుచు మధ్యమధ్య ఆవలికివెళ్ళివచ్చి,యీ లోపల తిరుపతి శాస్త్రిగారు చెప్పిన పద్యపాదమేమియో తెలిసి

కొనుచుండుటచూడ వారేదియో అవలీలగా గోలీలాట ఆడుచుండిరా యనిపించెను. తిరుపతిశాస్త్రిగారు ప్రాణమూ మనస్సునుకూడ అవధానమునకె అప్పగించి అంతర్ముఖులై ఉందురు. వారు సభలో పద్యము చదివినపుడు ప్రతిపదము హృదయమునుండి ఉబికి వచ్చినట్లున్నది గాని కంఠస్వారస్యముతక్కువ. వేంకటశాస్త్రిగారిది జలదగంభీరధ్వని. వేటూరిప్రభాకరశాస్త్రిగారు చెప్పినట్లు 'మోహనంబున జగన్మోహనముగ'నుండెడిది దాబాణి. హరికథకుల కెల్లరకు నారాయణదాసుగారిది ఒరవడి యైనట్లు, ఆకాలపు కవీశ్వరులకు ఇతరులకు గూడ వేంకటశాస్త్రిగారి పద్యపఠనమే ఒరవడి. ఒక్కపొడుము పట్టు పట్టి, వారు పద్యమందుకొను సరికి సభయంతయు నిస్తరంగ సాగరమైపోయెడిది. అరచేతిలో చిటిక వేసికొనుచునే ప్రసంగమారంభించెడివారు. ఇక తుదవరకు ఒకటే ఛలోక్తులు, ఒకటే వ్యంగ్యోక్తులు, వక్రోక్తులు. బొగడినా తెగడినా సూటిగా మాట్లాడెడువారు కారు. దీనికి కారణము శాస్త్రిగారికి వల్లమాలిన మోమోటము యగుటచే ముఖస్తుతీ నిందా వారికి గిట్టదు. వారి ప్రసంగములందు సభారంజనకొఱకు శాఖాచంక్రమణ మెక్కువగా ఉండెడిది. వారి మతము మనకిష్టమైనను కాకున్నను చెవులప్పగించి కూరుచుండవలసినదె. ఆ హాస్య ప్రవాహమధ్యమున మన మతము నెక్కడ ఖండించుచుండిరో; ఎక్కడ మనలను మభ్యపెట్టుచున్నారో తెలిసెడిది కాదు. వారుచెప్పునది మన మతమునకు విరుద్ధమైనను, ఆ చెప్పెడి పద్ధతిలోని మార్దవము మనల లోగొనును. వారుఆక్షేపించినను చీవాట్లు పెట్టినను ఆనందముగనే ఉండును. మధ్య మధ్య పద్యములు, పిట్టకథలు, ఒక టేమిటి— మనలను తిట్టుచుండిరో దీవించుచుండిరో ఆ మాట ఇంటికి పోయి ఆలోచించుకొనవలసినదే.

అవి నేటికాలపు లెక్చరులవంటివి కావు. రాజాస్థానములందుగంటల కొలది నడచు సరసప్రసంగములు. అవి వీనుల విందులుగాని ఉపన్యాసములు కావు.

అటుపిమ్మట వారివెంట ఊళ్ళకుతిరిగి ఎన్నియో అవధానములు చూచితిని. అవధాన భారమంతయు తిరుపతి శాస్త్రిగారికే వదలి వేంకటశాస్త్రిగారు మాత్రము సభకట్టు ప్రధానముగ పెట్టుకొనినట్లు కనుపించినను ఒకచూపు .సదా అవధానము మీదనే పెట్టి ఉండెడివారు..వారు సహస్రావధానులు. ఎక్కడ పొరపాటు జరిగిపోవునోయని బెబ్బులివలె పొంచి ఉండెడివారు. ఆ యవధానవిద్యా-ధారణ ప్రభావం; ఆ సభారంజనం, వారితోడనే చెల్లు.

ఆ రోజులలో బందరులో ఎన్నియో సభలు సాహిత్యవిషయికముగా, సంఘసంస్కార విషయికముగా జరుగుచుండెడివి. సంగీత కచ్చేరీలు; నాటకములు, సమ్మానములు జరుగుచుండెడివి. ప్రతి సభలోను శాస్త్రిగారి ఉపన్యాసము తప్పదు. సభ్యులు మధ్యలోనే లేచిపోకుండ కొనవరకు ఉండుటకై శాస్త్రిగారి ప్రసంగము చివరకు వీర్పాటు చేసెడివారు. బడిలో ఉన్నంతదనుకెగాని, ఇల్లు జేరగనే శాస్త్రిగారు కోటు, పాగ వంకెకు తగిలించి నీరాకావి పంచె, బుజమున కొల్లాయిగుడ్డ వేసుకొనెడివారు. సభకు వచ్చినను అదియే వేషము. సభావేదిక నెక్కుటకు వారు లేచినదె తడవుగ సభయంతయు చెవులు దోరబెట్టుకొని ఉండెడిది. రొండినుండి పొడుము కాయ తీయుచు,వారి శ్రవణానందమునందు కథానాయకుడు కవీశ్వరుడగుటచే శాస్త్రిగారు తమ లక్షణములన్నియు ఆ కథానాయకునకు ఆపాదింపుచు "మాటలాడగ నేర్చు మధురమ్ముగా విన్నవార లెల్ల

రును వహ్వాయనంగ" అని చెప్పిరి. ఇది మువ్వాటికి స్వభావోక్తి.

శాస్త్రిగారి ప్రౌఢ నిర్భరవయఃపరిపాక మంతయు బందరు లోనె గడచినది. వారి గ్రంథము లందు మూడువంతు లచట వ్రాసిరి. గుంటూరుసీను, గీరతం వివాదములు అచ్చటనే వ్రాసిరి. అద్యతనాంధ్ర కవిప్రపంచ నిర్మాతలైన వారి కవిత్వమునుగూర్చి ఇపుడు క్రొత్తగ చెప్పనదేమిగాని, వారి తక్కిన గ్రంథములన్నియు ఒకయెత్తు-గీరతం గుంటూరుసీను ఒకయెత్తు అనియందురు.

తన్మయత్వమో, ఆవేశమో, కలిగినపుడు వారు పద్యములు వ్రాయుటకాదు. ఏదియో ప్రవాహము ఉబికి వచ్చెడిది. దానిని కాగి తముమీద పెట్టెడి వ్యవధి ఉండెడిదికాదు. నిద్రాహారము లుండెడివి కావు. ఇంటిలో, బడిలో, వీధిలో, క్లబ్బులో ఎచట ఉండినను చీదర గాని సివమెత్తినట్లుండెడివారు. మనస్సులో పద్యములు పరుగులెత్తు చునే యుండును. పైమీద గుడ్డడున్నదో లేదోకూడ తెలిసెడిది కాదు. అది మహాకవిత్వ దీక్షావిధి.

శాస్త్రిగారు ముక్కోపి, కలహప్రియుడు అని కొందరందురు. గర్వియని కొందరందురు. వాస్తవమునకు శాస్త్రిగారివంటి నిరాడంబరులు, నిగర్వులు అరుదుగా ఉందురు. "ప్రతిఘటించుచోటనల పద్మభవుఁడగు గాక, లేక తత్సుతి యగుగాక పోరుటది తప్పదు." అనినాడు. పోరుట యెందులకనిన-న్యాయముకొర కనిరి. కుడిచి కూర్చుండి కలహములకు కాలుద్రవ్వరు. ఎవరైనను అకారణముగ కదిలించిన మన కెందులకని ఊపేక్షించరు. తరిమి తరిమి ఆసీమాంతము చేసికాని వదలిపెట్టరు. తిట్టినను, దులుపుకొనిపోవు అహింసా

స్వభావము కాచు. అనుకూలుడగు వాని కణగియుందుమని వారే అనినారు. ఔను! అనుకూలులైన మిత్రులు, శిష్యులు ఎంత ఆడ్డే పించినను, అవినయము నెరపినను కోపగించుట వారెరుగరు. ఇట్టి సరస స్వభావులయ్యు మరి ముక్కోప మెందులకనిన – ఎదుటి వారు అన్యాయమునకు అసత్యమునకు దిగినపుడు మాత్రము వారికి కోపము ముక్కుపై నుండెడిది. అసత్యమనిన వారి కరికాలిమంట నెత్తికెక్కెడిది. వారికి దాపురించిన కలహములన్నియు సత్య నిర్ధారణకొఱ కనుట అతిశయోక్తి కాదు. "నాలుక రెండె నాకు పిననాడు మొదల్మరి నేటిదాక" అని వారే చెప్పికొనిరి. సత్యము పట్ల తనవారు పెరవారు అని భేదమెరుగరు సరికదా, కన్నబిడ్డను, అల్లుని సైతము వీధి కెక్కించ గలరు. ఈ స్వపక్ష పరపక్ష నిర్ధూ మధామతయే వారికి బంధువిరోధి యను బిరుదము నార్జించిపెట్టినది. ఈ సత్యప్రీతియే వారికి అటు శిష్యుడి తోడను, ఇటు గురువుతోడను గ్రుద్దు లాట తెచ్చిపెట్టినది.

"నేను కవిత్వము కొఱకు పుట్టితి"ననిరి. అరువదేండ్ల సాహిత్యచరిత్ర వారి చరిత్రతో ముడివేసికొనిపోయినది. తమ చరిత్ర కపచారము కలిగిన అది సాహిత్యమునకే అపచారముగ భావించెడివారు. ఆ యాభిజాత్యమువల్లనే వారు జాతకచర్య అను పేరుతో తమ చరిత్రను రచించిరి. శ్రీ వీరేశలింగం పంతులుగారి కంటె ముందుగనే తమ గ్రంథములందు ఎవరేని తప్పులు పట్టినప్పుడు వారు ఉపేక్షించి యెరుగరు. "మీరు పెద్దలు, ఎవరో ఏదో తెలిసీ తెలియక వ్రాసిన, దానికి, మీరింత శ్రమపడుట యెందులకు?" అని యెవరైన మందలించిన "ఇది నా గ్రంథముల

పట్ల మమకారము కాదు. సుశబ్దమును అపశబ్దమనిన అది భాషకప చారమగును. అందులకు నా కీ శ్రమ తప్పదు" అనినారు. పండిత లోకములేదా, దేశం గొడ్డుపోయినదా అనిన- "నా పని ఇంకొకరికి వదలిపెట్టు సోమరితనం నాకు గిట్ట"దనెడివారు. అన్నట్లు శాస్త్రి గారు తమ ఎనుబదేండ్ల జీవితములో ఒక్క క్షణమేని వృధ పుచ్చి ఎరుగరు. మంచము దిగలేని స్థితిలోగూడ అలాగ్గా పండుకొని వేదియో వ్రాయుచునే ఉండెడివారు. కాలం విలువను, తమ జీవితపు విలువను పూర్తిగా ఎరిగి ఆహార నిద్రాదులు నియమపూర్వకముగా జరపుకొనెడివారు. మరి రెండు దినములకు దేహము చాలించెద రనగా వ్రాతకు శక్తిచాలని స్థితివచ్చినది. "నా కలం ఆగిపోయినది- ఇక ఈ దేహముతో పనితీరినట్లే" అనినారు.

ఈ వివాదములలో మీరు కల్పించుకొనకపోయిన మీ శిష్యకోటి లేదా? అని యనిన-వారు లోలోపల నవ్వుకొనెడివారు. ఆ పని వారు చేసినంత శ్రద్ధగ ఇతరులు చేయలేరని వారికి నమ్మకము. అతియకాక, శిష్యులకొంపమీది కెసరు వచ్చినపుడుకూడ వారే చక్ర మడ్డిడివారు. వారి అపారగ్రంథరచన మంతయు వారు స్వయ ముగ వ్రాసికొనినదె గాని ఒకరికి చెప్పి వ్రాయించుకొనుట వా రెరుగరు. శుద్ధప్రతి అవసరములేదు. "నాకు సర్వమూ చిత్తేగాని సాఫంటూ లేదు" అని వారే చమత్కరించిరి.

దేశము నాల్గుచెఱగుల విస్తరించియున్న వారి విద్యాకుటుం బము నేటికిని శాస్త్రులవారి వాత్సల్యమును చల్లనివేళల స్మరించు కొనుచుండును. బందరు వదలి కడియం చేరినపిమ్మట "నేను కలం

వదలి హలం పట్టుకొనినా" ననిరి. అచటనున్న పాతికేండ్లలో ఎంద రికో అన్నదానము విద్యాదానముకూడ చేసినారు. శిష్యులను వెంటబెట్టికొని మామిడితోటకు వెళ్ళుచున్న శాస్త్రులవారి నొక శిష్యు డిట్లు చిత్రించెను—

నొసటం గుంకుమబొట్టు కేలనొక పొన్నుంగట్టి పాదమ్ములన్
వెసపాపోసులు దాల్చి మేముమటకున్ వెళ్లైన గుండంచు
మే-ల్వీసనం-బంచులు జారకట్టికొని క్రేపన్ మేముకాన్
తోటకుం. బసరున్ సంజలనేగు మా గురుని రూపంబేను ధ్యానించెదన్.

ఇలా తరచిన కొలది ఏవియో స్మృతులు తలపుకు వచ్చు చుండును. మా గురుదేవు లెనుబదియేండ్లు జీవించిరి. విస్తృతమైన విద్వాకుటుంబమును, శాశ్వతమైన కావ్యసంసారమును ఆర్జించు కొనిరి. "నే వెదుకన్ లేదొక వేడ్క కేనియును, దా వింతలయే కాని"...అన్నట్లు వారు సమస్త భోగములను యనుభవించిన పూర్ణకాములు. వారు బడయని గౌరవము లేదు. స్వతంత్ర జీవ నము నెరపి కవివీరు డనిపించుకొనిరి. మదరాసునుండి ప్రభుత్వమే కదలివచ్చి విజయవాడలో ప్రభుత్వ ఆస్థానకవిగా వారి నభిషేకించి నది. అనాటి వారి ప్రత్యభివందనమునందు "తల్లీ ! నాకు సమస్త మును కోరకయే యిచ్చితివి. నన్ను నీ యాస్థానకవిగ చేసు కొనుము. ఇదియే నేను నిన్ను కోరెడిది" అని ఉపాస్యదైవమైన కామేశ్వరిని ప్రార్థించిరి. మరి యీరుమాసములు తిరుగకుండగనే శివరాత్రి పుణ్యకాలమున తనువు చాలించి శివసాయుజ్యమును పొందిరి. నిన్న మొన్న జరిగినట్లు యనిపించును కాని పదకొం డేండ్లు గడచినవి. వారు దిగవిడిచిపోయిన కుటుంబమునకు, విద్వ వంశమునకు వీటి యన్నిటికంటె వారికి ప్రియతమమైన వారి అచ్చ కీర్తికి స్వస్తి పలుకుదము.

BLANK PAGE

చిత్రశాల

1945 వ సంవత్సరములో మాచెర్లలో కీ. శే. ముట్నూరి కృష్ణారావు పంతులుగారి స్మృతిచిహ్నముగా శ్రీ బాబూ ప్రమోదకుమార చటర్జీ గారి ఆధ్వర్యమున నిర్మించుచున్న "చిత్రశాల" అను కళాశాలా మందిరమునకు శంకుస్థాపనమహోత్సవము జరిగినది. శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావుగారి అధ్యక్షతను జరిగిన ఆ ఉత్సవమున చేసిన ప్రసంగము — ఇది.

కాలరుద్రుని ప్రళయతాండవ మొకవంక, విశ్వసర్గ మింకొక వంక; నిత్యసృష్టి, నిత్యప్రళయము— ఇదియే జగత్తు. కోట్లకొలది మానవులను యుద్ధమిషచే దనలో గలిపికొన్న జగద్ధాత్రియే ప్రతిక్షణము బ్రాణికోటిని గడుపార గనుచున్నది.

మానవుడు దాను నిర్మించుకొన్న ధర్మములను, మతములను తనతోపాటు నాశనమొనర్చుకొనుచున్నాడు. ధర్మహాని కలిగినపుడు అధర్మము చెలరేగి, తన్ను దా నాశనమొనర్చుకొనుచున్న దనియు నూహింపవచ్చును. అధర్మనాశనమం దే ధర్మబీజములు మొలచికొని వచ్చి మానవత్వమును దనయందు ధరించి రక్షించుచుండును.

చీనా బర్మాలలోని బౌద్ధ దేవాలయములు, ఇస్లాము దేశములలోని మసీదులు, యూరపునందలి క్రైస్తవ ప్రార్థనాలయములు-ఎన్ని నాశనమైపోయినవో యీ యుద్ధప్రళయమందు! సనాతనమైన భారతధర్మము, నవీనమైన సనుతాధర్మము గూడ మానవత్వమును రక్షింపలేకున్నవి. అర్థకామవశమై, లోభక్రోధావిష్టమై, హింసాకళంకితమై, అల్లాడి నశించుచున్న మానవత్వమును ఉద్ధరించెడి అహింసాధర్మము లోకమం దవతరించుటకు గాలము పరిపక్వమై తోచుచున్నది. ఈ మహాయుద్ధమే అహింసా ధర్మ ప్రవేశమునకు బూర్వరంగమేమో!

హింస మానవుని ప్రళయము దెసకు, అహింస సృష్టి దెసకు నాకర్షించుచుండును. ఛాయాతపన్యాయముగ మానవుని యందున్న ఈ రాక్షసత్వ దేవత్వములే మానవేతిహాసము నెప్పటి కప్పుడు మంగళాంత మొనర్చుచుండును. జరామరణ జర్జరితమై, దుఃఖబహుళమై కన్పించుచున్న జగత్తున కాదియందు నంతమందు నున్న మాంగళ్యమును దర్శించినవారే ఋషులు, కవులు, శిల్పులును. క్షణక్షణము బుట్టిగిట్టుచు, పరిణామశీలము, నశ్వరమునగు జగత్తునందు నిత్యము సత్యమునైన మంగళమును ధ్యానించి, తద్రూపసాక్షాత్కారమునకై తపించి, దర్శించి, దానిని శిలలలో గండరించి, వర్ణములచే జిత్రించి, శబ్దార్థములచే రూపెత్తించి, స్వరమేళనముచే గానమొనర్చి తపస్వులే నవధర్మప్రవర్తకులు. వారిసృష్టి అమరము.

మహానందరసమందు బుట్టి, మహానందరసమందే లయమందు చున్న జీవకోటికి కవులును, శిల్పులును దుఃఖావరణమును దొల

గించి సౌందర్యమును, సత్యమును వీనులచే గన్నులచే ననుభవింప జేయుచుండురు. మన యింద్రియముల కతీంద్రియత్వమును బ్రసాదించి, భూలోకమును స్వర్గధామముగ మార్చుచుందురు. సంసారపతితుల కోశిల్పాదికళలే కల్పవృక్షములు.

భూతదయాపరులు, సత్యవ్రతులు, లోకారాధకులునగు బౌద్ధ భిక్షువులు కళాకల్పకమును గొనితెచ్చి, యీ కృష్ణాతీరమున నాటిరి. ఆంధ్ర సాతవాహన చక్రవర్తుల సామ్రాజ్యలక్ష్మి ఆ కళా లక్ష్మితో జెట్టులువట్టి, కృష్ణాతీరమున వాహ్యాళివెడలి, సముద్రములు దాటి, ద్వీపాంతరముల నందగించినది. ఆ స్వర్ణయుగమందె సిద్ధ నాగర్జునుడు డీ కృష్ణాతీరమున భిక్షుక సహస్రముతో విడిసి, పర్వ తములను విహారమందిరములుగా, చైత్యారామములుగా దొలి పించెను. బౌద్ధశిల్పుల అమృతహస్తస్పర్శచే గఠిన పాషాణములు మైనమువలె మెత్తబడినవి. వాని శోణముల మైత్రిచే జడములు చేతనములైనవి. బుద్ధదేవుని నిశ్చల తపస్సమాధియు, అపార కృపారసమును గండారపుబొమ్మలైనవి. ప్రతిశిలయు జాతకకథలతో నిండిపోయినది. రాళ్ళకు నోళ్ళువచ్చి, బుద్ధదేవుని జీవకారుణ్యమును సహస్రకంఠముల గానముచేయ నారంభించినవి. విద్యాసముద్రుడైన సిద్ధనాగార్జును డొకవంక, శోభనశీలురగు బౌద్ధశిల్పు లొకవంక నాంధ్రమహాజనుల కిట్లు జ్ఞానసత్రమును, సౌందర్యసత్రమును సాగించిపెట్టిరి.

ఆంధ్రసామ్రాజ్య మేమో మాసిపోయినది. కాని, నాటి యాంధ్రులనడక నాగరికములు గాథాసప్తశతిలో అక్షరరూపమున

నిలిచిపోయినవి. బౌద్ధధర్మము కృష్ణాతీరములు వదలి, ఖండాంతరములకు వలసపోయినది. నాగార్జునుని జ్ఞానవాహినిమాత్రము దేశమంతట ప్రాకినది. ఆంధ్రుల సౌందర్యబోధము భారతదేశమంతటిని శిల్పసృష్టిచే చిగుర్పజేసినది. ఆ జ్ఞానమునకు, సౌందర్యమునకు నేకసాక్షియైన ఆతనికొండ నేటికిని నిల్చియున్నది.

కృష్ణానదీ తీరము పొడవున నెన్ని సామ్రాజ్యములు, నెన్ని ధర్మములు నిట్లు వెలసి, సమసిపోయినవో! ఈ నదీగర్భమున రత్న సింహాసనముల తునుకలు, ధర్మజీవనుల యస్థిపంజరములు నెన్ని దాగియున్నవో! ఈ శ్మశాన వాటికనుండి నాగార్జునశిల్ప నిక్షేప మెట్లో బయటబడినది. సామ్రాజ్యముల నిర్మించిన ఆ శౌర్యము కృష్ణాతీరమును శిల్పనందనవనమొనర్చి, భోగీరలోయలో ఎల్లోరా గుహాలలో సౌందర్యదేవతాలయముల నిర్మించిన ఆ కళావిదగ్ధతయు నాంధ్రులకు స్వప్నవృత్తాంతములై, కథలు, కల్లలు నైపోయినవి.

గుంటూరు మండలము తెలుగునాటికి నడిబొడ్డు. అందు పలనాడు పోతుగడ్డ. ఆంధ్రుల వీరభారత మిచటనే ప్రవర్తిల్లినది. కార్యక్షమములకు దానే చాలి నాయకురా లనిపించుకొన్న నాగమ్మ పుట్టిన యీ వీరభూమిలో మల లన్నీదుర్గములే; వాగులన్నీ శౌర్యరసవాహినులే. ఆంధ్రభారత భీష్ముడైన బ్రహ్మనాయనికి బురిటిగడ్డయైన యీ మాచెర్ల ఆంధ్రులకు పుణ్యక్షేత్రము. ఆ రాజర్షికి గురుపాదులైన చెన్నకేశవస్వామి యాంధ్రదైవతమణి. ఆంధ్రభారతాభిమన్యుడైన బాలచంద్రునకు శైశవ క్రీడారంగ మిట్టా మాచెర్ల. ముక్కుపచ్చలారని పూపప్రాయమునాడే వీరపత్ని

యనిపించుకొన్న మాంచాలకు నాగవాసమిది. బ్రహ్మనాయని జ్ఞానమును, బాలుని శౌర్యమును, మాంచాల యాభిజాత్యమును చంద్రభాగానది కొండకొమ్మలనుండి యెత్తిపోయుచున్నది. ఆ యెత్తి పోతలలో మునుకలు వెట్టుటయే తెలుగువానికి త్రివేణీ సంగమ స్నానము. పలనాటి వీరకథాకోవిదులైన యిచటి గ్రామవృద్ధులు నేడు చెన్నకేశవాలయ మంటపములో, రచ్చసావళ్ళలో నేమి ముచ్చటలాడుకొందురో కదా! వీరులను దైవములుగా గొలిచెడి యీపల్నాటిప్రజల భక్తిసారళ్యములు కైవారమొనర్పదగినవికదా! ఈ మాచెర్లవీధులలో నెదురగు ముద్దరాండ్రలో మాంచాల కన్పించునేమోయని! కనులువెదకును. చంద్రపంకదరిని గోడుబిళ్ళ లాడు బాలకులలో బాలచంద్రు డింకను ఆటలాడుచుండడుగదా! యని హృదయ ముప్పొంగును. చెన్నకేశవాలయద్వారమున అడు గిడి నపుడు వీరవైష్ణవోత్తముడగు బ్రహ్మనాయు డెదురగునేమో! యని చేతులు మోడ్చుచెందును. సర్వవర్ణములవారిచే నేకపంక్తిని చాపకూళ్ళ కుడిపించిన వీరవైష్ణవమునకు జన్మభూమియైన యీ పుణ్యక్షేత్రమున ఆ సమతాధర్మ మెచట దాగియున్నదో; ఏమో! అట్టి వీరులను గన్న యీ పుణ్యభూమి గొడ్డుపోయినదా! ఆనాటి భక్తిసౌందర్యవీరము లేనాటికెట్లు మరల తూపెత్తునో!

రండు! నవధర్మావతరణము నెదురుచూచు కళాతపస్వులు, సౌందర్యారాధకులు ఈక్షేత్రమును సేవింప రండు! ఇదిగో! నాగార్జున శిల్పకళాపీఠము. పలనాటివీరులు, ధర్మప్రవర్తకులు, మానవతులగు సుందరులునిచట తూపెత్తున్నారు. ఇచటి చేలకు గంచెలుగా, పెరళ్ళకు గోడలుగా నిలిచి, పలనాటి కేకభాగ్యములైన చంద్రశిలా

ఖండములలో వారు దాగిదోబూచులాడుచు, కలలుగనుచు,నిమురించుచు నున్నారు.కళారాధకులగు నాంధ్రబాలికాబాలకులు భక్తిశ్రద్ధాణములతో దట్టి,మెలుకువమై వారిని మేలుకొల్పుదురేని క్రోరమ్మానసములు మెలివైచి,అవుడుగరచి నిలుతురు.పాతివ్రత్యము సుభగసుందరాకృతులతో కేలొగిచి నిలుచును. శౌర్యమును, సారళ్యమును, ఆర్జవమును, సత్యమును, సౌందర్యమును దనులోగండరింపుడని చేరబిలుచు నా శిలాఖండములను బ్రదికింపుడు. ఈ పలనాటి భూఖండమును శిల్పసద్మముగా రూపెత్తింపుడు.

సిద్ధహస్తుడగు ప్రమోదకుమారచతోపాధ్యాయుడు ప్రసన్నవదనముతో,ఉపదేశముద్రతో నిలిచినాడు. తూలికాహస్తుడగు నా యాచార్యుని యాశీర్వాదము మీకు గళాసిద్ధిని గైవసమొనర్చి, సుందరజగన్నిర్మాణమునకు దోడుపడుగాక!సహృదయుడు,రసజ్ఞుడు, కవిమిత్రుడునగు (శ్రీ) కోలవెన్ను రామకోటీశ్వరరావుగారి కల నికష-ల యగు గాక ! సకలకళారహస్యజ్ఞాత బ్రహ్మవేత్తయునైన ముట్నూరి కృష్ణరాయల స్మృతిచిహ్నముగా వెలయనున్న యీ చిత్రశాల ఆంధ్రజన జీవనమును దరతరాల సుందరమొనర్చుగాక.

BLANK PAGE

01874

మా ప్రచురణలు

★

సాంచరనంచం
పన్నెటిజల్లు
బగ్‌జార్గల్లో
నల్లకలువ
శిఖరాలు పరిహద్దులు
కాలనాథుని రథయాత్ర
దిగ్విజయం
సైనికుని లేఖలు
శిరోమణి
శ్రీనివాస కళ్యాణం

154